www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 6-6-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 51 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య సా. 6.09 తదుపరి పాడ్యమి, నక్షత్రం: రోహిణి రా. 8.16 తదుపరి మృగశిర, వర్జ్యం: ఉ. 12.36-2.28, రా. 1.44-3.18, దుర్ముహూర్తం: ఉ. 10.03-10.55, మ. 3.15-4.07, అమృతఘడియలు: సా. 5.12-6.44, రాహుకాలం: మ. 1.30-3.00, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.44 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వేచి చూస్తాం

బీజేపీ పాలన వద్దని దేశ ప్రజలు తీర్పు ఇచ్చారు
వారి ఆకాంక్షను నెరవేర్చడానికి ప్రయత్నిస్తాం
మోదీకి నైతికంగా ఘోర పరాభవం 2
బీజేపీ ఫాసిస్టు పాలనపై పోరు కొనసాగిస్తాం
భావసారూప్య పార్టీలను ఆహ్వానిస్తున్నాం: ఖర్గే
ఆయన నివాసంలో 'ఇండియా' నేతల భేటీ


ఖర్గే నివాసంలో సమావేశమైన ఇండియా కూటమి నేతలు

సమావేశానికి ఉద్ధవ్ గైర్హాజరు


ఎన్డీయే భేటీలో మోదీ, చంద్రబాబు, నితీశ్, ఏక్‌నాథ్ షిండే

మోదీ 3.0

ఎన్డీయే సారథిగా మళ్లీ ఏకగ్రీవ ఎన్నిక

కూటమి భేటీలో బాబుకు ప్రత్యేక ప్రాధాన్యం

- రేపు ఎన్డీయే పక్ష ఎంపీల సమావేశం
- నేతగా లాంఛనంగా మోదీ ఎన్నిక
- అనంతరం రాష్ట్రపతిని కలిసి నివేదన
- అదే రోజు మిత్రపక్షాల సమావేశం
- మంత్రి పదవులెన్నో, ఎవరెవరికో చర్చ
- 9న మోదీ సహా కేబినెట్ ప్రమాణ స్వీకారం
- మంత్రివర్గంలో చేరతాం: చంద్రబాబు
- మళ్లీ రేపు హస్తినకు వస్తా.. ఎల్లుండి ప్రధాని ప్రమాణానికీ హాజరవుతా
- 12న ప్రమాణ స్వీకారం చేస్తా.. మోదీని ఆహ్వానిస్తా: టీడీపీ అధినేత
- గెలుపోటములు సహజమే: మోదీ

న్యూఢిల్లీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీని ముచ్చటగా మూడోసారి ఎన్డీయే సారథిగా ఎన్నుకోవాలని భాగస్వామ్య పక్షాల నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈనెల 9వ తేదీన మోదీ, కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఎన్డీయే మిత్రపక్షాల సమావేశం జరిగింది. ఎన్డీయేలో బీజేపీ తర్వాత అత్యధిక స్థానాలున్న చంద్రబాబుకు ఈ భేటీలో ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. మోదీ పక్కనే ఆయన ఆసీనులయ్యారు. దాదాపు గంటన్నరసేపు జరిగిన భేటీలో చంద్రబాబుతోపాటు జనతాదళ్ (యు) అధ్యక్షుడు, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, శివసేన అధినేత, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, జనసేనాని పవన్ కల్యాణ్, ఎల్‌జేపీ(రాంవిలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ సహా మిత్రపక్ష నేతలు పాల్గొన్నారు. మోదీనే

మిగతా 2వ పేజీలో...

బాబు కింగ్ మేకర్!

- దక్షిణ భారతదేశానికే గర్వకారణం
- తమిళ మీడియాలో ప్రశంసలు
- ఎన్డీయేలో ఇంకోసారి ముఖ్య భూమిక
- జాతీయ మీడియా విశ్లేషణలు
- పలు ఆంగ్ల చానళ్లలో ప్రత్యేక బులెటిన్లు

మోదీ ప్రభంజనానికి బ్రేక్!

- ఎన్డీయే గెలిచినా తగ్గిన నరేంద్రుడి ప్రభ
- తొలిసారిగా సంకీర్ణంపై ఆధారపడే పరిస్థితి
- పుంజుకున్న ఇండియా కూటమి
- ఫలితాలపై అంతర్జాతీయ మీడియా స్పందన

మోదీకి మద్దతు.. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే!

పోలవరం నుంచి స్వర్ణాంధ్ర సాధన దాకా కారణాలెన్నో 2

తప్పులు తేల్చే టైమ్!



సచివాలయంలో ఫైళ్లు కట్టుదిట్టం

కక్ష సాధింపుల 'సిట్' ఆఫీసుకు సీల్

పోలీసుల ఐటీ వింగ్ ఆధీనంలోకి ఈ-ఆఫీస్

నేరుగా రంగంలోకి గవర్నర్

సచివాలయంలో ఫైళ్లు స్వాధీనం చేసుకోవాలని ఆదేశం

- అడ్డగోలుగా అక్రమ బదిలీలు, పదోన్నతులు
- అస్మదీయులకు వేల కోట్ల విలువైన కాంట్రాక్టులు
- ఉన్నతాధికారుల పాత్రపైనా ఆరోపణలు
- వాటి ఫైళ్లు ధ్వంసమయ్యే ముప్పు
- ఐదు బ్లాకుల్లోని ఫైళ్లు, సమాచారమంతా స్వాధీనం
- సచివాలయ ఉద్యోగుల వ్యక్తిగత ల్యాప్‌టాప్‌లూ కట్టడి
- చెక్ చేసి తిరిగిస్తామంటున్న జీఏడీ ఉన్నతాధికారులు

మీ సేవలిక చాలు!



త్వరగా సెలవుపై వెళ్లిపోండి
బాబు ప్రమాణ స్వీకారం చేయకముందే వెళ్తే మంచిది
సీఎస్ జవహర్‌రెడ్డికి సంకేతాలు 3
ఏకపక్ష వ్యవహార శైలి ఫలితం?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'వైసీపీ అధికారుల' తప్పుల లెక్కలు తేల్చేందుకు రంగం సిద్ధమైంది. 'అక్రమాల ఫైళ్ల'కు రెక్కలు రాకుండా ఏకంగా గవర్నర్ కార్యాలయమే రంగంలోకి దిగింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజునే పాత సర్కారు పాతకాలను పద్ధతిగా బయట పెట్టే ప్రక్రియ మొదలైంది. సచివాలయం నుంచి ఒక్క కాగితం కూడా బయటకు పోవడానికి వీల్లేదని, ప్రధాన కార్యాలయాలపై నిఘా పెంచాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ బుధవారం స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఆ వెంటనే జీఏడీ పొలిటికల్ సెక్రటరీ సురేశ్ కుమార్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు.. కార్యదర్శులకు దీనిపై ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు.. కేవలం చంద్రబాబును, టీడీపీ నేతలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా జగన్ సర్కారు ఏర్పాటు చేసిన 'సిట్' కార్యాలయానికి కూడా బుధవారం తాళం పడింది. తాడేపల్లిలోని ఈ ఆఫీసు కేంద్రంగానే కుట్రలు నడిచాయి. అడిషనల్ కమాండెంట్ బెటాలియన్స్ ప్రకాశ్ నేతృత్వంలోని బృందం బుధవారం ఇక్కడికి చేరుకుంది. కార్యాలయానికి సీలు వేసేందుకు సిట్ డీఎస్పీ ధనుంజయ్

మిగతా 12వ పేజీలో...


కొల్లి రఘురామిరెడ్డి

సిట్ కార్యాలయానికి తాళం..

ఏపీఎస్పీ కాపలా

అన్ని పోస్టుల నుంచీ సిట్ చీఫ్ కొల్లి ఔట్
డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశం



మార్కెట్‌కు చంద్రకళ

- ఎన్డీయేకు బాబు భరోసాతో భారీ కొనుగోళ్లు
- సెన్సెక్స్ 2,303 పాయింట్లు అప్
- 736 పాయింట్లు పెరిగిన నిఫ్టీ 10
- హెరిటేజ్ ఫుడ్స్ 20 శాతం వృద్ధి
- రూ.13.22 లక్షల కోట్ల సంపద వృద్ధి


పూడా ఆఫీసు వద్ద రియల్ వ్యాపారులు, పోలీసులు

అవినీతి సొమ్ములో కొంత కక్కించారు!

'పూడా' వైస్ చైర్మన్ అవినీతిపై రియల్టర్ల తిరుగుబాటు
వైసీపీ అండ చూసుకొని రెచ్చిపోయారని కార్యాలయం వద్ద ధర్నా
బెదిరించి వసూలు చేసిన రూ.7 కోట్లు కక్కాలని డిమాండ్ 3
అప్పటికప్పుడు రూ.50 లక్షలు చెల్లించిన శ్రీనివాసరెడ్డి

ప్రభుత్వ సలహాదారు పదవికి సజ్జల రాజీనామా

మిగిలిన వారి సంగతేంటో? 12

ఏఏజీ పొన్నవోలు, పీపీ నాగిరెడ్డి రాజీనామా

ఏపీపీ దుష్యంత్ రెడ్డి కూడా..

శిరసా నమామి!

నా జీవితంలో ఇంత అద్భుత ప్రజా తీర్పు చూడలేదు: చంద్రబాబు

టీడీపీ, రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలి

- పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం
- పాలకుడు ఎలా ఉండకూడదో జగన్ చూపించారు
- ఐదేళ్లలో ప్రతి రంగం, వ్యవస్థా నాశనం
- దీనిపైనే జనం తిరగబడ్డారు
- దేశవిదేశాల నుంచి వచ్చి ఓట్లేశారు
- వేలకు వేల మెజారిటీలు వచ్చాయి
- కూటమికి 55 శాతానికిపైగా ఓట్లు
- అయితే ఓటు వేసి ఊరుకోవడం కాదు
- నిత్యం మా తప్పొప్పులు చెబుతూ నడిపించాలి.. ప్రజలకు బాబు వినతి



అహంకారం, నియంతృత్వంతో విచ్చలవిడిగా వ్యవహరిస్తే ప్రజలు సహించరు. విధ్వంసమే పాలనగా పనిచేసిన వారికి తగిన గుణపాఠం చెబుతారు. ఇప్పుడు అదే జరిగింది.
ఈ తీర్పుతో అధికారం వచ్చిందని మేం భావించడం లేదు. ఒక బాధ్యతను ప్రజలు అప్పగించారని భావిస్తున్నాం. మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం. - చంద్రబాబు

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇంత అద్భుతమైన తీర్పు ఎప్పుడూ చూడలేదు. తెలుగుదేశం పార్టీ, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన తీర్పును ప్రజలు ఇచ్చారు. వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా..' అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బుధవారం ఉదయం ఇక్కడి ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భవించాక జరిగిన తొలి ఎన్నికలో ఉమ్మడి రాష్ట్రంలో 202 సీట్లు వచ్చాయని, 1994 ఎన్నికల్లో ప్రతిపక్షానికి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు తీర్పు ఇచ్చారని.. వాటన్నిటినీ

మిగతా 12వ పేజీలో...


ఎన్నికల్లో గెలిచిన జనసేన అభ్యర్థులతో పవన్ కల్యాణ్

ప్రతి ఓటూ బాధ్యత గుర్తుచేసేదే

- ప్రజలు నమ్మి కనీవినీ ఎరుగని విజయమిచ్చారు
- రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలూ కష్టాల్లోనే
- వారికి ఏ కష్టం వచ్చినా, ఏ నష్టం పలకరించినా జనసేన ఆఫీసు తలుపులు తెరిచే ఉంటాయి
- ప్రజాప్రతినిధులు ఇలా ఉంటారని ప్రజలు అనుకునేలా పని చేద్దాం
- జనసేన పార్టీ విజేతలకు అధినేత పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'ప్రజలు మనల్ని బలంగా నమ్మారు. కనీవినీ ఎరుగని విజయాన్ని అందించారు. మనకు వచ్చిన ప్రతి ఓటూ మన బాధ్యతను గుర్తుచేసేదే. ఐదు కోట్ల మందికి జవాబుదారీగా ఉండాలి' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం

మిగతా 12వ పేజీలో...

వైసీపీలో కలకలం



- జగన్ వల్లే ఈ ఘోర పరాజయం
- ఎమ్మెల్యేలు, ఎంపీలను పట్టించుకోలేదు
- సంక్షేమం తానే కనిపెట్టినట్లు గొప్పలు
- ఓడిపోయిన అభ్యర్థుల్లో అంతర్మథనం
- సీఎంవో, కోటరీపైనా మండిపాటు
- నేరుగా ధ్వజమెత్తిన జక్కంపూడి రాజా
- ఇతర అభ్యర్థులదీ అదే పరిస్థితి
- తాడేపల్లి వైపు వచ్చేందుకు విముఖత
- గెలుపొందిన అభ్యర్థులూ దూరం దూరం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాభవానికి జగన్, ఆయన చుట్టూ ఉన్న కోటరీ, సీఎం కార్యాలయ అధికారులే కారణమని ఓటమి పాలైన వైసీపీ అభ్యర్థులు రగిలిపోతున్నారు. కొందరు సీఎంవోను తప్పుబడుతుండగా.. మరికొందరు జగన్మోహన్ రెడ్డి వైఖరే ఈ దుస్థితికి కారణమని మండిపడుతున్నారు. బుధవారం జక్కంపూడి రాజా నేరుగా సీఎం మాజీ కార్యదర్శి ధనుంజయరెడ్డిపైనే ధ్వజమెత్తారు. మరోవైపు.. వైసీపీ ముఖ్యనేతలెవరూ తాడేపల్లి వైపు

మిగతా 12వ పేజీలో...

జగన్ కేసుల్లో విచారణ వేగవంతం!

దాదాపు 130 డిశ్చార్జి పిటిషన్లు పరిష్కారం కాలేదు.. ఈ కేసుల్లో 2023 నవంబరు 24 తర్వాత తీర్పుల్లేవు.. సుప్రీం మార్గదర్శకాలను కోర్టులకు పంపాలి
రిజిస్ట్రీని ఆదేశించిన తెలంగాణ హైకోర్టు ధర్మాసనం 12



క్రాస్.. తిరకాస్!

పలు జిల్లాల్లో క్రాస్ ఓటింగ్.. సీమలో మరింత ఎక్కువ

పార్లమెంట్ అభ్యర్థులకు తగ్గిన ఓట్లు.. కూటమి ఎమ్మెల్యేలు గెలిచినా ఎంపీ ఓటమి
బీజేపీ అభ్యర్థులున్న చోట్ల ఎక్కువ ప్రభావం


(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలు జిల్లాల్లో క్రాస్ ఓటింగ్ జరిగింది. ముఖ్యంగా టీడీపీ కూటమిలోని బీజేపీ అభ్యర్థులు పోటీ చేసిన చోట్ల ఈ ప్రభావం ఎక్కువగా కనిపించింది. అది కూడా పార్లమెంటు స్థానాల్లో క్రాస్ ఓటింగ్ జరగడంతో కూటమి అభ్యర్థులు ఓడిపోయారు. అదేవిధంగా గెలిచిన అభ్యర్థుల భారీ మెజారిటీల పైనా ప్రభావం చూపించింది.

అనంతపురం: ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులకు 7,72,979 ఓట్లు వచ్చాయి. కానీ, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీ నారాయణకు 7,55,862 ఓట్లు

మిగతా 11వ పేజీలో...

అసెంబ్లీ.. ఎవరికెన్ని ఓట్లు?



వైసీపీని నమ్మి.. నట్టేట మునిగి!

- బెట్టింగ్‌ల్లో భారీగా నష్టపోయిన అభిమానులు
- చివరి రోజు వరకూ జగన్ గెలుపుపై ధీమా
- నాయకత్వాన్ని నమ్మి పందేలు కాసిన వైనం
- అప్పులు చేసి మరీ భారీగా బెట్టింగులు
- ఫలితాల తారుమారుతో తీవ్రంగా నష్టం
- అప్పులపాలై కొందరు ఆత్మహత్యలు
- 8 వేల కోట్ల పందేలు కాసినట్టు అంచనా

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో విజయంపై ఓట్ల లెక్కింపునకు ముందు రోజు కూడా వైసీపీ అధినాయకత్వం పూర్తి ధీమాగా ఉంది. ఈ సారి కూడా గెలుపు తమదేనని నమ్మకంగా చెప్పింది. నాయకత్వం ఇంత నమ్మకంగా చెబుతుంటే ఇక మనకు తిరుగేలేదని వైసీపీ అభిమానులు భారీగా బెట్టింగులు పెట్టారు. అప్పులు తెచ్చి, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ లక్షల్లో పందేలు కాశారు. కానీ.. ఫలితాల్లో సీన్ రివర్స్ అయింది. జగన్ నేతృత్వంలోని వైసీపీ చిత్తుగా ఓడిపోయింది. వైసీపీపై పందేలు కాసిన అభిమానులు ఘోరంగా నష్టపోయారు. నాయకత్వం

మిగతా 11వ పేజీలో...

రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే మోదీకి మద్దతు!

- గత ఐదేళ్లలో ఏపీ ఎన్నో ఏళ్లు వెనక్కి.. తిరిగి గాడిన పెట్టాలి..
- పోలవరం పూర్తిచేయాలి.. ఉపాధి కల్పించాలి
- కేంద్రంలో సుస్థిర సర్కారు ఉంటేనే రాష్ట్రానికి అవసరమైన నిధులు
- మోదీని బాబు సమర్థించడానికి కారణాలివే!!



ఢిల్లీలో చంద్రబాబుతో మహిళా పాత్రికేయుల సెల్ఫీ

న్యూఢిల్లీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఐదేళ్ల పాలనతో ఎన్నో ఏళ్లు వెనక్కి వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి గాడిలో పెట్టి పునర్నిర్మాణం, అభివృద్ధిని వేగ వంతం చేసేందుకే కేంద్రంలో ప్రధాని మోదీని సమర్థించాలని టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. శరవేగంగా రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి, పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో యువతకు ఉద్యోగావకాశాలు కల్పన, అప్పులపాలైన రాష్ట్రాన్ని మళ్లీ స్వర్ణాంధ్రగా మార్చడం తన ప్రాధాన్యాలుగా ఆయన భావిస్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. కేంద్రంలో బీజేపీకి బలం తగ్గినా ఎన్డీయేకి సాధారణ మెజారిటీ వచ్చినందువల్ల ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయడం సాధ్యపడుతుందని.. అదే ఇండియా కూటమి మెజారిటీకి ఎంతో దూరంలో ఉండడం, అందులో అనేక పార్టీలు ఉండడం.. అతుకులబొంత సర్కారు ఏర్పడినా ఎంత కాలం ఉంటుందో చెప్పడం కష్టమని చంద్రబాబు విశ్లేషించుకున్నట్లు సమాచారం. కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రానికి అవసరమైన నిధులు సాధించడం సాధ్యపడుతుందని, ప్రభుత్వానికి కీలక మద్దతునిస్తున్న చంద్రబాబుకు ఈ సారి మోదీ పూర్తి సహకారం అందించక తప్పదని టీడీపీ వర్గాలు అంటున్నాయి. మోదీ సహకారంతో అతి వేగంగా రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు సాకారమవుతాయని.. వివిధ ప్రాజెక్టులకు నిధులు కూడా లభిస్తాయని ఆయన విశ్వసిస్తున్నట్లు సమాచారం. బుధవారం జరిగిన ఎన్డీయే నేతల భేటీలో ఆయనకు లభించిన కీలక ప్రాధాన్యం చూశాక మోదీ ఆయనకు ఎంత విలువ ఇస్తున్నారో అర్థమవుతోందని.. బీజేపీ మెజారిటీ కోల్పోయినా చంద్రబాబు అండగా నిలబడడంతో ఆయన పట్ల మోదీ గౌరవం మరింత పెరిగిందని టీడీపీ వర్గాలు తెలిపాయి. చంద్రబాబు ఎంతో ఆలోచించి అత్యంత వ్యూహాత్మకంగానే మోదీకి ఎటువంటి పునరాలోచన లేకుండా మద్దతు పలికారని, ఎన్నికల్లో కలిసి పోటీ చేసినందున మిత్రధర్మాన్ని పాటించారని పేర్కొన్నాయి. రానున్న రోజుల్లో మోదీ-బాబు జోడీతో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డాయి.

జగన్ కేసులపై మౌనం తగదు!

నిజానికి బాబు నవ్యాంధ్ర సీఎంగా ఉన్న ఐదేళ్లలో జగన్ జోలికి పోలేదని, కానీ ఆయన సీఎం కాగానే తమ అధినేతను రాజకీయంగానే గాక భౌతికంగా కూడా అంతం చేసేందుకు ప్రయత్నించారని, కనుక ఈసారి మౌనంగా ఉండకూడదని టీడీపీ వర్గాలు బలంగా అభిప్రాయపడుతున్నాయి. మోదీ సహకారం ఉంటే అక్రమాస్తుల వ్యవహారంలో జగన్ కేసుల విచారణను జాప్యం చేసేందుకు తన పలుకుబడి ఉపయోగించే అవకాశాలుండవని వారు భావిస్తున్నారు.

ఆ ఎన్నికలు మోదీ సామర్థ్యానికి పరీక్ష?

ఈ ఏడాది హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్, వచ్చే ఏడాది ఢిల్లీ, బిహార్ అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో బీజేపీ విజయం సాధించడం మోదీ సామర్థ్యానికి పరీక్షగా ఆర్‌ఎస్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంకోవైపు.. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో బీజేపీ దెబ్బతినడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యుడని మోదీ భావిస్తున్నారని, ఈసారి ఆయన ప్రాధాన్యం తగ్గించవచ్చని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

పేపర్ లెస్ విధానంలో కొత్త ఎంపీల రిజిస్ట్రేషన్

న్యూఢిల్లీ, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో 18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన ఎంపీల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి లోక్‌సభ సచివాలయం సర్వం సిద్ధం చేసింది. సభ్యుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడానికి రిజిస్ట్రేషన్ కౌంటర్లను పార్లమెంట్ హౌస్ ఎనెక్స్‌లో ఏర్పాటు చేశారు. జూన్ 5 నుంచి 14 వరకు ఇవి పని చేయనున్నాయి. పేపర్‌రహితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టనున్నారు. ఈమేరకు ఆన్‌లైన్ ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా బయో-ప్రొఫైల్ డేటాను తీసుకుని ముఖ, బయోమెట్రిక్ రికగ్నిషన్‌లను వినియోగించి పార్లమెంట్ గుర్తింపు కార్డులు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) కార్డులను జారీ చేస్తారు. 20 డిజిటల్ కౌంటర్ల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతారు.

18వ లోక్‌సభకు 74 మంది మహిళలు

న్యూఢిల్లీ, జూన్ 5: తాజా లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 74 మంది మహిళలు ఎంపీలుగా విజయం సాధించారు. అయితే 2019 ఎన్నికల్లో గెలిచినవారితో పోలిస్తే ఈ సంఖ్య తక్కువే. అప్పుడు మొత్తం 78 మంది ఎన్నికయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా చూస్తే.. పశ్చిమ బెంగాల్ నుంచి అత్యధికంగా 11 మంది మహిళలు ఎంపీలుగా ఎన్నికయ్యారు. కాగా ఈ ఎన్నికల్లో మొత్తం 797 మంది మహిళలు బరిలో నిలిచారు. బీజేపీ అత్యధికంగా 69 మందికి, తర్వాత కాంగ్రెస్ 41 మందికి సీట్లు ఇచ్చాయి. బీజేపీ నుంచి 30 మంది మహిళలు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి 14 మంది, టీఎంసీ నుంచి 11 మంది, సమాజ్‌వాదీ నుంచి నలుగురు, డీఎంకే నుంచి ముగ్గురు, జేడీయూ, ఎల్జేపీ(ఆర్)ల నుంచి ఇద్దరు చొప్పున మహిళలు ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో బీజేపీ నుంచి హేమమాలిని, టీఎంసీ నుంచి మహువా మొయిత్రా, ఎన్సీపీ నుంచి సుప్రియా సూలే, ఎస్పీ నుంచి డింపుల్ యాదవ్ తమ సీట్లు నిలబెట్టుకున్నారు. ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ కంగన, మీసా భారతి కూడా ఈ ఎన్నికల్లో విజయం సాధించారు.

ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ రాజీనామా

భువనేశ్వర్, జూన్ 5: ఒడిసా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బిజూ జనతాదళ్ (బీజేడీ) ఓడిపోవడంతో ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం నవీన్ పట్నాయక్ రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని బుధవారమిక్కడి రాజ్‌భవన్‌లో గవర్నర్ రఘుబర్ దాస్‌కు అందజేశారు. 2000వ సంవత్సరం మార్చి 5న తొలిసారి సీఎంగా ప్రమాణం చేసిన ఆయన.. 24 ఏళ్ల అప్రతిహతంగా ఆ పదవిలో కొనసాగారు. తాజా ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా విజయం సాధించింది. 147 స్థానాల అసెంబ్లీలో 78 సీట్లు గెలుచుకుంది. బీజేడీ 51 స్థానాల్లో విజయం సాధించింది. ఇక రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీచేసిన నవీన్.. గంజాం జిల్లాలో సొంత నియోజకవర్గం హింజిలిలో 4,636 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గెలిచారు. బోలంగీర్ జిల్లా కాంటాబాంజీలో కొత్త అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. 26 ఏళ్ల రాజకీయ జీవితంలో నవీన్ ఓడిపోవడం ఇదే తొలిసారి.

మోదీ 3.0



ఎన్డీయే కూటమి నేతల అభివాదం.. చిత్రంలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి సారథిగా ఎన్నుకోవాలని ప్రతిపాదించారు. సదరు తీర్మానంపై 16 పార్టీలకు చెందిన 21 మంది ఎన్డీయే నేతలు సంతకాలు చేశారు. శుక్రవారం ఎన్డీయే ఎంపీల సమావేశం జరుగుతుంది. ఆ సందర్భంగా వారంతా మోదీని లాంఛనంగా తమ నేతగా ఎన్నుకుంటారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరతారు. 9వ తేదీన మోదీ ప్రమాణ స్వీకారం చేస్తారు. శుక్రవారం ఎంపీల సమావేశం తర్వాత మిత్రపక్షాల నేతలు వేరుగా భేటీ అవుతారు. మంత్రివర్గంలో ఎవరెవరు ఉండాలి.. ఏ పార్టీకి ఎన్ని పదవులివ్వాలో చర్చిస్తారు. రాజకీయ అనిశ్చితికి ఆస్కారం లేకుండా త్వరత్వరగా ఈ ప్రక్రియ ముగించాలని చంద్రబాబు, నితీశ్ గట్టిగా సూచించినట్లు ఎన్డీయే వర్గాలు తెలిపాయి. కాగా.. మోదీ కేబినెట్‌లో చేరాలని తమ పార్టీ నిర్ణయించినట్లు చంద్రబాబు వెల్లడించారు. ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. శుక్రవారం తాను మళ్లీ ఢిల్లీ వస్తానని, 9న మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా హాజరవుతానని ఆయన చెప్పారు. ప్రభుత్వంలో చేరేందుకు తాను ఎలాంటి డిమాండ్లూ పెట్టలేదన్నారు. తన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోదీని ఆహ్వానించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎన్డీయేతోనే తాము ఉన్నామని పునరుద్ఘాటించారు. అందులో బాగుంగా లేకుంటే ఎన్నికల్లో కలిసి ఎలా పోటీచేస్తామని ప్రశ్నించారు. బీజేపీ అగ్ర నేతలతో సమావేశం సానుకూలంగా జరిగిందన్నారు. బాబు, నితీశ్ తమ వైపు వస్తారంటూ ఇండియా కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలను జేడీయూ నేత రాజీవ్ రంజన్‌సింగ్ ఖండించారు. వరుసగా మూడోసారి ఓటమిపాలవడంతో మెంటల్ బ్యాలెన్స్ తప్పి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

మోదీ పక్కనే బాబు, నితీశ్

ఎన్డీయే సమావేశంలో చంద్రబాబుకు అత్యంత కీలక ప్రాధాన్యం లభించింది. ప్రధానమంత్రి తన పక్కనే ఆయన్ను కూర్చోబెట్టుకున్నారు. బాబు పక్కన నితీశ్, ఆయన పక్కన షిండే కూర్చున్నారు. భేటీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, ఆ పార్టీ అగ్ర నేతలు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, జనతాదళ్ (ఎస్) నేత, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి, ఎన్సీపీ (అజిత్ పవార్) నేత ప్రఫుల్ పటేల్, హిందూస్థానీ అవాం మోర్చా నేత, బిహార్ మాజీ సీఎం జితన్‌రాం మంఝీ, ఏజీపీ నాయకుడు అతుల్ బోరా తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో చంద్రబాబుతో పాటు ప్రతి ఒక్కరూ మాట్లాడుతూ మోదీ నాయకత్వాన్ని సమర్థించారు. దేశ నిర్మాణం కోసం ఆయన కష్టపడి పనిచేశారని, ఆయన నాయకత్వంలో దేశం కొత్త పుంతలు తొక్కిందని, ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని ఇనుమడింప చేశారని ప్రశంసించారు. 'వికసిత్ భారత్'పై ఆయనకు స్పష్టమైన దృక్పథం ఉందని తెలిపారు. ఆరు దశాబ్దాల తర్వాత ప్రజలు మూడోసారి స్పష్టమైన మెజారిటీతో బలమైన నాయకత్వాన్ని ఎన్నుకున్నారని పేర్కొన్నారు.

చరిత్రాత్మక తీర్పు: మోదీ

ఎన్డీయే ప్రభుత్వానికి అనుకూలంగా ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆరు దశాబ్దాల తర్వాత కేంద్రంలో ఒకే ప్రభుత్వం వరుసగా మూడోసారి కొలువుదీరడం ఇదే ప్రథమమన్నారు. ఈ ఘన విజయంలో చంద్రబాబు కీలక పాత్రని కొనియాడారు. 543 స్థానాల లోక్‌సభలో ఎన్డీయే తాజా ఫలితాల్లో 293 స్థానాలు సాధించగా.. ఇందులో బీజేపీ వాటా 240. సొంతగా ప్రభుత్వ ఏర్పాటుకు 272 స్థానాలు అవసరం కాగా.. ఆ పార్టీ 32 సీట్ల దూరంలో ఉండిపోయింది. ఈ నేపథ్యంలో ఎన్డీయేలో బీజేపీ తర్వాత సంఖ్యాపరంగా టీడీపీ (16), జేడీయూ (12) పెద్ద పార్టీలు కీలకంగా మారాయి. కాగా.. బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా మోదీని ఎన్నికోకముందే ఎన్డీయే నేతల సమావేశం ఏర్పాటు చేసి ఆయన్ను తమ సారథిగా ఎన్నుకోవడం, ఆ తర్వాత ఎన్డీయే ఎంపీల భేటీ తేదీని ఖరారు చేయడం విచిత్రంగా ఉన్నప్పటికీ.. ఆ సమావేశంలో ఏ నేతా ప్రశ్నించపోవడం గమనార్హం.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామాను సమర్పిస్తున్న మోదీ

17వ లోక్‌సభ రద్దుకు రాష్ట్రపతి ఆదేశం

17వ లోక్‌సభ రద్దైంది. బుధవారం ఉదయం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఇందులో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కోసం ప్రస్తుత లోక్‌సభ రద్దుకు సిఫారసు చేశారు. అనంతరం మోదీ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. తనతో సహా మంత్రివర్గ సహచరుల రాజీనామాలను అందజేశారు. ఆమె ఆమోదం తెలిపారు. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం జరిగేవరకు ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగాలని మోదీని కోరారు.

జయాపజయాలు రాజకీయాల్లో భాగం!

గెలుపోటములు రాజకీయాల్లో భాగమని ప్రధాని మోదీ అన్నారు. గడిచిన పదేళ్లలో బాగా పనిచేశామని, అదే ఒరవడిని కొనసాగిస్తామని చివరి కేబినెట్ సమావేశంలో చెప్పారు. పదేళ్లలో ఉత్తమ పనితీరు కనబర్చారంటూ కేంద్ర మంత్రులను ప్రశంసించారు.

బాబు బస వద్ద భారీ జన సందోహం

కాగా.. ఢిల్లీలో చంద్రబాబు బస చేసిన అశోకా రోడ్డులోని టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడి నివాసానికి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. ఆ రోడ్డంతా వాహనాలు, జనంతో నిండడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ఆయన బయటకు రాగానే చంద్రబాబు జిందాబాద్, తెలుగుదేశం జిందాబాద్ అని నినాదాలు చేశారు. ఆయన్ను కలిసేందుకు ఢిల్లీలోని ప్రముఖ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రాజ్‌దీప్ సర్దేశాయ్, వినోద్ శర్మ సహా పలువురు సీనియర్ జర్నలిస్టులు వచ్చారు. సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, జీవీ రావు కూడా ఆయన్ను కలిశారు.

12న బాబు ప్రమాణ స్వీకారం

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఈ నెల 12న పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తొలుత ఈ నెల 9న ప్రమాణం చేయాలనుకున్నారు. అయితే ప్రధాని మోదీ, కేంద్ర కేబినెట్ అదే రోజు ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో 12న తాను పదవీప్రమాణం చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. ఆ రోజున కూడా మంచి ముహూర్తం ఉందని పండితులు చెప్పారు.

చంద్రబాబుతో స్టాలిన్ భేటీ

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ఢిల్లీ విమానాశ్రయంలో చంద్రబాబును కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం ఆయన ట్వీట్ చేస్తూ..'తలైవర్ కలైంగర్ కరుణానిధికి సుదీర్ఘకాలం మంచి మిత్రుడైన చంద్రబాబును ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కలిశాను. శుభాకాంక్షలు తెలియజేశాను. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నడుమ ఉన్న సోదర సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తాం. కేంద్ర ప్రభుత్వంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని. దక్షిణాది రాష్ట్రాల హక్కుల కోసం కృషిచేస్తారని నాకు నమ్మకం ఉంది' అని తెలిపారు. ఎన్డీయే భేటీకి హాజరయ్యేందుకు చంద్రబాబు అమరావతి నుంచి ఢిల్లీ చేరుకోగా.. ఇండియా కూటమి సమావేశంలో పాల్గొనేందుకు స్టాలిన్ కూడా వెళ్లారు.

లోకం తీరు



దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 543 లోక్‌సభ నియోజక వర్గాల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలుచుకుందంటే?

1.	బీజేపీ	240
2.	కాంగ్రెస్	99
3.	సమాజ్‌వాదీ పార్టీ	37
4.	తృణమూల్ కాంగ్రెస్	29
5.	డీఎంకే	22
6.	తెలుగుదేశం పార్టీ	16
7.	జేడీ (యూ)	12
8.	శివ సేన (యూబీటీ)	9
9.	ఎన్సీపీ (శరద్ పవార్)	8
10.	శివసేన	7
11.	ఎల్‌జేపీ (రామ్‌విలాస్)	5
12.	వైఎస్సార్‌సీపీ	4
13.	ఆర్జేడీ	4
14.	సీపీఐ (ఎం)	4
15.	ఐయూఎంఎల్	3
16.	ఆప్	3
17.	ఝార్ఖండ్ ముక్తి మోర్చా	3
18.	జనసేన పార్టీ	2
19.	సీపీఐ (ఎంఎల్) (లిబరేషన్)	2
20.	జేడీ(ఎస్)	2
21.	విడుతలై చిరుతైగల్ కట్చి	2
22.	సీపీఐ	2
23.	రాష్ట్రీయ లోక్ దళ్	2
24.	నేషనల్ కాన్ఫరెన్స్	2
25.	యూపీపీ(లిబరల్)	1
26.	అసోం గణ పరిషద్	1
27.	హెచ్ఏఎం(సెక్యులర్)	1
28.	కేరళ కాంగ్రెస్	1
29.	రివొల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ	1
30.	ఎన్సీపీ	1
31.	వాయిస్ ఆఫ్ ది పీపుల్ పార్టీ	1
32.	జోరమ్ పీపుల్స్ మూవ్‌మెంట్	1
33.	శిరోమణి అకాలీదళ్	1
34.	రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ	1
35.	భారత్ ఆదివాసీ పార్టీ	1
36.	సిక్కిం క్రాంతికారి మోర్చా	1
37.	ఎండీఎంకే	1
38.	ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షిరాం)	1
39.	అప్నాదళ్ (సోనేలాల్)	1
40.	ఏజేఎస్‌యూ పార్టీ	1
41.	ఏఐఎంఐఎం	1
42.	స్వతంత్రులు	7

మోదీ ప్రభంజనానికి బ్రేక్!

- ఎన్నికల ఫలితాలపై అంతర్జాతీయ మీడియా స్పందన

వాషింగ్టన్/లండన్, జూన్ 5: భారత్‌లో మోదీ ప్రభంజనానికి బ్రేక్ పడినట్టు అంతర్జాతీయ మీడియా అభివర్ణించింది. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి పుంజుకున్నట్టు పేర్కొంది. 543 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగగా.. బీజేపీ 240 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ 99 స్థానాల్లో గెలుపొందింది. ఏదేమైనప్పటికీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన 272 సీట్ల మార్కుని దాటేసింది. ఈ నేపథ్యంలో ఈ సారి ఎన్నికల్లో ప్రధాని మోదీ ప్రభంజనం తగ్గిందని అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ నివేదించింది. ఈసారి ఫలితాలు ఊహించని విధంగా వచ్చాయని పేర్కొంది. అయితే.. ఈ ఎన్నికల్లో బీజేపీకి స్పష్టమైన ఆధిక్యం సాధించనప్పటికీ.. ప్రధాని మోదీ మూడోసారి అధికారం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అమెరికా మీడియా సంస్థ 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనాన్ని ప్రచురించింది. సార్వత్రిక ఎన్నికలు మోదీని, ఆయన పార్టీని షాక్‌కు గురిచేశాయని, ఓటర్లు విజేతలను ఇరకాటంలో పడేశారని వాషింగ్టన్ పోస్ట్ అభిప్రాయపడింది. 'ఈసారి ఎన్నికల్లో 400 ఎంపీ స్థానాలు గెలుచుకోవాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, మంగళవారం వెలువడిన ఫలితాల్లో బీజేపీకి సొంతంగా సాధారణ మెజారిటీ వచ్చేంత బలం కూడా లేదని స్పష్టమైంది. పదేళ్ల తర్వాత ఆయన తొలిసారిగా సంకీర్ణ భాగస్వాములపై ఆధారపడే పరిస్థితి వచ్చింది' అని సీఎన్ఎన్ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ మెజార్టీ కోల్పోయారని బ్రిటన్ మీడియా సంస్థ 'ది గార్డియన్' అభిప్రాయపడింది. తాజా ఎన్నికలు మోదీకి ఆశ్చర్యకరమైన ఫలితాలను మిగిల్చాయని జర్మన్ పత్రిక 'డీడీడబ్ల్యూ' పేర్కొంది. మోదీకి మిత్రపక్షాల అవసరం వచ్చిందని 'రాయిటర్స్' పేర్కొంది. కాగా, ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి పునరుజ్జీవాన్ని అందించిందని, ఎగ్జిట్ పోల్స్, సర్వేలకు భిన్నంగా ఈ ఫలితాలు ఉన్నాయని బీబీసీ అభిప్రాయపడింది.

వేచిచూస్తాం

- బీజేపీ పాలన వద్దని దేశ ప్రజలు తీర్పు ఇచ్చారు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తమను బీజేపీ ప్రభుత్వం పాలించవద్దని దేశ ప్రజానీకం కోరుకున్నారని, వారి ఆకాంక్షను నెరవేర్చటానికి సరైన సమయంలో సరైన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. తద్వారా కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు అవకాశాలపై వేచి చూసే ధోరణితో ఉన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. ఎన్నికల్లో దేశప్రజలు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పు ఇచ్చారని, బీజేపీకి మెజారిటీ ఇవ్వలేదని గుర్తుచేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు బుధవారం ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడారు. తమ కూటమికి ప్రజలు మద్దతు పలికారని, వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును బీజేపీకి, ఆ పార్టీ అనుసరించే విద్వేష, విభజనపూరిత, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా దీటైన జవాబుగా అభివర్ణించారు. మోదీ నేతృత్వంలో కొనసాగే బీజేపీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించాలని కూటమి నిర్ణయించిందన్నారు. ఈ మేరకు కూటమి ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించిందన్నారు. అంతకుముందు ఇండియా కూటమి నేతల సమావేశాన్ని ఉద్దేశించి ఖర్గే మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలలో మోదీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఐక్యంగా పోరాడిందని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు మోదీకి, ఆయన అనుసరించే రాజకీయాలకు పూర్తి వ్యతిరేకమన్నారు. అయినప్పటికీ, ప్రజాతీర్పును తుంగలో తొక్కటానికి మోదీ సిద్ధమయ్యారని విమర్శించారు. రాజ్యాంగ విలువలకు, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయానికి కట్టుబడి ఉన్న పార్టీలను ఇండియా కూటమి ఆహ్వానిస్తుందని ఖర్గే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎన్నికల ఫలితాలు, కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు గల అవకాశాలు, భవిష్యత్ వ్యూహంపై కూటమి నేతలు చర్చించారు. ఎన్డీఏలో కీలకంగా మారిన టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్‌లను కూటమిలోకి ఆహ్వానించే అవకాశాలపైనా మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో ఖర్గేతోపాటు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, జార్ఖండ్ సీఎం చంపై సోరెన్, మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్, ఎస్పీ అధినేత అఖిలేష్‌యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీపీ (శరద్‌పవార్) పార్టీ నేతలు శరద్‌పవార్, సుప్రియాసూలే, లెఫ్ట్ నేతలు సీతారాం ఏచూరి, డీ రాజా, ఆప్ తరఫున రాఘవ్ చద్దా, సంజయ్ సింగ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా, తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ పాల్గొన్నారు.

ఉద్ధవ్ ఠాక్రే గైర్హాజరు

కూటమి సమావేశానికి శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే హాజరు కాలేదు. ఆ పార్టీ ముఖ్య నేతలు సంజయ్ రౌత్, అనిల్ దేశాయ్ హాజరయ్యారు. ఫలితాల అనంతరం ఉద్ధవ్ స్పందిస్తూ.. బీజేపీకి మెజారిటీ దక్కనందున ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బాధ్యత ఇండియా కూటమిపై ఉందని, ఢిల్లీలో సమావేశంలో ప్రధాని అభ్యర్థి ఎవరనేది నిర్ణయిస్తామని ప్రకటించారు.



అన్నా..గర్విస్తున్నా!

- రాహుల్‌ను ఉద్దేశించి ప్రియాంక పోస్ట్

న్యూఢిల్లీ, జూన్ 5: సత్యసాధన కోసం జరిగే పోరాటంలో రాహుల్ ఆగలేదు..వెనక్కి తగ్గలేదని ఆయన సోదరి ప్రియాంకా గాంధీ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ప్రదర్శన ఇచ్చిన మరునాడు రాహుల్‌ను ఉద్దేశించి ఆమె ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సాహసోపేత రాజకీయ నేతగా ఆయనను కొనియాడారు. "వాళ్లు నీ గురించి ఏమన్నా, నీకు వ్యతిరేకంగా ఏం చేసినా నువ్వు మాత్రం దృఢంగా నిలబడ్డావు. ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కి పోలేదు. నీ సంకల్పాన్ని వాళ్లు శంకించారు. నీకు వ్యతిరేకంగా అబద్ధాలు ప్రచారం చేశారు. అయినా.. సత్యసాధన కోసం జరుపుతున్న పోరాటాన్ని నువ్వు ఆపలేదు. నిత్యం వాళ్లు నీ పట్ల విద్వేషం, ఆగ్రహాలను ప్రదర్శించినా, వాటిని నువ్వు మాత్రం నీ దరికి కూడా రానీయలేదు. నీకు సోదరిని అయినందుకు గర్విస్తున్నాను" అని ప్రియాంక అన్నారు.

చంద్రబాబు కింగ్ మేకర్!

కేంద్రంలో చక్రం తిప్పేది ఆయనే!!

The New Kingmakers Who Could Make or Break Modi's Government

Two veterans of bare-knuckled Indian politics have the Parliament votes that Narendra Modi will need, but neither is aligned with his Hindu-first vision.

3 MIN READ




'మోదీ సర్కారు ఏర్పాటులో చంద్రబాబు, నితీశ్ కీలకమంటూ 'న్యూయార్క్ టైమ్స్' వెబ్ ఎడిషన్‌లో ప్రచురితమైన వార్త.

చెన్నై/న్యూఢిల్లీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంపై తమిళ మీడియా ప్రశంసల్లో ముంచెత్తింది. టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ చాణక్యాన్ని, రాజకీయ విశేషాలను పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం సాయంత్రం వరకు టీవీ చానళ్లు కథనాలను ప్రసారం చేశాయి. ప్రచార సమయంలో ఓ వేదికపై ప్రధాని మోదీ చంద్రబాబు చేతులు పట్టుకుని పక్కన కూర్చోబెట్టుకున్న దృశ్యాలను ప్రత్యేకంగా ప్రసారం చేశాయి. సామాజిక మాధ్యమాల్లో ఈ దృశ్యాలు వైరల్ అయ్యాయి. 'కేంద్రంలో చంద్రబాబు కింగ్ మేకర్ అయ్యారు. ఆయన కోసం అటు ఎన్డీఏ, ఇటు ఇండియా కూటములు ఎదురు చూస్తున్నాయి' అంటూ పలు చానళ్లు కథనాలు ప్రసారం చేశాయి. దాదాపు రెండు దశాబ్దాల తరువాత చంద్రబాబు మళ్లీ కేంద్రంలో చక్రం తిప్పబోతున్నారని పేర్కొన్నాయి. ఆంధ్రా ప్రజలు సరైన సమయంలో, సరైన నిర్ణయం తీసుకున్నారని, సరైన వ్యక్తిని ఎన్నుకున్నారని ప్రశంసించాయి. చాలాకాలం తరువాత కేంద్రప్రభుత్వంలో దక్షిణాది వ్యక్తికి చక్రం తిప్పే అవకాశం వచ్చిందని, ఇది మొత్తం దక్షిణ భారతదేశానికి గర్వకారణమని పేర్కొన్నాయి. తమిళనాట సాధారణ ప్రజలూ ఏపీ ఎన్నికల ఫలితాలపై ఎంతో ఆసక్తి చూపారు.

'మోదీ.3' సుస్థిరతకు బాబు మద్దతే కీలకం

ఏపీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ కూటమిని ఘన విజయ పథంలో నడిపిన చంద్రబాబు పేరు జాతీయ యవనికపై మార్మోగుతోంది. గతంలో 1996లో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటు, ప్రధానమంత్రులుగా హెచ్‌డీ దేవెగౌడ, ఐకే గుజ్రాల్ నియామకాల్లో కీలక భూమిక పోషించిన ఆయన.. వాజపేయి హయాంలోనూ ఎన్డీయే కన్వీనర్‌గా చక్రం తిప్పిన వైనాన్ని జాతీయ మీడియా విశేషంగా ప్రస్తావిస్తోంది. ఎన్నికల ముంగిట జనసేనతో కలిసి బీజేపీతో పొత్తు పెట్టుకోవడం.. 25 లోక్‌సభ స్థానాలకు గాను 21చోట్ల కూటమి విజయం సాధించడం.. సొంతంగా టీడీపీ 16 స్థానాలు సాధించిన నేపథ్యంలో చంద్రబాబు మద్దతు కీలకం కావడంతో బీజేపీ అగ్ర నేతలు ఆయనకు అధిక ప్రాధాన్యమివ్వక తప్పదని జాతీయ మీడియా అంటోంది. బుధవారం ఢిల్లీలో మోదీ నివాసంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారని.. కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వ ఏర్పాటు, దాని సుస్థిరతకు ఆయన కీలకమని చెబుతోంది. సంకీర్ణ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన.. ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో ఎలాంటి పాత్ర పోషిస్తారనే అంశంపై రాజకీయ విశ్లేషకులు పలు రకాల విశ్లేషణలు చేస్తున్నారు. ఎన్డీటీవీ, సీఎన్ఎన్-న్యూస్ 18, రిపబ్లిక్ వంటి జాతీయ మీడియా సంస్థలు ఆయనపై బుధవారం ప్రత్యేక బులిటెన్లు ప్రసారం చేయడం విశేషం. కొత్త ప్రభుత్వంలో టీడీపీకి లోక్‌సభ స్పీకర్ పదవితో పాటు ఐదు మంత్రిపదవులు ఇవ్వాలని చంద్రబాబు కోరినట్లు ఎన్డీటీవీ పేర్కొంది. ఎన్డీయేలో బీజేపీ తర్వాత 16 సీట్లతో అతిపెద్ద పార్టీ టీడీపీయే కావడంతో బీజేపీ పెద్దలు కూడా చంద్రబాబుకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ఒకే విమానంలో నితీశ్, తేజస్వీ



పట్నా, జూన్ 5: బిహార్ రాజకీయాలు, అక్కడి నాయకుల తీరు ఒక పట్టాన అంచనాలకు అందవు. బిహార్ సీఎం నితీశ్ కుమార్, ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ ఒకే విమానంలో ఢిల్లీకి చేరుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చర్చల కోసం ప్రధాని మోదీ నివాసంలో బుధవారం ఏర్పాటయిన ఎన్డీయే మిత్రపక్షాల సమావేశంలో పాల్గొనడానికి నితీశ్ పట్నా ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో ఏర్పాటుచేసిన ఇండియా కూటమి నేతల భేటీలో పాల్గొనేందుకు తేజస్వీ యాదవ్ అదే విమానంలో ప్రయాణించారు. విమానంలో ఎదురుబొదురు సీట్లలో వాళ్లు ప్రయాణించడం మరో విశేషం. బిహార్‌లోని మొత్తం 40 లోక్‌సభ స్థానాల్లో 12 సీట్లను జేడీ(యు), 4 స్థానాలు ఆర్జేడీ గెలుచుకున్నాయి.

అవినీతి సొమ్ములో కొంత కక్కించారు!

- 'పూడా' వైస్ చైర్మన్ అవినీతిపై రియల్టర్ల తిరుగుబాటు
- వైసీపీ అండతో రెచ్చిపోయారని కార్యాలయం వద్ద ధర్నా
- బెదిరించి వసూలు చేసిన రూ.7 కోట్లు కక్కాలని మండిపాటు
- అప్పటికప్పుడు రూ.50లక్షలు చెల్లించిన శ్రీనివాసరెడ్డి

(నరసరావుపేట-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ అండతో పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డ పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పూడా) వైస్‌చైర్మన్ శ్రీనివాసరెడ్డిపై రియల్టర్లు తిరగబడ్డారు. ఇంతకాలం నోరుమెదపకుండా ఆయన అడిగినట్లు.. చెప్పినట్లు చేసిన రియల్ వ్యాపారులు.. తమ నుంచి వసూలు చేసిన మొత్తాలను కక్కాలంటూ నరసరావుపేటలోని పూడా కార్యాలయం వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. తమ డబ్బు తిరిగి చెల్లించాలని వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డిని నిలదీశారు. ఈ హఠాత్పరిణామంతో గజ్జల కంగుతిన్నారు. అప్పటికప్పుడు రూ.50లక్షల రూపాయలను తిరిగిచ్చేశారు. నరసరావుపేట కేంద్రంగా పూడాను గతంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి వైస్ చైర్మన్‌గా గతంలో జడ్పీ సీఈవోగా పనిచేసిన గజ్జల శ్రీనివాసరెడ్డిని నియమించింది. అయితే నిబంధనలు, ప్లాన్ల మాటున ఆయన అక్రమ వసూళ్లకు తెర లేపారని బాధితులు ఆరోపించారు. జిల్లాలో అనధికార లేవుట్లను 258 వరకు గుర్తించి నోటీసులు జారీ చేశారు. వెంచర్ల క్రమబద్ధీకరణకు సంబంధం లేకుండా ఒక్కొక్క వెంచర్ నుంచి రూ.1.50 లక్షల చొప్పున మొత్తం తమ నుంచి రూ.3.72 కోట్లు వసూలు చేశారన్నారు. అలాగే డీవియేషన్ ఉన్న భవనాలు, బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లను గుర్తించి రూ.4 లక్షల నుంచి రూ.4.5 లక్షల చొప్పున వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. ఇలా రూ.3 కోట్లకు పైగా వసూలు చేశారని చెబుతున్నారు. పలువురు కాంట్రాక్టర్లు కూడా పూడా కార్యాలయానికి వచ్చి తమను తీవ్రంగా నష్టపరిచారంటూ వైస్ చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేసినా జీరో ఖాతా కింద చూపించారని, ఆయన కారణంగా తాము అప్పుల పాలై ఆస్తులను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఆందోళనతో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.50 లక్షలు తిరిగిచ్చేసిన వైస్ చైర్మన్

కార్యాలయం వద్ద ఆందోళనతో కంగుతిన్న అవినీతి తిమింగలం దిగిరాక తప్పలేదు. వసూలు చేసిన అవినీతి సొమ్ములో రూ.50 లక్షలు కక్కించారు. అక్రమంగా వసూలు చేసిన సొమ్ములో శ్రీనివాసరెడ్డి కొంత తిరిగి ఇచ్చారని బాధితులు తెలిపారు. 3 గంటల వ్యవధిలోనే రూ.50 లక్షలు చెల్లించడం గమనార్హం. తమ ఆందోళనతో చేసిన తప్పును ఆయన అంగీకరించినట్లు బాధితులు తెలిపారు. ఒక్క రొంపిచర్ల మండలంలోనే ఈ అధికారి చేసిన ఆర్థిక అరాచకం వల్ల రూ.15 కోట్ల బిల్లులు రాలేదని బాధితులు చెప్పారు. ఓ కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్ల బిల్లులు ఇవ్వకుండా పనులు జరగలేదని తప్పుడు సర్టిఫికేట్ ఇచ్చారన్నారు. దాచిన ఎం.బుక్‌లను కాంట్రాక్టర్ల వారీగా తిరిగి ఆ శాఖ అధికారులకు అప్పగించేందుకు పోలీసుల సమక్షంలో ఒప్పందం జరిగిందన్నారు. రెండు రోజుల్లో ఎం.బుక్‌లు తిరిగి ఇవ్వకపోతే మళ్లీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు.

మీ సేవలిక చాలు!

త్వరగా సెలవుపై వెళ్లిపోవాలని సీఎస్ జవహర్‌రెడ్డికి సంకేతాలు

- చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముందే వెళ్తే మంచిదని సూచన
- ఎన్నికల ముందు జగన్ సర్కారుకు ఏకపక్షంగా పనిచేశారని విమర్శలు
- కుమారుడిపై అవినీతి ఆరోపణలు
- బాబుతో సీఎస్, డీజీపీ, అధికారుల భేటీ




చంద్రబాబును కలిసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, డీజీపీ హరీశ్ గుప్తా

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డిని పక్కన పెట్టాలని కొత్త ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సెలవుపై వెళ్లాలని ఆయనకు సంకేతాలు పంపినట్లు సమాచారం. జగన్ ప్రభుత్వంలో ఆయన ఏకపక్షంగా పనిచేయడంతో పాటు తీవ్ర ఆరోపణలు రావడం ఇందుకు కారణమని తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ప్రధాన కార్యదర్శిగా జవహర్ రెడ్డి ఉండటాన్ని అప్పటి ప్రధాన ప్రతిపక్షం టీడీపీ వ్యతిరేకించింది. ఆయనను బదిలీ చేయాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తులు పంపింది. వృద్ధులకు నెలవారీ పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను దూరంగా ఉంచిన తర్వాత సచివాలయాల సిబ్బంది ద్వారా ఇళ్ల వద్ద పంపిణీ చేయించాలని సీఎస్‌ను టీడీపీ కోరింది. కాన్నీ అందుకు విరుద్ధంగా ఒక నెలలో గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయించిన అధికార యంత్రాంగం.. తర్వాతి నెలలో బ్యాంకు ఖాతాల్లో వేయించింది. దీనివల్ల వృద్ధులు చాలా అవస్థలు పడ్డారు. ప్రతిపక్షాల పట్ల వ్యతిరేకత కలిగేలా వారిని రెచ్చగొట్టడానికే సీఎస్ ఇలా చేశారని టీడీపీ ఆరోపించింది. ముఖ్యమంత్రి ఏనాడో బటన్ నొక్కిన పథకాలకు సరిగ్గా పోలింగ్ ముందు లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు విడుదల చేయాలని అధికార యంత్రాంగం చూడటం కూడా ప్రతిపక్ష పార్టీల విమర్శలకు దారితీసింది. చివరకు ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని పంపిణీని నిలిపివేయించింది. ఇక విశాఖ చుట్టుపక్కల ఎసైన్‌మెంట్ భూములను జవహర్ రెడ్డి కుమారుడు అక్రమంగా కొనుగోలు చేశారని జనసేన, టీడీపీ బహిరంగంగా ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఆయనను ప్రధాన కార్యదర్శిగా కొనసాగించడం వాంఛనీయం కాదని టీడీపీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే నాటికే తప్పుకొని సెలవుపై వెళ్తే బాగుంటుందని ఆయనకు సమాచారం పంపారని ప్రచారం జరుగుతోంది.

చంద్రబాబుతో అధికారుల భేటీ

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో జవహర్ రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబును ఆయన నివాసంలో బుధవారం కలిశారు. ఆయన కలిసిన సమయంలో చంద్రబాబు ముభావంగా ఉన్నట్లు సమాచారం. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, జవహర్ రెడ్డి, మరికొందరు అధికారులు చంద్రబాబు నివాసానికి వెళ్లారు. చంద్రబాబు మొదట డీజీపీని పిలిపించి కొద్దిసేపు మాట్లాడారు. ఆయన వెళ్లిపోయిన తర్వాత జవహర్ రెడ్డి సహా ఐఏఎస్ అధికారులు అందరినీ ఒకేసారి తన గదిలోకి పిలిపించారు. జవహర్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చే సమయంలో చంద్రబాబు ఎలాంటి ప్రతిస్పందనా వ్యక్తం చేయకుండా ముభావంగా ఉన్నారు. కొన్ని విషయాలు వివరించాల్సి ఉందని జవహర్ రెడ్డి చెప్పగా, ఇప్పుడేమీ అవసరం లేదని చంద్రబాబు బదులిచ్చారు. ప్రమాణ స్వీకార సమయం, స్థలం వివరాలు చెబితే ఏర్పాట్లు మొదలు పెడతామని జీఏడీ కార్యదర్శి అన్నారు. ఖరారు కాగానే కబురు పెడతామని చంద్రబాబు చెప్పారు. అటవీ పర్యావరణ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కూడా ఆ సమయంలో వచ్చారు. ఆయనతో చంద్రబాబు కొద్దిసేపు విడిగా మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు కూడా చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

బాబు నివాసం కిటకిట

ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో బుధవారం చంద్రబాబు నివాసానికి తరలివచ్చారు. దీనితో ఆయన నివాసం కిటకిటలాడింది. చంద్రబాబును కలిసిన వారిలో ఎంపీలు పెమ్మసాని చంద్రశేఖర్, కృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, కన్నా లక్ష్మీనారాయణ, గద్దె రామ్మోహనరావు, బత్తుల ఆనందరావు, అరిమిల్లి రాధాకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, కొల్లు రవీంద్ర, ఆనందబాబు, శ్రావణ్‌కుమార్, యార్లగడ్డ వెంకట్రావు, పార్థసారథి తదితరులున్నారు.

ఉత్తమ విద్యార్థికి విమానయాన కానుక!

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు



విమానాశ్రయం వద్ద ఉపాధ్యాయులతో సుశాంక్‌రెడ్డి

కదిరి అర్బన్, జూన్ 5: పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించే విద్యార్థికి విమానం ఎక్కే అవకాశం కల్పిస్తానని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మాటిచ్చారు. ఆ మాట ప్రకారం.. విజేతగా నిలిచిన విద్యార్థిని విమానంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు పంపించారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎద్దుల సుశాంక్ రెడ్డికి ఈ అరుదైన కానుకను జీవశాస్త్ర ఉపాధ్యాయుడు తలమర్ల ప్రభాకర్ ఇచ్చారు. సుశాంక్ రెడ్డి పదో తరగతిలో 589 మార్కులు సాధించి, మండల టాపర్‌గా నిలిచాడు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం టాప్ స్కోర్ సాధించిన సుశాంక్ రెడ్డిని బుధవారం బెంగళూరుకు తీసుకువెళ్లి.. అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లే విమానం ఎక్కించారు. విద్యార్థికి తోడుగా ఓ టీచర్ భార్యను పంపించారు. అక్కడి నుంచి తిరిగి వచ్చేందుకు రైలు టికెట్లను కూడా ఉపాధ్యాయుడు బుక్ చేశారు.

నీట్‌లో శ్రీచైతన్య సరికొత్త రికార్డు



హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు సరికొత్త రికార్డును నెలకొల్పారని శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి 720కి 720 మార్కులతో ఓపెన్ కేటగిరిలో 9 ఆలిండియా ఫస్ట్ ర్యాంకులను సాధించినట్లు ఆమె చెప్పారు. 9 మంది 720 మార్కులు, 30 మంది 715 కు పైగా, 57 మంది 710 కి పైగా, 132 మంది 700 కు పైగా, 852 మంది 650 కు పైగా మార్కులు సాధించి సత్తా చాటారని వివరించారు. అలాగే ఈ ఏడాది నీట్‌లో 22 వేల మంది విజయం సాధించడంతో పాటు, 9,512 మందికి పైగా మంది డాక్టర్లు కావడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. నీట్‌లో తమ విద్యార్థులు చూపిన అసాధారణ ప్రతిభకు గర్విస్తున్నట్లు సుష్మ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


నవీన్ నిష్క్రమణ

ఒడిశాను ఇరవైనాలుగేళ్ళపాటు ఏకధాటిగా ఏలిన నవీన్ పట్నాయక్ బుధవారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికలతో పాటుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ బిజూ జనతాదళ్ ఓడిపోయింది. 147స్థానాల శాసనసభలో బీజేపీ 78గెలుచుకొని మెజార్టీమార్కు దాటితే, ఈయన పార్టీ 51 స్థానాల దగ్గర చతికిలబడింది. మరోవైపు 21 లోక్‌సభ స్థానాల్లో ఒకటి కాంగ్రెస్‌కు పోను, 20 స్థానాలను బీజేపీ తన్నుకుపోయింది. ఎదురుదెబ్బలే అలవాటు లేని ఆయన ఇలా ఒకేమారు రెండు దెబ్బలు తిన్నారు. ఈ మారు గెలిచివుంటే దేశచరిత్రలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉన్న రికార్డు ఆయన సొంతమయ్యేది. నవీన్‌బాబుకు ఆ ఘనత దక్కకుండా చేయడంలో తమిళనాడుకు చెందిన వీకే పాండియన్ అనే అధికారి పాత్ర ఎంతో ఉన్నదని కొందరి వాదన.

నవీన్ పట్నాయక్ పుట్టింది కటక్‌లో అయినా, పెరిగిదంతా ఢిల్లీలోనే. ఉన్నత విద్యావంతులు, ప్రపంచస్థాయి ప్రముఖుల, కళాకారుల సాన్నిహిత్యంలో జీవితం హాయిగా, సాఫీగా సాగిపోతున్న తరుణంలో, తండ్రి బిజూ పట్నాయక్ మరణంతో రాష్ట్ర రాజకీయాల్లోకి ఐదుపదుల వయసులో ప్రవేశించాల్సివచ్చింది. అనతికాలంలోనే ఆయన పాలనమీద పట్టు సాధించాడు, ఆకలి, దారిద్ర్యం, కరువుకాటకాలకు పేరుపడిన రాష్ట్రాన్ని ఉద్ధరించి, చాలా రంగాల్లో ఉన్నతంగా నిలబెట్టాడు. 2019 ఎన్నికల్లో ఆయన పార్టీకి 113 సీట్లు వచ్చాయి. ఇప్పుడు ఆయన ఎందుకైనా మంచిదని రెండుచోట్ల పోటీచేస్తే ఒకటి ఓడి, మరోచోట నాలుగు వేల మెజారిటీతో బయటపడ్డారు.

ఒడిశాలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఆ రాష్ట్రచరిత్రలో ఇదే తొలిసారి. పదిహేనేళ్ళక్రితం వరకూ బీజేపీ–బీజేడీ మధ్య పొత్తు నడిచినా 2009 సార్వత్రిక ఎన్నికల ముందు ఆ కూటమి కూలిపోయింది. ఈ ఎన్నికల ముందు కూడా రెండు పార్టీల మధ్యా సీట్ల పంపకాలకు సంబంధించిన ప్రయత్నాలు జరిగి, చివరకు మార్చినెలాఖరులో ఒంటరిపోరుకు పోతున్నట్టు బీజేపీ ప్రకటించింది. ఆ తరువాత, నవీన్‌మీద బీజేపీ నాయకులు చేసిన యుద్ధం భీకరంగా సాగింది. ప్రధాని మోదీ రెండు రోడ్‌షోలు నిర్వహించారు, పది ఎన్నికల సభల్లో ప్రసంగించారు. కేంద్ర మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు, సినీనటులు వందలాది సభలతో రాష్ట్రాన్ని చుట్టబెట్టేశారు. బీజేడీ ప్రచారం ఇందుకు పూర్తి భిన్నంగా నిస్తేజంగా సాగింది. ప్రధానంగా బస్సుల్లో తిరగడం, అద్దాల్లోంచి చేతులు ఊపడం తప్ప నవీన్ పెద్దసంఖ్యలో ఎన్నికల ప్రచార సభలు నిర్వహించలేకపోయారు. నవీన్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈ మారు ఆయన గద్దెనెక్కినా ప్రయోజనం ఉండదని బీజేపీ ప్రచారం చేసింది. పట్నాయక్ ఆరోగ్యం క్షీణించడం వెనుక పాండ్యన్ కుట్ర ఉన్నట్టుగా, సీఎం కుర్చీకోసం పాండ్యన్ తల్లడిల్లిపోతున్నట్టుగా ఉధృతంగా ప్రచారం సాగింది. ప్రధాని మోదీ స్వయంగా నవీన్ ఆరోగ్యం మీద ఆందోళన వ్యక్తంచేసి కథనాన్ని రక్తికట్టించారు. అలాగే, పూరీ జగన్నాథుని రత్నభాండార్ (ట్రెజరీ) తాళాలు కనిపించకుండా పోయాయంటూ బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆ తాళంచెవి పాండ్యన్ దగ్గర ఉన్నదన్న తరహాలో వాదనలు సాగాయి. బిజూ జనతాదళ్ ఈ ఆరోపణలను ధీటుగా తిప్పికొట్టినప్పటికీ, ఆలయం అంశం ప్రజల మనోభావాలమీద పనిచేయలేదని అనుకోలేం. నవీన్ ఆరోగ్యం చుట్టూ సాగిన వాదనలన్నీ అప్పటివరకూ ఒడిశాప్రజలు తాము అభిమానించిన పాండ్యన్‌ను అనుమానించేందుకు ఉద్దేశించినవే. పూరీ జగన్నాథుడి సొమ్ము ఈ పాండియన్ తమిళనాడుకు తరలించేస్తున్నాడని స్వయంగా ప్రధాని విమర్శలు చేశారు. పలు పథకాల సృష్టికర్తగా, నవీన్‌బాబు విశ్వాసపాత్రుడిగా ఆయననూ ఆదరించిన జనంమీద ఈ విమర్శలతో పాటు, ఒడిశా ఆత్మగౌరవం ప్రచారం బాగా పనిచేసింది. ఆత్మవిశ్వాసమో, అహంకారమో తెలియదు కానీ, పాతికేళ్ళుగా తాను సంపాదించుకున్న కీర్తిముందు బీజేపీ నిలువదనీ, దానివి కుప్పిగంతులేనని నవీన్ ఆదిలో భ్రమపడ్డారు. తరువాత ఏవో సవరణలు వివరణలతో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. తనకు రాజకీయంగా ఏమాత్రం అవసరం లేకున్నా కష్టమైన, క్లిష్టమైన సందర్భాల్లో ఆయన బీజేపీని రక్షించుకొచ్చాడు. మోదీ ప్రభుత్వం తీసుకున్న ప్రతీ నిర్ణయాన్ని సమర్థించి, వివాదాస్పదమైన బిల్లులను సైతం గట్టెక్కించారు. ఇంతకాలమూ ఆ పార్టీని నెత్తిన మోసి, మాటలు పడి, ఆఖరులో దానికే అధికారాన్ని అప్పగించారు.

ఏపీకి ఇప్పుడు 'తన రోజులు' వచ్చాయి!



ఎంత సన్నగా వీచినా రుతుపవనం సోకిన వెంటనే, రోహిణి ఎండలకు ఇక చివరి రోజులని తెలిసిపోతుంది. ఉక్కపోత తగ్గిపోతుంది. అర్చుకుపోయిన గుండెలను మృగశిర చల్లారుస్తుంది. అడుగడుగున మొలిచిన అగడ్తలు కొన్నైనా పూడుకుపోతాయి. సంకెళ్లు తెగకపోయినా, కనీసం సడలింపు దొరుకుతుంది. ఎంత కొంచెమైనా స్వేచ్ఛ కలిగించే జీవితేచ్ఛే వేరు.

ఇంతా చేసి, జరిగిందేమీ లేదు. ఆయనే మళ్లీ ప్రధాని అవుతారు. కాకపోతే, మునుపటిలాగా ఉండలేరు. బహుశా కొంత ఒదిగి ఉంటారు. అదుపులో ఉంటారు. అరుపువెక్కులతో మాత్రమే ఎగురుతారు. నవ్వుతూ మాట్లాడతారు. ముఖంలోకి ప్రసన్నత తెచ్చుకుంటారు. మొన్నటి ఎన్నికల ప్రచారంలో అట్లా మాట్లాడింది తాను కానే కాదన్నట్టు వ్యవహరిస్తారు. ఇంత మాత్రానికే స్వేచ్ఛలూ సడలింపులూ అని ఆశపడవచ్చా?

ఆయనలో మార్పు వచ్చి, పరిస్థితులు మారడం కాదు. పరిస్థితి మారినందువల్ల, ఆయనలో నిజంగానో, అభినయంలోనో మార్పు అవసరమౌతోంది.

పరిస్థితి ఏమి మారిందో తెలియాలంటే, మంగళవారం మధ్యాహ్నం నుంచే గొంతుసవరించుకుంటున్న జాతీయ మీడియాను చూడాలి. ఇంకా ఒడిలోనే కూర్చున్నా, నాలికకు నరం బిగించుకుంటున్న విన్యాసం చూడాలి. బుధవారం పొద్దుటి నుంచి ఢిల్లీలో రూపొందిన సన్నివేశాలను చూడాలి. సకల రాజకీయ పక్షాలూ రెండు కూటములుగా మోహరించుకుని జరుపుతున్న భేటీలు చూడాలి. ముఖ్యమంత్రులను జైళ్లకు పంపిన పెద్దలతో.... మద్దతులు ఉచితంగా రావని తేల్చిచెబుతున్న చంద్రబాబు, నితీశ్‌లను చూడాలి.

ఎవరు అధికారంలోకి వస్తున్నారు అన్నదే ముఖ్యం అనుకుంటే, ఈ లోక్‌సభ ఫలితాలలో కొత్త ఏమీ లేదు. కొనసాగింపు మాత్రమే చూడదలిస్తే, ఇది ముచ్చటగా మూడోసారి. నెహ్రూ తరువాత నరేంద్రుడే. ఫలితాల సారాంశం చూస్తే, ఏకపక్షం నుంచి తిరిగి సంకీర్ణం. తీవ్రజాతీయవాదానికి, కర్కశ నిర్బంధ విధానాలకు, ప్రత్యర్థుల వేధింపులకు కొద్దిపాటి విరామానికి ఆస్కారం ఉంటుందని, నలిగిన గొంతులకు కొత్త ధైర్యం ఇచ్చే వాతావరణం ఏర్పడుతుందని, లొంగిన వ్యవస్థలకు స్వతంత్రించే అవకాశం వస్తుందని ఆశ కలగడం. మంగళవారం నాటి లోక్‌సభ ఫలితాలలో తక్షణ విజయాలకు మించి, రాబోయే రోజుల వాగ్దానమే ఆకర్షణీయంగా ఉన్నది.

దేశ రాజకీయాలకు సంబంధించి, ప్రజాప్రమేయాన్ని మెరుగుపరిచే పరిణామాలు రావడంలో ఆంధ్రప్రదేశ్ తీర్పు దోహదం చాలా ఉన్నది. మోదీ గనుక తాను అనుకున్న మూడున్నర వందలో నాలుగువందలో సాధించి ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయం ఆ రాష్ట్రం వరకే పరిమితమై ఉండేది. దుష్పరిపాలన అంతం కావడం, రాజధాని మొదలైన అభివృద్ధి సమస్యలకు పరిష్కారం దొరకడం వరకే ఆ విజయానికి ప్రాధాన్యం ఉండేది. కానీ, ఇప్పుడు, రాష్ట్ర అసెంబ్లీ విజయం కంటె లోక్‌సభకు తెలుగుదేశం నుంచి గెలిచిన సభ్యుల సంఖ్యకు అధిక ప్రాధాన్యం ఏర్పడింది. జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ తెలుగుదేశం విజయాలు కీలకంగా మారాయి. తెలంగాణలోనూ, బీజేపీకి లభించిన ఎనిమిది విజయాలు విశేషమైనవి అయినప్పటికీ, జాతీయస్థాయిలో మోదీజోరు తగ్గడంతో పెద్ద సంచలనం కలిగించలేకపోయాయి. మోదీకి పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే, చంద్రబాబు ప్రాధాన్యం అత్యంత పరిమితంగా ఉండేది. తెలుగుదేశం బలగం మోదీ ప్రభుత్వ మనుగడకే కీలకం కావడంతో, ఇప్పుడు చంద్రబాబు ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. "భారతదేశంలో ద్వేషం ఓడిపోయింది, ముస్లిముల మీద సానుకూలవైఖరి కలిగిన రెండు పార్టీల దయాదాక్షిణ్యాల మీద మోదీ ప్రభుత్వం ఆధారపడవలసి వస్తోంది" అన్న అర్థంలో ప్రముఖ పాకిస్తానీ పత్రిక 'డాన్' పతాకశీర్షిక పెట్టింది. పశ్చిమ దేశాల మీడియా కూడా, మోదీ బలం తరిగిపోవడం గురించి, తెలుగుదేశం, జనతాదళ్(యు) మీద ఆధారపడి సంకీర్ణం ఏర్పడడం గురించి ప్రముఖంగా రాస్తున్నాయి, చెబుతున్నాయి. బీజేపీ ప్రభుత్వం దూకుడుకు ఈ రెండు పార్టీలు కళ్లెం వేస్తాయని, వేయాలని దేశంలోని వివిధ వర్గాలు కూడా ఆశిస్తున్నాయి. కొన్ని బృందాలైతే ఏకంగా, చంద్రబాబు ఇండియా కూటమిలోకి మారాలని కూడా అభ్యర్థిస్తున్నాయి. బీజేపీతో కూటమి కట్టడానికి తెలుగుదేశానికి నిన్న ఒక కారణం ఉన్నట్టే, తెగదెంపులు చేసుకోవడానికి కూడా రేపు ఒక కారణం ఏర్పడాలి. అంతవరకు, చంద్రబాబు మిత్రధర్మానికే కట్టుబడి ఉండవచ్చు, కాకపోతే, కొన్ని షరతులతో.



■ కె. శ్రీనివాస్

సందర్భం

విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పుడు 'తన రోజులు' వచ్చాయి. రాజధాని శంకుస్థాపనకు వచ్చి, తనవంతు వాటాగా నీళ్లూ మట్టీ ఇచ్చిన నాయకుడు, ఇప్పుడు తన భాగస్వామి అయిన చంద్రబాబు నాయుడి డిమాండ్లను శ్రద్ధగా ఆలకించక తప్పదు, నెరవేర్చకా తప్పదు. కేంద్ర మంత్రివర్గంలో రావలసిన స్థానాలను, తనకు చెందవలసిన అభివృద్ధిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడు సాధికారికంగా రాబట్టుకుంటుంది. ఏకపక్ష పాలనకు, సంకీర్ణ భాగస్వామ్య పాలనకు తేడా ఇదే. ఒకే దేశం ఒకే నాయకుడు అని భ్రమిస్తే, దక్షిణ భారతదేశానికి ఏమి దక్కుతుందో తెలిసిందే. వైవిధ్యభరిత దేశం, బాహుళ్య నాయకత్వం అన్నదే ఉన్నంతలో ప్రజలకు మేలు చేస్తుంది. ఎన్‌డీఏ వెంట ఉంటామని, మోదీ నాయకత్వాన్ని సమర్థిస్తామని సూత్రప్రాయ ప్రకటన చేసినప్పటికీ, అధికారిక ప్రకటన వెలువడే లోపే కావలసిన వాగ్దానాలు పొందాలన్నది తెలుగుదేశం పార్టీకి, యునైటెడ్ జనతాదళ్‌కు, ఇతర చిన్న పక్షాలకు తెలుసు. ఆయా రాష్ట్రాల డిమాండ్లను పరిశీలించి తీరవలసిన అగత్యంలోకి బీజేపీ వెళ్లింది. తన వంతు కోసం ఇండియా కూటమి మాటువేసి ఉన్నంత కాలం, బీజేపీ మీద ఆ ఒత్తిడి పనిచేస్తూనే ఉంటుంది. పాలక కూటముల మధ్య పోటీలో కూడా కొంత ప్రజాప్రయోజనం నెరవేరుతుంది.

తెలుగుదేశం కానీ, నితీశ్ జనతాదళ్ కానీ జాగ్రత్త పడవలసిన విషయం ఒకటి ఉంది. బీజేపీ సొంతంగా సంపాదించుకున్న సంఖ్యకి కనీస మెజారిటీకి మధ్య తేడా 32. మిత్రపక్షాలు చేస్తున్న జోడింపు 52. అంటే మెజారిటీకి మించి కేవలం 20 మాత్రమే ఎన్‌డీఏ దగ్గర ఉన్నాయి. ఈ రెండు పార్టీల దగ్గర ఉన్న 28 మినహా తక్కిన 24 చిన్నా చితకా పార్టీల నుంచి సమకూరినవి. డిమాండ్ల విషయంలో, విధానాల విషయంలో ఈ పక్షాలన్నిటి నుంచి ఒత్తిడిని తప్పించుకోవడానికి బీజేపీ ఇతర మార్గాల నుంచి బలసమీకరణ చేస్తుంది. ఇప్పటికే, ఏ కూటమికి చెందని పదకొండు మంది ఎంపీల మద్దతు సంపాదించినట్టుంది. తమ ప్రాబల్యాన్ని తగ్గించడానికి జరిగే అదనపు బలసమీకరణను తెలుగుదేశం, జనతాదళ్ (యు) గమనిస్తూ ఉండాలి. బీజేపీ తమ మీద ఆధారపడేట్టు చూసుకోవడంలోనే తమ ప్రయోజనాలు నెరవేరే అవకాశం ఉంది. దానదండోపాయాల ద్వారా చీలికలను, చేరికలను కల్పించే ప్రయత్నాల విషయంలో జాగ్రత్తగా మెలగాలి.

ఈ జాతీయ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన తీర్పు, ఏకశిలా సదృశమైనది కాదు. అనేకపార్శ్వాల తీర్పు. సర్వం సహాధికారానికి బీజేపీని దూరంగా నిలబెట్టడం ఒక కోణం అయితే, క్షేత్ర స్థాయిలో సానుకూలత ఉన్నా, తగినంత వ్యూహరచన లేకుండా, సన్నద్ధత లేకుండా ఎన్నికల పోరాటం చేసిన ఇండియా కూటమిని కూడా నిరీక్షణలో ఉంచడం మరో పార్శ్వం. ఈ సంకీర్ణత, ప్రజలకు కావలసిన వెసులుబాటు ఇస్తుందని, తమ ఆకాంక్షలను వ్యక్తం చేయడానికి, సమస్యల పరిష్కారానికి పోరాడడానికి వారికి అవకాశం ఇస్తుందని కూడా ఈ తీర్పు భావించింది. ప్రజాశ్రేణులలో ఎంతో వైవిధ్యం, అనేక ప్రాంతాలు, సంస్కృతులు కలగలసిన దేశంలో, అందరికీ చోటు ఉండే పరిపాలన, అందరినీ కలుపుకుపోయే సామరస్యం అవసరం. ప్రధాని పదవికి కూడా మచ్చతెచ్చే విధంగా సాగిన విద్వేష ప్రచారాన్ని ఈ ఎన్నికలలో ప్రజలు తిరస్కరించారు. అటువంటి విభజన రాజకీయాల మీద ఆసక్తి లేని పక్షాల చేతిలో ప్రభుత్వ భవితవ్యాన్ని పెట్టారు. తెలుగుదేశం, జనతాదళ్ వంటి పార్టీలు తమ విజయంలో దాగి ఉన్న జాతీయ కర్తవ్యాన్ని కూడా గుర్తించే ఉంటాయి. అయినా సరే, కొత్త ప్రభుత్వం అనైతిక పద్ధతులతో ప్రజాతీర్పుకు విరుద్ధంగా బలాన్ని పెంచుకుని, సంకీర్ణ ధర్మాన్ని విస్మరించి, గత పదేళ్ల విధానాలనే కొనసాగిస్తే, ప్రజలకు, ప్రాంతీయ పక్షాలకు ఆశాభంగమే మిగలవచ్చు. అందుకే అప్రమత్తత అవసరం.

కూటమిగా మెజారిటీ లభించినప్పటికీ, ఏ ఒక్క పార్టీకీ జనాదేశం లేకపోవడాన్ని పరిగణించాలని, తాము కూడా అధికారాన్ని కోరుకోవడంలో తప్పులేదని ఇండియా కూటమి వాదిస్తోంది. ఎన్నికల ముందు ఏర్పడిన కూటములు ఫలితాల వెంటనే విచ్ఛిన్నం కావు. బలమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తే, ప్రభుత్వం నుంచి మెరుగైన పాలన అయినా వస్తుంది లేదా అధికార కూటమి అంతర్గత సంక్షోభంలో పడే అవకాశం ఉంటుంది. సమయం కోసం వేచి ఉండడం మంచిది. ప్రపంచమంతా గుర్తిస్తున్నట్టు, ఇప్పుడు మోదీ ప్రభుత్వానికి ఊతకర్రలుగా మారిన రెండు పార్టీలు, ఇండియా కూటమికి కూడా సహజమిత్రులే కదా?

> ప్రజాశ్రేణులలో ఎంతో వైవిధ్యం, అనేక సంస్కృతులు కలగలసిన దేశంలో, అందరికీ చోటు ఉండే పరిపాలన, అందరినీ కలుపుకుపోయే సామరస్యం అవసరం. ప్రధాని పదవికి మచ్చతెచ్చే విధంగా సాగిన విద్వేష ప్రచారాన్ని ఈ ఎన్నికలలో ప్రజలు తిరస్కరించారు. అటువంటి విభజన రాజకీయాల మీద ఆసక్తి లేని పక్షాల చేతిలో ప్రభుత్వ భవితవ్యాన్ని పెట్టారు. తెలుగుదేశం, జనతాదళ్‌లు తమ విజయంలో దాగి ఉన్న జాతీయ కర్తవ్యాన్ని గుర్తించే ఉంటాయి. అయినా సరే, కొత్త ప్రభుత్వం అనైతిక పద్ధతులతో ప్రజాతీర్పుకు విరుద్ధంగా బలాన్ని పెంచుకుని, గత పదేళ్ల విధానాలనే కొనసాగిస్తే, ప్రజలకు, ప్రాంతీయ పక్షాలకు ఆశాభంగమే మిగలవచ్చు. అందుకే అప్రమత్తత అవసరం.

> మోదీకి పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే, చంద్రబాబు ప్రాధాన్యం అత్యంత పరిమితంగా ఉండేది. తెలుగుదేశం బలగం మోదీ ప్రభుత్వ మనుగడకే కీలకం కావడంతో, ఇప్పుడు చంద్రబాబు ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. బీజేపీతో కూటమి కట్టడానికి తెలుగుదేశానికి నిన్న ఒక కారణం ఉన్నట్టే, తెగదెంపులు చేసుకోవడానికి కూడా రేపు ఒక కారణం ఏర్పడాలి. అంతవరకు, చంద్రబాబు మిత్రధర్మానికే కట్టుబడి ఉండవచ్చు, కాకపోతే, కొన్ని షరతులతో.

సునామీని మించిపోయిన ఏపీ ఎన్నికలు!

ఆంధ్రప్రదేశ్ ప్రజలు వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేశారు. అధికార పార్టీ మీద ప్రజల్లో సహజంగానే కొంత వ్యతిరేకత ఉంటుంది. కానీ ఇంతటి వ్యతిరేకత ఉందని విపక్ష పార్టీలు కూడ ఊహించి ఉండవు. 2019లో వైసీపీకి 151 స్థానాలిచ్చిన ప్రజలు ఐదేళ్ళు తిరగ్గానే 11 స్థానాలకు దించేశారు. ఇది ఓటమి మాత్రమే కాదు; ఘోర పరాజయం.

జగన్ ఓటమి మీద రెండు రకాల నేరేటివ్స్ బలంగా వినిపిస్తున్నాయి. జగన్ తన నియంతృత్వ పోకడలవల్ల, ఫ్యాక్షనిస్టు మనస్తత్వంవల్ల, వ్యవస్థల్ని ఓవర్ యూజ్ కాదు; అబ్యూజ్ చేయడం మూలంగా ఓడిపోయారు అనేది మొదటి నేరేటివ్. తెలుగులో దీన్ని 'క్రూరంగా చెరపడం' అనవచ్చు. సంక్షేమ పథకాలు – ఉచితాలవల్ల ఓడిపోయారు అనేది రెండవ నేరేటివ్. మొదటి నేరేటివ్‌తో ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన పనిలేదు. కానీ, రెండో నేరేటివ్ మీద కొంత వివేకంతో నిర్ణయాలు తీసుకోవాలి.

అవకాశాలు ఉన్నోళ్ళు అవకాశాలు లేనోళ్ళు కలిసి ఉండే సమాజాల్లో అవకాశాలు లేనోళ్ల మీద ప్రభుత్వాలు అదనపు ప్రేమను చూపించాల్సి ఉంటుంది. దీన్ని వివక్షగా చిత్రించి విమర్శించేవాళ్ళూ సమాజంలో ఉంటారు. వాళ్ళు వీటిని 'ఉచితాలు' అంటూ ఎద్దేవా చేస్తుంటారు. అవకాశాలు ఎక్కువగా ఉన్నోళ్ళు సాధారణంగా ఇలాంటి వాదనలు చేస్తుంటారు. అవకాశాలు లేనోళ్ళను ఆదుకోవడానికి 'సానుకూల వివక్ష' (Positive Discrimination)ను పాటించడం అవసరం. జగన్ ఓటమి కారణంగా భవిష్యత్తులో 'సానుకూల వివక్ష' అనే విధానం మానిపోకూడదు. ఎలాగూ చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో మరిన్ని సంక్షేపథకాలు ప్రకటించారు. సంక్షేమం కొనసాగుతుంది. కొనసాగాలి కూడా.

గత ఏడాది జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ఓడిపోయినపుడు, ఆయన్ని అభిమానించే ఓ పత్రికాధిపతి నాకు ఫోన్ చేశారు. 'అనేక రకాల సంక్షేమ పథకాలతో అన్నివిధాలా ఆదుకున్న కేసీఆర్‌ను ప్రజలు ఓడించారు' అనే కాన్సెప్ట్‌తో ఒక వ్యాసం రాసిపంపమన్నారు. 'కేసీఆర్ ఓడిపోవడానికి కారణం సంక్షేమ పథకాలు, నీటి పారుదల ప్రాజెక్టులు కాదు; ఆయన అహంకారం, నిరంకుశత్వం, కుటుంబ పాలన ఆయన్ని ఓడించింది' అన్నాను.

జగన్ విషయంలోనూ సరిగ్గా అదే జరిగింది. రాజశేఖరరెడ్డి హయాంలో మంత్రివర్గంలో గొప్ప టీం ఉండేది. ఆర్థికమంత్రి రోశయ్య, హోంమంత్రి జానారెడ్డి, వ్యవసాయశాఖామంత్రి రఘువీరారెడ్డి, రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు, మునిసిపల్ శాఖామంత్రి కోనేరు రంగారావు, దేవాదాయ శాఖా మంత్రి జె.సి.దివాకర్ రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎం.ఎస్.సత్యనారాయణ, డి. శ్రీనివాస్, సబితా ఇంద్రారెడ్డి, నేదురుమల్లి రాజ్యలక్ష్మి, గీతారెడ్డి... ఇలా ఎవరికి వారు తమ శాఖల విషయాల్లో చాలా అప్‌డేట్‌గా ఉండేవారు. డి.శ్రీనివాస్, ఎం.ఎస్. సత్యనారాయణ, జె.సి. దివాకర్ రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి తదితరులు అప్పుడప్పుడు విలేకరుల ముందే వైయస్ మీద కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తుండేవారు. అది వైయస్‌కు కూడ తెలుసు. కానీ అందరూ టీమ్ ధర్మాన్ని పాటించేవారు. అందుకే, విపక్షాలు మహాకూటమి కట్టినా వైయస్ టీం 2009 ఎన్నికల్లో మళ్ళీ గెలిచింది. ఆ టీమ్ వారసత్వం జగన్‌కు లేదు, రాలేదు. జగన్ ఎన్నడూ బహువచనం కాదు, ఏకవచనం.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. ప్రభుత్వంలో వ్యవసాయ, నీటిపారుదల శాఖలు ప్రాణం వంటివి. వ్యవసాయశాఖామంత్రి వ్యవసాయం గురించి మాట్లాడడం, నీటిపారుదల శాఖా మంత్రి నీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడడం గత ఐదేళ్లలో మనం వినిఉండం. జగన్ కేబినేట్‌లో సకల శాఖలకు ఒకరే మంత్రి– సజ్జల రామకృష్ణారెడ్డి. ఇది ప్రజలకు ఏ మాత్రం నచ్చలేదు. తెలంగాణలో కేటీఆర్, కవిత కలిసి కేసీఆర్‌ను ఓడించినట్టు ఏపీలో సజ్జల రామకృష్ణారెడ్డి ఒంటి చేతి మీద జగన్ను ఓడించారు.

జగన్ నిర్మూలన మీద పెట్టినంత శ్రద్ధను నిర్మాణం మీద పెట్టలేదు. 'వాళ్ళ ఇల్లు కూలగొట్టారు, వీళ్ల ఇళ్ళు కూలగొట్టారు' అనే తరహా వార్తలు తప్ప ఆ ప్రాజెక్టు కట్టించారు, ఈ రోడ్డు వేయించారు అనే వార్తలు ఎక్కడా వినిపించలేదు. చంద్రబాబును అరెస్టు చేయడం దీనికి పరాకాష్ఠ. అప్పట్లో జగన్‌ను అరెస్టు చేయడంవల్ల సానుభూతి పెరిగినట్టు ఇప్పుడు చంద్రబాబు మీద సానుభూతి పెరిగింది. ఈ చిన్న లాజిక్‌ను జగన్ ఎలా మరిచారో?

వైయస్. రాజశేఖర రెడ్డి తన మీద ఫ్యాక్షనిస్టు ముద్రపడకుండ జాగ్రత్తలు పడేవారు. జగన్ ఫ్యాక్షనిస్టుగా గుర్తింపు పొందడానికి ఉత్సాహం చూపారు. వారు సాగించిన ప్రతీకార చర్యలు ప్రజలకు నచ్చలేదు. ఆయన 'నవరత్నాల' లబ్ధిదారులు సహితం జగన్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. కులం లేదు మతంలేదు ప్రాంతంలేదు అందరిదీ సింగిల్ పాయింట్ ప్రోగ్రాం– జగన్‌ను దించేయడం. అందరిదీ అంటే అతిశయోక్తి కావచ్చుగానీ, రాష్ట్రంలో కనీసం 60 శాతం మంది జగన్‌ను కచ్చితంగా ఓడించాలనుకున్నారు!

సామ్యవాద, మతసామరస్య భావాలు కలిగిన పౌరసమాజం కూడ ఏపీ ఎన్నికల్లో సైద్ధాంతిక గందరగోళంలో పడిపోయింది. వర్తమాన భారత సమాజంలో పౌరసమాజం ఎదుర్కొనే ప్రధాన సమస్య గుజరాత్ అధిపత్య బీజేపీ. మహారాష్ట్ర అధిపత్య ఆరెస్సెస్ కన్నా గుజరాత్ అధిపత్య బీజేపీ మరింత ప్రమాదకారి అని పౌర సమాజం భావిస్తోంది.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో వెలుగులోనికి వచ్చిన 'ఎద్దేలు కర్నాటక (మేలుకో కర్ణాటక) ఉద్యమం అక్కడ అధికార బీజేపీని ఓడించడంలో సఫలం అయింది. దానికి కొనసాగింపుగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన 'జాగో తెలంగాణ' కూడ ప్రభుత్వాన్ని మార్చడంలో తనవంతు పాత్రను పోషించింది.

చంద్రబాబు అరెస్టు వెనుక కేంద్రం హస్తం కూడ ఉందనే మాట బలంగా వినిపించినపుడు ఏపీ పౌర సమాజం ఆలోచనల్లో పడింది. చంద్రబాబును సమర్థించే ప్రధాన మీడియా, సోషల్ మీడియాలు ప్రధాని నరేంద్ర మోదీ మీద కూడ విమర్శలు మొదలెట్టాయి. కర్ణాటక, తెలంగాణ మోడల్‌లో ఏపీలో అధికార వైసీపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష టీడీపీ పక్షం వహించాలనే ఆలోచనలు పౌరసమాజంలో మొదలయ్యాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి జాతీయ ప్రత్యామ్నాయంగా ఎలాగూ ఉంది. చంద్రబాబు ఇండియా కూటమికి దగ్గర కావచ్చనే ఊహాగానాలు కూడా చెలరేగాయి. పౌరసమాజానికి అలా ఒక సమర్థన దొరికింది.

అయితే, చంద్రబాబు నేరుగా బీజేపీతో ఎన్నికల పొత్తు కుదుర్చుకోవడంతో సన్నివేశం మళ్ళీ మారిపోయింది. మోదీజీ ఎన్నికల ప్రచారంలో ముస్లింల మీద విపరీతమైన ద్వేషాన్ని వెళ్ళగక్కారు. 'ఎక్కువ మంది పిల్లల్ని కనేవారు' వంటి వాఖ్యలు మొదలుపెట్టి 'టోపీవాలే, 'చొరబాటుదార్లు' (ఘుస్ పైఠియే), 'మదరసా', 'ముల్లా', 'మాఫియా', 'ముజ్రా' వరకు ఏ పదాన్నీ వదలలేదు. ఈ స్థితిలో, అన్యమనస్కంగానే అయినా సరే, చంద్రబాబును కాదని జగన్‌ను సమర్థించక తప్పదనే ప్రతిపాదనను ముస్లిం సమాజంలోని కొందరు ముందుకు తెచ్చారు.

విదేయులను తప్ప ముస్లిం సమాజంలో కొంచెం గౌరవమర్యాదలు వ్యక్తిత్వం ఉన్న వారెవర్నీ జగన్ గుర్తించలేదు. పైగా, వై.యస్. రాజశేఖర రెడ్డి ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లను కొనసాగించడం తప్ప కొత్తగా ముస్లింల శ్రేయస్సు కోసం చేసిందేమీ లేదు. జగన్ మీద అసంతృప్తితో ఉన్న ముస్లిం సమాజం ఏపీ ముస్లిం ప్రముఖులు ఇచ్చిన ప్రకటనను పట్టించుకోలేదు. మరోవైపు, బీజేపీతో జతకట్టినా సరే ముస్లింల ప్రయోజనాలనూ కాపాడుతానని చంద్రబాబు ఇచ్చిన హామీ ఆ సమాజం మీద బాగా పనిచేసింది. వాళ్ళు సహితం అటు మొగ్గారు. సునామీ వచ్చినపుడు ఏదీ ఆగదు. ప్రస్తుత ఏపీ ఎన్నికలు సునామీని మించిపోయాయి.



> అవకాశాలు ఉన్నోళ్ళు అవకాశాలు లేనోళ్ళు కలిసి ఉండే సమాజాల్లో అవకాశాలు లేనోళ్ల మీద ప్రభుత్వాలు అదనపు ప్రేమను చూపించాల్సి ఉంటుంది. అవకాశాలు లేనోళ్ళను ఆదుకోవడానికి 'సానుకూల వివక్ష' (Positive Discrimination) ను పాటించడం అవసరం. జగన్ ఓటమి కారణంగా భవిష్యత్తులో 'సానుకూల వివక్ష' అనే విధానం మానిపోకూడదు. ఎలాగూ చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో మరిన్ని సంక్షేపథకాలు ప్రకటించారు. సంక్షేమం కొనసాగుతుంది. కొనసాగాలి కూడా.

• డానీ
సమాజ విశ్లేషకులు

జన ఝంఝూ ప్రభంజనం ధాటికి కొట్టుకెళ్లిన 'జగ'జ్జనులు

ఎన్నికలు జరిగిన మే 13 సాయంత్రం వరకు జగన్మోహన్‌రెడ్డి ఏదో ఒకటి చేసి తమని విజయ తీరాలకు చేరుస్తాడనే ఆశ వైసీపీ శ్రేణుల్లోనూ, ఏదో చేస్తాడనే భయం టీడీపీ శ్రేణుల్లోనూ కొట్టొచ్చినట్టు కనిపించింది. ఎన్నికల రోజు జనం తిరగబడిన తీరు, సప్తసముద్రాలు దాటి ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన యువతని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రకరకాల వ్యయప్రయాసలకు ఓర్చుకొని ఓటు కోసం పోటెత్తిన యువతని చూసిన తరువాత వైసీపీ కంచుకోటలు బద్దలవుతాయని అర్థమయినా, జూన్ 4 సాయంత్రం వరకూ వారిని ఆశ, వీరికి భయమూ వీడలేదు.

మే 8వ తేదీ కోర్టు నుంచి ఇంటికి వెడుతుంటే గుంటూరు ఏసీ కాలేజీ దగ్గర ట్రాఫిక్ జామ్ అయింది. విచారిస్తే గుంటూరు తూర్పు నియోజకవర్గం పోస్టల్ బాలెట్ ఓటింగ్ జరుగుతోందని చెప్పారు. మరికొంత దూరం వెళ్లిన తరువాత ప్రభుత్వ మహిళా కాలేజీ దగ్గర ఓటింగ్ జరుగుతోంది. ఏసీ కారులో కూడా కూర్చోలేని ఎండ తీవ్రత ఉంది. ఆ స్థితిలో కూడా ఉపాధ్యాయులు, ఉద్యోగులూ, ఆడామగా అందరూ బారులు తీరి గంటలు గంటలు క్యూలో నిల్చొని ఉన్నారు. చాలా మంది వైసీపీ వాళ్లిచ్చే డబ్బులు కూడా తిరస్కరించారని తెలిసింది. వీటన్నింటితో పాటు పోలింగ్ రోజు ఓటర్ల ఉత్సాహం చూసిన తరువాత ఒక విషయం స్పష్టంగా అర్థమయింది. అడికె గారు చెప్పినట్టు ఇక్కడ వ్యక్తులు, మేనిఫెస్టోలు, ఎజెండాలు, ఎజెండాలు అన్నీ ద్వితీయ ప్రాముఖ్యత కలిగినవే. ప్రజల దృష్టిలో ఉంది ఒకటే. అది జగన్‌ని కొనసాగించాలా? ఇంటికి పంపాలా? అనేదే. ఆ నిర్ణయం జరిగిందనే స్పష్టం అవుతోంది.

జూన్ 4 దగ్గర పడేకొద్దీ అన్నిచోట్లా పందెం రాయుళ్ల హవా తగ్గుముఖం పట్టింది. కోట్లు చేతులు మారే విజయవాడ లాంటి చోట్ల వైసీపీ తరపున పందెం కాసే వాళ్ళు కరువై ఆ ఊరి టీడీపీ తరపు పందెం రాయుళ్ళు పక్క జిల్లాల బాట పట్టారు. అక్కడ కూడా రెండు రెట్లు, మూడు రెట్లు అన్నారట. ఇంతలో జూన్ 1న ఎగ్జిట్‌పోల్ ఫలితాలు విడుదలయ్యాయి. ఏపీకి సంబంధించి నలభై సంస్థలు తమ సర్వే ఫలితాలు వెల్లడించగా అందులో 35 సంస్థలు టీడీపీ కూటమికి, కేవలం 5 సంస్థలు వైసీపీకి అనుకూలంగా తమ ఫలితాలని వెల్లడించాయి. అందులోనూ ఒకటి తప్ప మిగిలినవి పేరూ ఊరూ లేని పెయిడ్ కంపెనీలు. హిందువులు చనిపోయినప్పుడు మధ్యమధ్యలో శవాన్ని దించి శవం చెవిలో 'నారాయణ, నారాయణ' అంటారు. వైసీపీ వాళ్లు ఈ ఆశా అవకాశం కూడా వదులుకోకుండా చిన్నాచితక సంస్థలని, వ్యక్తులని మేనేజ్ చేసుకుని తమ కార్యకర్తలలో కౌంటింగ్ వరకు ఆశ కొనసాగేలా ప్రయత్నించిందనిపిస్తుంది.

ఇక మంగళవారం టీవీ చానల్స్ అన్నీ టీడీపీ కూటమి ఎగురవేసే జయకేతనాన్ని చూపిస్తుంటే ఫలితాలు చూస్తున్న జనం కొడాలి నాని, వల్లభనేని వంశీ, రోజా లాంటి వ్యక్తుల పరాజయ వార్తల సమయంలో కేరింతలు కొట్టడం చూస్తే సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, తెన్నేటి, గౌతు లచ్చన్న, ప్రకాశం లాంటి ఉన్నత వ్యక్తులు తారాడిన సభలో ఇలాంటి లేకి మనుషుల ప్రవర్తనని ప్రజలెంత అసహ్యించుకున్నారో అర్థమయింది.

ఉద్యమ నేపథ్యాలు, సుదీర్ఘ రాజకీయ చరిత్ర, శ్రమ లేకుండా కేవలం ఒక వ్యక్తి కొడుకనే ఒకే ఒక కారణంగా లభించిన అయాచిత పదవి, ప్రజల మద్దతు.. తన అహంభావంతో తెలివి తక్కువ తనంతో, కక్షసాధింపు ధోరణితో ఎలా కోల్పోతామో జగన్ రెడ్డి నిరూపించాడు. పక్క రాష్ట్రంలో తన స్నేహితుడి పతనంతో తనకు ఎదురయిన ముందస్తు హెచ్చరికల్ని కూడా ఖాతరు చేయని మూర్ఖత్వం మూర్తీభవించిన వ్యక్తిగా జగన్ మిగిలాడు. ఇది ఒకరకంగా ఏపీ ప్రజల అదృష్టమే. తనని మరోసారి గెలిపిస్తే రాష్ట్రం ఎంత నాశనం అవుతుందో పూర్తి స్థాయి సినిమా చూపించి ప్రజల్ని ఎలర్ట్ చేసినందుకు జగన్‌రెడ్డికి కూడా ఏపీ ప్రజలు కృతజ్ఞత చెప్పాలి.

ఏపీ వరకు ఆలోచిస్తే అధికార పార్టీల జయాపజయాలు ఎలా ఉన్నా, నిజంగా ఓడిపోయింది మా వామపక్ష సోదరులే. ప్రభుత్వ పక్షం కంటే ఒక సీటు అధిక్యతతో ఉన్న కమ్యూనిస్టుల ఒకనాటి వైభవం ముచ్చటగా మూడవసారి కూడా వారికి ప్రవేశం లేకుండానే ఆంధ్రప్రదేశ్ శాసనసభ కొలువుతీరబోతోంది. పార్టీ పార్లమెంటరీ ప్రజాపంథా స్వీకరించిన నాటి నుంచి అవసరమైన కీలక సందర్భాల ఎత్తుగడల వైఫల్యాలే ఉన్నాయి. 1955 మధ్యంతర ఎన్నికల్లో ఇతర పార్టీల్ని కలుపుకోవడానికి ఇష్టపడకపోవడం, 1983లో 60 సీట్లు ఇస్తానని ఎన్.టి రామారావు చేసిన ఆఫర్‌ని తిరస్కరించడం ఇందుకు ప్రధాన ఉదాహరణలు.

ఈ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో వైసీపీని వ్యతిరేకించమని, సాగనంపమని పిలుపునిచ్చిన వామపక్షాలు, రాష్ట్రంలో వారి పిలుపునకు అనుగుణమైన ప్రత్యామ్నాయం చూపడంలో విఫలమయ్యాయి. చివరకు ఒకరికి 10, మరొకరికి 8 శాసనసభ స్థానాలు, చెరో ఒక పార్లమెంటు స్థానం కోసం షర్మిల దగ్గర దేబిరించి, ఆమె కూడా కాదంటే ఢిల్లీ స్థాయిలో పైరవీ చేసి తెచ్చుకునే స్థాయికి వారి పరపతి పడిపోయింది. పోనీ ఈ స్థానాల్లోనైనా ఓటమి గౌరవప్రదంగా ఉందా? లేదు. ఎక్కడా ధరావతు దక్కలేదు. అభ్యర్థిత్వం ఆదాయ వనరుగా మారినప్పుడు ఇంతకన్నా మెరుగైన ఫలితాలు ఆశించడం పొరపాటే. మోదీతో కలిశాడని చంద్రబాబుని ఆడిపోసుకునే ముందు.. కేంద్రంతో కలవకపోతే రాష్ట్రంలో నిలబడే పరిస్థితి, ప్రజలు పోలింగ్ బూత్‌ల్లోకి వెళ్లే పరిస్థితి ఉందా? ఆలోచించాలి కదా! ప్రజలు కోరుకుంటున్నట్లు చంద్రబాబు విజయానికి సహకరించి ఎన్నికల తర్వాత ఆయన సహకారం అవసరమైతే ఇండియా కూటమికి జతచేసేట్లుగా ప్రయత్నించవచ్చు కదా! ఎన్నికల ఎత్తుగడలంటే ఇవే కదా! చంద్రబాబు–జగన్ ఇద్దరూ అవసరమైనప్పుడు మోదీని సమర్థించేవాళ్లే అనుకున్నప్పుడు.. మోదీని వ్యతిరేకించిన చరిత్ర చంద్రబాబుకు ఉంది కానీ, జగన్‌కి లేదు కదా!

1985లో ఒకవైపు బీజేపీతో, మరోవైపు కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకుని ఎన్‌టీఆర్ ఎన్నికల్లో దూకినప్పుడు ఆయనతో జత కట్టారుకదా! కమ్యూనిస్టు మహారథులైన సుందరయ్య, రాజేశ్వరరావు, బసవపున్నయ్యల ఆధ్వర్యంలోనే అది జరిగింది కదా! కాంగ్రెస్‌ను మహారాక్షసిగా కమ్యూనిస్టులు భావించే రోజుల్లో ఆ పెద్దరాక్షసికి వ్యతిరేకంగా భారతీయ క్రాంతిదళ్ (బీకేడీ చరణ్‌సింగ్ పార్టీ), స్వతంత్ర (ఎన్‌జి రంగా పార్టీ) లాంటి పచ్చి మితవాద పార్టీలతో జత కట్టలేదా? యూపీ, బీహార్ లాంటి కమ్యూనిస్టుల ఐక్య సంఘటనలో అనాటి జనసంఘం కూడా భాగస్వాములే కదా! ఇప్పుడు కూడా దేశమంతా ఒకరకంగా, కేరళలో మరో రకంగా పోటీపడడం లేదా? మరి ఏపీలో కూడా మరోరకమైన ఎత్తుగడ ఎందుకు అనుసరించలేదు?

మన కమ్యూనిస్టు కంచుకోటలు బద్దలు కాకుండా మన 'రెడ్ విలేజెస్' డెడ్ విలేజెస్‌గా మారకపోయి ఉంటే ఒకనాటి మన ఓటర్లు మనకు మిగిలివుంటే వైసీపీని ఓడించాలనే మన పిలుపుని మనమే తుంగలో తొక్కి ఆ పార్టీ గెలుపునకు పరోక్షంగా దోహదపడేవాళ్లం కాదా! పెద్ద దొంగా? చిన్న దొంగా? అనే మీమాంసలో మన ఎంపిక చిన్న దొంగ వైపే ఉండాలనే మన గత సూత్రీకరణకు ఈనాటి మన ఆచరణ వ్యతిరేకం కాదా?

వామపక్ష శ్రేణులు ముఖ్యంగా సీపీఎం గాని, ఆ పార్టీకి చెందిన కొందరు మేధావులు గాని ఇద్దరు దొంగలపై పెట్టే విమర్శల్లో పెద్ద దొంగ పట్ల విమర్శల స్థాయి తక్కువ చేసి తమ విశ్వసనీయతను పోగొట్టుకుంటున్నారు. ఇది రాష్ట్ర భవిష్యత్ రాజకీయాలకు హానికరం. మనం శాసనసభలో ఉన్నా, లేకపోయినా ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతే ప్రమాదం. ఎమర్జెన్సీని సమర్థించిన పాపాన్ని సీపీఐ ఈనాటికీ కడుక్కోలేకపోతోంది. పరోక్షంగా వైసీపీకి సహాయపడే అలాంటి తప్పే సీపీఎం చేస్తోంది.

విప్లవోద్యమాన్ని ఎలాగూ నిర్మించలేం. కనీసం పార్టీని పార్లమెంటరీ పంథాలోనైనా సరైన ఎత్తుగడలతో నడిపి మరో ఐదేళ్ల తర్వాతయినా తెలుగు శాసనసభలో ప్రవేశించే మార్గం చూడండి.

> పక్క రాష్ట్రంలో తన స్నేహితుడి పతనంతో తనకు ఎదురయిన ముందస్తు హెచ్చరికల్ని కూడా ఖాతరు చేయని మూర్ఖత్వం మూర్తీభవించిన వ్యక్తిగా జగన్ మిగిలాడు. ఇది ఒకరకంగా ఏపీ ప్రజల అదృష్టమే. తనని మరోసారి గెలిపిస్తే రాష్ట్రం ఎంత నాశనం అవుతుందో పూర్తి స్థాయి సినిమా చూపించి ప్రజల్ని ఎలర్ట్ చేసినందుకు జగన్‌రెడ్డికి కూడా ఏపీ ప్రజలు కృతజ్ఞత చెప్పాలి.



■ చెరుకూరి సత్యనారాయణ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



విధ్వంస పాలనకు ఓటర్లు 'రికార్డు' స్థాయిలో ముగింపు పలికారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో అత్యధిక నియోజకవర్గాల్లో మెజారిటీల మోత మోగించారు. నియోజకవర్గాల ఆవిర్భావ చరిత్రలోనే లేని సంచలన విజయాలు అందించారు. ఇటువంటివాటిలో గుడివాడ ముందు వరుసలో ఉంది. గన్నవరంలోనూ ఎన్నడూలేని అధిక్యత యార్లగడ్డకు దక్కింది. పెనమలూరు, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ ఇలా ఒకటేమిటి 14 నియోజవకర్గాల్లోనూ ఓటర్లు కసిదీరా తమ ఓట్లతో కూటమి అభ్యర్థులను గెలిపించి ఫ్యాన్ రెక్కలు విరిచారు. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)



ఓట్ల సునామీ!





రికార్డు స్థాయిలో కూటమి అభ్యర్థుల మెజార్టీలు

- అత్యధిక నియోజకవర్గాల్లో పాత రికార్డులు బద్దలు
- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో విజయవాడ సెంట్రల్ టాప్
- 68,886 ఓట్ల ఆధిక్యంతో రాష్ట్రంలో 11వ స్థానంలో బొండా ఉమ

ఎన్టీఆర్ జిల్లాలో 57.90 శాతం..

కృష్ణాలో 60.41 శాతం ఓటర్లు కూటమి వైపే



రికార్డు గెలుపులివిగో..

- 1982, 1985ల్లో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు సైతం రాని మెజారిటీ గుడివాడలో ఈసారి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాముకు వచ్చింది. రాముకు వచ్చిన 53,040 మెజారిటీ నియోజకవర్గ ఆవిర్భావం తర్వాత అత్యధిక మెజారిటీగా రికార్డులకెక్కింది.
- గన్నవరంలో సైతం ఆదే ట్రెండ్ కొనసాగింది. 1955లో నియోజకవర్గ ఆవిర్భావం తర్వాత యార్లగడ్డ వెంకట్రావుదే అత్యధిక మెజారిటీ. ఇక్కడ పుచ్చలపల్లి సుందరయ్య లాంటి హేమాహేమీలు సైతం ఈ రికార్డును సాధించలేకపోయారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థికి అత్యధికంగా 21,202 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఆ తర్వాత ఏ అభ్యర్థికి 20వేలు మెజారిటీ దాటింది లేదు. గత రెండు ఎన్నికలను పరిశీలిస్తే 2014లో శ్రీరాం తాతయ్యకు 1846 ఓట్ల మెజారిటీ రాగా 2019లో సామినేని ఉదయభానుకు 4778 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఈసారి టీడీపీ అభ్యర్థి తాతయ్యకు 15977 ఓట్ల ఆధిక్యం లభించింది.
- నందిగామ నియోజకవర్గ చరిత్రలో 1999లో దేవినేని ఉమా అత్యధికంగా 23,511 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2014లో అప్పటి సిటింగ్ ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకర్‌రావు మృతితో 2014లో ఉప ఎన్నిక జరగ్గా ఆ ఎన్నికల్లో ఆయన కుమార్తె తంగిరాల సౌమ్యకు సానుభూతి వెల్లువెత్తడంతో అత్యధికంగా 74,827 ఓట్లు మెజారిటీ లభించింది. ఆ తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ మెజారిటీ 12వేలకు మించలేదు. ఈసారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సౌమ్య 27,395 ఓట్ల మెజార్టీతో రికార్డు సృష్టించారు.
- తిరువూరు నియోజకవర్గ ఆవిర్భావం తర్వాత 2004లో కోనేరు రంగారావుకు అత్యధికంగా 16,700 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఆ రికార్డును టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు 21,874 ఓట్లతో చెరిపివేశారు.
- మైలవరం నియోజకవర్గంలో 1972లో చనుమోలు వెంకట్రావుకు అత్యధికంగా 23,023 మెజారిటీ వచ్చింది. ఈ ఎన్నికల్లో 42,829 ఓట్ల మెజార్టీతో ఆ రికార్డును టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ చెరిపివేశారు.
- విజయవాడ తూర్పు 1967లో ఆవిర్భవించింది. 2004లో వంగవీటి రాధాకృష్ణ అత్యధికంగా 26,711 మెజారిటీ సాధించారు. ఈసారి గద్దె రామ్మోహన్ 49,640 ఓట్ల ఆధిక్యంతో దాన్ని తిరగరాశారు.
- విజయవాడ పశ్చిమ 1967లో ఆవిర్భవించగా 2004లో షేక్ నాసర్‌వలీ (సీపీఐ)కి 26,519 ఓట్ల ఆధిక్యం లభించింది. ఇప్పటి వరకు ఆదే రికార్డుగా ఉంది. దాన్ని కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా నిలిచిన సుజనా చౌదరి 47,032 ఓట్ల ఆధిక్యంతో చెరిపివేశారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ ఒకే ఒక్కసారి గెలిచింది. అలాంటి నియోజకవర్గంలో టీడీపీతో జతకట్టి బీజేపీ అభ్యర్థి అనూహ్య విజయాన్ని సాధించారు.
- విజయవాడ సెంట్రల్‌లో 2009లో ఆవిర్భవించింది. 2014 బొండా ఉమామహేశ్వరావు 27,161 ఓట్ల ఆధిక్యం సాధించగా అదే అత్యధికంగా ఉంది. దాన్ని ఆయనే ఈ ఎన్నికల్లో తిరగరాశారు. 68,886 ఓట్లు సాధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలో రికార్డు నెలకొల్పారు. రాష్ట్రస్థాయిలో మెజారిటీల పరంగా 11వ సానంలో నిలిచారు.
- మచిలీపట్నం 1955లో ఆవిర్భవించింది. 2004లో పేర్ని నాని 31,301 ఓట్ల ఆధిక్యంతో గెలవగా అదే నియోజకవర్గ రికార్డుగా ఉంది. దాన్ని టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర 50,242 ఓట్ల ఆధిక్యంతో తిరగరాశారు.
- అవనిగడ్డ నియోజకవర్గ చరిత్రలో గత ఎన్నికల్లో సింహాద్రి రమేశ్‌కు లభించిన 20,725 ఓట్ల ఆధిక్యమే రికార్డుగా ఉంది. దాన్ని సీనియర్ నాయకుడు, జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ తిరగరాశారు. 46,434 ఓట్ల ఆధిక్యంతో అందరినీ ఆశ్చర్యపరిచారు.
- పామర్రు నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం తర్వాత రెండే రెండుసార్లు గెలిచింది. 1983, 1999లో తప్ప టీడీపీకి ఆ నియోజకవర్గం కొరకరాని కొయ్యగా ఉంది. అలాంటి నియోజకవర్గంలో ఈసారి టీడీపీ 29,690 ఓట్ల ఆధిక్యంతో గెలుపు జెండా ఎగురవేసింది.
- పెనమలూరు నియోజకవర్గ చరిత్రలో ఈసారి బోడె ప్రసాద్‌కు లభించిన 59,915 ఓట్ల మెజారిటీయే రికార్డు.

ఐదేళ్ల పాలనతో విసిగిపోయి..

వైసీపీ ఐదేళ్ల పాలనతో రెండు జిల్లాల ప్రజలు విసిగెత్తిపోయారు. మంత్రులుగా చేసిన కొడాలి నాని, పేర్ని నాని, వెలంపల్లి శ్రీనివాసరావు, జోగి రమేశ్ వంటి వారు అభివృద్ధిని గాలికొదిలేసి.. ప్రతిపక్షనేతలను తిట్టే పనిలోనే నిమగ్నమవ్వడం ఓటర్లకు రుచించలేదు. అభివృద్ధి సంగతి దేవుడెరుగు ఎక్కడికక్కడ దోపిడీ, విధ్వంసాలు.. కక్షసాధింపు రాజకీయాలతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. గన్నవరం ఎమ్మెల్యే వంశీ, మంత్రిగా ఉన్న జోగి రమేశ్, మాజీ మంత్రులు కొడాలి నాని, ఎమ్మెల్యేలు సింహాద్రి రమేశ్ వంటి వారు ఎక్కడ మట్టి కనిపిస్తే అక్కడ దోపిడీకి తెరదీశారు. ఇసుకను కొల్లగొట్టారు. రూ.కోట్లు ఆర్జించారు. ఇది సరిపోదన్నట్టు ప్రజల ఆస్తులను కబ్జా చేయడానికీ వెనుదీయలేదు. కొడాలి నాని మరో అడుగు ముందుకు వేసి పేకాట క్లబ్బులు, కేసినోలతో ప్రజలను దోచుకున్నారు. ఆయన ఆగడాలు తట్టుకోలేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మచిలీపట్నంలో పేర్ని నాని, ఆయన తనయుడు కిట్టు చేసిన ఆగడాలు అన్నీఇన్నీ కావు. తమకు అడ్డుచెప్పిన వారికి కేసులు పెట్టి వేధించుకుతిన్నారు. విజయవాడ నగరంలో వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు వంటి వారు చేసిన ఆగడాలతో విసుగెత్తిన ప్రజలు ఓటుతో వారికి బుద్ధి చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు జిల్లాల్లో అధికార పార్టీ అభ్యర్థులు తుడుచుపెట్టుకోవడం ఒక ఎత్తు అయితే ప్రత్యర్థులకు రికార్డు స్థాయి మెజారిటీలు రావడం మరో ఎత్తు. ప్రజల్లో గూడుకట్టుకున్న కసి ఓట్ల సునామీ రూపంలో పోటెత్తడంతో అధికార పార్టీ ఆనవాళ్లు లేకుండా పోయింది.

60 శాతం ఓటర్లు కూటమి వైపే

ఎన్టీఆర్ జిల్లాలో పోస్టల్ బ్యాలెట్లతో కలిపి 13,69,985 ఓట్లు పోలవ్వగా కూటమి అభ్యర్థులకు 7,93,281 ఓట్లు పోలయ్యాయి. అంటే 57.90 శాతం ఓటర్లు కూటమి వైపు మొగ్గు చూపారు. కృష్ణా జిల్లాలో 13,15,074 ఓట్లు పోలవ్వగా కూటమి అభ్యర్థులకు 7,94,531 ఓట్లు పోలయ్యాయి. అంటే 60.41 శాతం ఓటర్లు కూటమికే జై కొట్టారు.

కూటమికి 58.63%



ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పోలైన ఓట్లు 13,52,964

- అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కూటమికి పడినవి 7,93,281
- విజయవాడ సెంట్రల్‌లో బొండా ఉమాకు అత్యధికంగా 64.16 శాతం ఓట్లు
- విజయవాడ వెస్ట్‌లో సుజనాకు రెండో అత్యధికం 62.11 శాతం
- ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నికి 58.69 శాతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సార్వత్రిక ఎన్నికల్లో స్వీప్‌తో విజయదుందుభి మోగించిన కూటమికి ఎన్టీఆర్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 58.63 శాతం ఓట్లు లభించాయి. జిల్లాలో బరిలో నిలిచిన ఏడుగురు అభ్యర్థులు భారీగా మెజారిటీని సాధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం ఓటు శాతం గణాంకాలను విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కనుక చూస్తే మొత్తంగా 13,52,964 ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో కూటమి అభ్యర్థులు ఏకంగా 7,93,281 ఓట్లను సాధించారు. పోలైన ఓట్లలో 58.63 శాతం మేర కూటమి అభ్యర్థులకే ఓట్లు పడ్డాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరు నియోజకవర్గంలో 1,81,669 ఓట్లు పోల్ కాగా టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావుకు 1,00,719 ఓట్లు వచ్చాయి. ఈ లెక్కన చూస్తే కొలికపూడికి 55.44 శాతం మేర ఓట్లు పడ్డాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 1,70,112 ఓట్లు పోల్ కాగా బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరికి 1,05,669 ఓట్లు పడ్డాయి. అంటే 62.11 శాతం ఓట్లు పడ్డాయన్నమాట. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 2,02,662 ఓట్లు పోల్‌కాగా టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావుకు 1,30,034 ఓట్లు పడ్డాయి. 64.16 శాతం ఓట్లు వచ్చినట్టు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 1,93,031 ఓట్లు పోల్‌కాగా టీడీపీ అభ్యర్థి గద్దె రామమోహన్‌కు 1,18,841 ఓట్లు పడ్డాయి. గద్దెకు 61.56 శాతం ఓట్లు పడ్డాయి. మైలవరం నియోజకవర్గంలో 2,40,965 ఓట్లు పోల్ అయ్యాయి. టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్‌కు 1,37,338 ఓట్లు పడ్డాయి. వసంతకు 57 శాతం మేర ఓట్లు పోలయ్యాయి. నందిగామ నియోజకవర్గంలో 1,79,914 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యకు 1,02,201 ఓట్లు వచ్చాయి. సౌమ్యకు 56.80 శాతం ఓట్లు పడ్డాయి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 1,84,611 ఓట్లు పోల్ కాగా టీడీపీ అభ్యర్థి శ్రీరామ్ తాతయ్యకు 98,479 ఓట్లు పోలయ్యాయి. తాతయ్యకు 53.34 శాతం ఓట్లు పడ్డాయి.

పార్లమెంట్ నియోజకవర్గంలో

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 13,52,964 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)కు 7,94,154 ఓట్లు పడ్డాయి. అంటే చిన్నికి 58.69 శాతం ఓట్లు పడినట్టు లెక్క.

ఎవరు గెలిచినా.. మీదే గెలుపు

విజేతల ఎంపిక

- 6లో..



కూపన్లు డ్రా తీస్తున్న బ్రాంచ్ మేనేజర్ వేమూరి మురళి

ఉండేదెవరో..? మారేదెవరో..?



వైసీపీకి అనుకూలంగా పనిచేసిన అధికారులకు స్థానచలనం ఖాయం

- బదిలీల కోసం ఇప్పటి నుంచే అధికారుల ప్రయత్నం
- త్వరలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ విభాగంలో భారీ మార్పులుండే అవకాశం

ఏకపక్షంగా వచ్చిన ఎన్నికల ఫలితాలు అధికారులు సైతం కంగుతిన్నారు. ఈనెల 9న నూతన ప్రభుత్వం కొలువుదీరనుండటంతో స్థానచలనం తప్పదని అధికారులు ఆలోచనలో పడ్డారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిలో అన్ని విభాగాల్లో అధికారుల మార్పులు, చేర్పులు ఉంటాయనే చర్చ నడుస్తోంది. గత ఐదేళ్లుగా వైసీపీ నాయకుల ఒత్తిడికి లొంగి టీడీపీ, జనసేన నాయకులపై తప్పుడు కేసులు బనాయించి ఇక్కట్లుపాలు చేసిన పోలీస్ అధికారులపైనా ఈ ప్రభావం పడుతుందనే వాదన వినపడుతోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గెలిచిన టీడీపీ, జనసేన అభ్యర్థులను ఆయా పార్టీల నేతలు మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. వివిధ విభాగాల అధికారుల పనితీరుపై తమదైన శైలిలో వివరిస్తున్నారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన రాజాబాబు ఎన్నికల సమయంలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆయనను కేంద్ర ఎన్నికల కమిషన్ ఉన్నపళంగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుత కలెక్టర్ డీకే బాలాజీ వచ్చారు. పరిపాలన సౌలభ్యం కోసం నూతన ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో భాగంగా జిల్లాస్థాయి అధికారుల బదిలీలు పెద్దఎత్తున ఉంటాయని జిల్లాస్థాయి అధికారుల్లో చర్చ జరుగుతోంది. వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యేలు, వారి అనుచరుల సూచనల మేరకు అడ్డగోలు పనులు చేసిన అధికారులను జిల్లా నుంచి సాగనంపుతారనే ప్రచారం మొదలైంది. ఫలానా అధికారిని జిల్లా నుంచి బయటకు పంపాలని ఎమ్మెల్యేలను కలుసుకున్న సమయంలో టీడీపీ, జనసేన నాయకులు చెప్పకనే చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాస్థాయి అధికారుల పనితీరు, వ్యవహారశైలిని వివరిస్తూ ప్రజలకు మేలు జరగాలంటే మనకు అనుకూలంగా ఉండే అధికారులను తీసుకురావాలని సిఫార్సులు కూడా చేస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకుల సూచనలు విన్న ఎమ్మెల్యేలు కొంతకాలం ఓపికపడితే అన్నీ సర్దుకుంటాయని వేచి ఉండాలని చెబుతున్నారు. కౌంటింగ్ జరిగే సమయంలో కృష్ణా యూనివర్సిటీ వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు కూటమి ప్రభుత్వం వచ్చింది కాబట్టి, ఏ ప్రాంతానికి వెళతావని చర్చించుకోవడం కనిపించింది. రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర విభాగాల్లో కొద్ది రోజుల్లో పెద్దఎత్తున అధికారులు బదిలీలు ఉంటాయని అధికారులు చెప్పుకుంటున్నారు. జిల్లాస్థాయిలో డీఆర్‌డీఏ పీడీ, జిల్లా పరిషత్ సీఈవో, హౌసింగ్ పీడీ పోస్టుల్లో ఇన్‌చార్జి అధికారులు కొనసాగుతున్నారు. దీంతోపాటు సాంఘిక సంక్షేమశాఖ, బీసీ సంక్షేమశాఖల అధికారులు మారిపోతారని కలెక్టరేట్ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

యూనివర్సిటీ అధికారులపై ఫిర్యాదులు

కృష్ణా యూనివర్సిటీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పరిపాలనా వ్యవహారాల్లో తమ చిత్తానుసారంగా వ్యవహరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరి అక్రమాలకు కళ్లెం వేసేందుకు కొందరు ప్రొఫెసర్లు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికలకు ముందే 70 మందికిపైగా అధ్యాపకులు, సిబ్బంది కొల్లును కలిసి అక్రమాలను వివరించారు.

తహసీల్దార్, ఎంపీడీవో పోస్టుల కోసం పోటాపోటీ

ఎన్నికల షెడ్యూలు విడుదల కాకముందే జిల్లాలోని 25 మండలాల తహసీల్దార్, ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఈ నెలాఖరు నాటికి ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు మళ్లీ జిల్లాకు రానున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు గెలవడంతో తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తుల ద్వారా మండలస్థాయి అధికారులు తాము కోరుకున్న మండలాల్లో పోస్టింగ్ వేయించుకునేందుకు ఇప్పటి నుంచే తెరవెనుక మంతనాలు జరుపుతున్నారు. టీడీపీ, జనసేన నాయకులను కలుసుకుని కోరుకున్న మండలాలకు వచ్చేందుకు తమవంతుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఉయ్యూరు, మచిలీపట్నం, గుడివాడ డివిజన్‌లలోని కీలక మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవోల పోస్టులను పొందేందుకు అధికారులు పోటీ పడుతున్నారు. గుడివాడ డివిజన్ పరిధిలోని బాపులపాడు మండలం తహసీల్దార్ పోస్టులో ఎవ్వరినీ నియమించకుండా అక్కడి ఆర్డీవో, గన్నవరం ఎమ్మెల్యే రెండేళ్లుగా తెరవెనుక చక్రం తిప్పారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎవరైనా తహసీల్దార్‌గా వచ్చినా వారితో బలవంతంగా సెలవు పెట్టించారు. పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాల పరిధిలోని ఇసుక అక్రమాలకు పాల్పడ్డారు. ఇందుకుగాను రోజువారీగా రెవెన్యూ అధికారులు లక్షల్లో ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


గురితప్పిన గులకరాయి

పనిచేయని కోడికత్తి 2.0 డ్రామా

వైసీపీ గులకరాయి గురి తప్పింది. కోడికత్తి 2.0గా ఓట్లు కురిపిస్తుందనుకున్న డ్రామా కాస్తా రివర్స్ అయ్యింది. డ్రామా జరిగిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోనే టీడీపీ అభ్యర్థి బొండా ఉమా 61,148 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ కేసులో మొదట వడ్డెర కాలనీలోని అన్యం పుణ్యం తెలియని వారిని కేసులో ఇరికించారన్న విమర్శలు వచ్చాయి. తర్వాత ఓ టీడీపీ నాయకుని అదుపులోకి తీసుకొని అక్కడి టీడీపీ అభ్యర్థి బొండా ఉమను అరెస్టు చేయాలని హడావిడి చేశారు. ఎట్టకేలకు టీడీపీ నేతలను వదిలి సతీష్ అనే యువకుని అరెస్టుచేసి నెల్లూరు జైలుకు పంపారు. నెల్లూరు జైలులో సుమారు నెల రోజులకుపైగా రిమాండ్‌లో ఉన్న సతీష్ బెయిల్‌పై విడుదలైన మరుసటిరోజు జరిగిన ఓట్ల లెక్కింపులో గులకరాయి ఎలా గురితప్పిందో ఓటర్లు విస్పష్టమైన తీర్పునిచ్చారు.

- సెంట్రల్‌లో చిత్తయిన వైసీపీ ఎత్తులు
- టీడీపీ కార్యకర్తలే టార్గెట్‌గా వేధింపులు
- అయినా రికార్డు బద్దలు కొట్టిన టీడీపీ
- ఉమ్మడి కృష్ణాలో టాప్ మెజార్టీ





మధురానగర్ : ఎన్నికల్లో సానుభూతి కోసం వైసీపీ నేతలు ఆడిన డ్రామాల్లో ఒకటి గులకరాయి. సీఎం జగన్ నిర్వహించిన మేమంతా సిద్ధం యాత్రలో ఒక యువకుడు విసిరాడని చెబుతున్న గులకరాయి ముందుగా సీఎం జగన్‌కు తగిలింది. ఆ తర్వాత సెంట్రల్ వైసీపీ అభ్యర్థి వెల్లంపల్లికి తగిలి కింద పడిపోయింది. ఈ ఒక్క డ్రామాతో ఎన్నికల్లో గట్టెక్కేయవచ్చని వైసీపీ నేతలు భావించారు. టీడీపీ కార్యకర్తలను టార్గెట్ చేసుకుని వ్యవహారాన్ని నడిపించారు. అయినా ఈ డ్రామాలు ఎన్నికల్లో పనిచేయలేదు. వైసీపీ నేతలు ఆడిన ఆటలు టీడీపీకి సెంట్రల్ నియోజకవర్గంలో భారీ మెజారిటీని తీసుకొచ్చాయి. ఫలితాలు వెలువడుతున్నప్పుడు రాష్ట్రంలో అందరి దృష్టి సెంట్రల్ నియోజకవర్గంపైనే ఉంది. అసలు ఇక్కడ ఏ పార్టీ గెలుస్తుందోనని ఆసక్తిగా ఎదురుచూశారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో సెంట్రల్ నియోజకవర్గంలో రికార్డుస్థాయి మెజారిటీని టీడీపీ సాధించింది. 2014లో మల్లాది విష్ణు చేతిలో అతి స్వల్ప తేడాతో ఓటమి చెందినా బొండా ఉమా ఎక్కడా నిరుత్సాహపడకుండా నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌కు ధైర్యం నూరిపోస్తూ పనిచేశాడు. ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీ అధికార ప్రతినిధిగా నిత్యం జగన్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై తన గొంతుక వినిపించారు. బొండా దెబ్బకు మల్లాది విష్ణు తట్టుకోలేడనే కారణంతో జగన్ పక్క నియోజకవర్గం నుంచి వెలంపల్లిని దింపారు. చివరకు సీఎంపై గులకరాయి దాడితో రాష్ట్రంలో సెంట్రల్ నియోజకవర్గం, బొండా ప్రజల దృష్టిలో పడ్డారు. ఈ కేసులో తనను ఇరికించాలని చూసినా బొండా ధీటుగా ఎదుర్కొని పోరాడారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని చూపిస్తూ, వైసీపీ కుట్రలను నిలదీశాడు. ఎన్నికల్లో ఆయన దూకుడే నియోజకవర్గంలో ప్రతి రౌండ్‌లోనూ వైసీపీ అభ్యర్థి కంటే భారీగా మెజార్టీ రావడానికి కారణమైంది. మొత్తం 17 రౌండ్లలోని ప్రతి రౌండ్‌లో టీడీపీ ఆధిక్యత సాధించింది. ఈవీఎంల ద్వారా 1,28,376 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్‌లో 1658 ఓట్లతో కలిపి మొత్తం 1,30,034 (63.52 శాతం) ఓట్లతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. ఈవీఎంల ద్వారా 60,274 ఓట్లు, పోస్టల బ్యాలెట్‌ల ద్వారా 874 కలిపి మొత్తం 61,148 (29.87 శాతం) ఓట్లతో వెలంపల్లి శ్రీనివాస్ పోటీకి దరిదాపుల్లో లేకుండా పోయారు. 69,257 మెజార్టీతో బొండా ఉమా కొత్త రికార్డు నెలకొల్పారు.



చంద్రబాబు, నారా లోకేశ్‌లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కేశినేని చిన్ని, బొండా ఉమా

చంద్రబాబు ఇంటికి నేతల క్యూ..

» అధినేతను కలిసిన కేశినేని చిన్ని, గద్దె తదితరులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో క్లీన్‌స్వీప్ చేసిన కూటమి అభ్యర్థులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. టీడీపీ నుంచి గెలుపొందిన విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ ఎమ్మెల్యేలుగా గెలుపొందిన బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావు, కొల్లు రవీంద్ర, కాగిత కృష్ణ ప్రసాద్, బోడె ప్రసాద్, తదితరులు బుధవారం పార్టీ అధినేత చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మెజారిటీల పరంగా రికార్డులను తిరగరాసిన నాయకులను చంద్రబాబు అభినందించారు.

వన్‌టౌన్ : ఏపీ సీఎంగా ఎన్నికైన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో బుధవారం 2.82లక్షల భారీ మెజారిటీతో విజయవాడ ఎంపీగా విజయం సాధించిన కేశినేని శివనాథ్(చిన్ని) కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన బొండా ఉమామహేశ్వరరావు చంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబునాయుడు వారికి అభినందనలు తెలిపారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌ను శివనాథ్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కేశినేని శివనాథ్, బొండా ఉమామహేశ్వరరావు, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి రామ్‌లు కలిసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన రవీంద్ర, బచ్చుల బోసుబాబు



మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నుంచి భారీ మెజారిటీతో గెలుపొందిన మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబును ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న చంద్రబాబుకు కొల్లు రవీంద్ర, గొర్రెపాటి గోపీచంద్, బచ్చుల బోసుబాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పెడన రూరల్ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ తదితరులు ఉండవల్లిలో కలిసి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ అర్జా నగేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ వంశీ, రామన్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు యార్లగడ్డ శుభాకాంక్షలు



హనుమాన్‌జంక్షన్, జూన్ 5 : గన్నవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా 37,628 ఓట్ల ఆధిక్యతతో ఘన విజయం సాధించిన యార్లగడ్డ వెంకట్రావుకు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం పెద్ద సంఖ్యలో యార్లగడ్డకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను యార్లగడ్డ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు



వన్‌టౌన్, జూన్ 5 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. ఎన్నికలలో జనసేన తరపున పోటీ చేసి అనకాపల్లి ఎంపీగా గెలిచిన కొణతాల రామకృష్ణ, జనసేన తరపున పోటీచేసి పాలకొండ ఎమ్మెల్యేగా గెలిచిన నిమ్మకజయకృష్ణ, టీడీపీ తరపున పోటీచేసి దెందులూరు ఎమ్మెల్యేగా పోటీచేసిన చింతమనేని ప్రభాకర్ తదితరులు దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకుల ఆశీస్సులను అందుకుని ప్రసాదాలు స్వీకరించారు.


అభిమానులు, పార్టీశ్రేణులతో వర్ల కుమార్‌రాజా

సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చూస్తా..

» వర్ల కుమార్‌రాజా

పామర్రు, మే 5 : పేద వర్గాల సంక్షేమానికి చంద్రన్న ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్‌లతో పాటు ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానని పామర్రు ఎమ్మెల్యేగా ఎంపికైన వర్లకుమార్‌రాజా హామీ ఇచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వరకుమార్ రాజాను కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. జగన్ పాలనలో ప్రజలు పడ్డ కష్టాలు తీరిపోతాయని చెప్పారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జక్కశ్రీనివాసరావు, మండ పాకశంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంబరాలు

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావటం.. పామర్రు నియోజకవర్గంలో వర్లకుమార్‌రాజా అత్యధిక మెజార్టీ సాధించినందుకు గ్రామాల్లో పార్టీ శ్రేణులు టాపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. భారీ ర్యాలీతో కూమార్‌రాజా పామర్రుకు బుధవారం వేకువజామున 3గంటలకు చేరుకున్నారు. తొలుత ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరుకు చేరుకున్న కూమార్‌రాజా పార్టీ నేతలు ఏర్పాటు చేసిన విజయోత్సవ కేక్‌ను పంచిపెట్టారు. అనంతరం దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సిద్ధం

» ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి

వన్‌టౌన్, జూన్ 5 : ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, ఎన్నికలలో కూటమి విజయం రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడులు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న చంద్రబాబునాయుడుకు, కూటమి ప్రజా ప్రతినిధులకు ఎన్జీవో సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వానికి అనుగుణంగా బాధ్యతలను నిర్వహిస్తారని చెప్పారు. ప్రభుత్వంతో ఉద్యోగులు స్నేహసంబంధాలను పెంపొందిస్తామని తెలిపారు. ప్రభుత్వం మారాలని పెద్ద ఎత్తున ఉద్యోగులు ఓటు వేశారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు నూతనోత్సాహంతో ఉద్యోగులు అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఇబ్బందులను ఎదుర్కొన్నారని, ఒత్తిడికి గురయ్యారని చెప్పారు. బకాయిల చెల్లింపుల్లో చూపిన నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు ఓటు హక్కుద్వారా గుణపాఠం చెప్పారన్నారు. కూటమి గెలుపు ఒకరకంగా ఉద్యోగుల విజయమని వ్యాఖ్యానించారు.

ఎవరు గెలిచినా.. మీదే గెలుపు విజేతల ఎంపిక

» 'ఆంధ్రజ్యోతి' వినూత్న కార్యక్రమానికి అనూహ్య స్పందన

విజయవాడ, జూన్ 5 : అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన వివిధ పార్టీల అభ్యర్థుల్లో విజేత ఎవరు..? అంటూ ఓటరునాడిని తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన వినూత్న కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' అంటూ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వారానికి రెండు కూపన్లను అందించింది. ఇందులో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వేలాదిగా పాఠకులు కూపన్లు పూర్తి చేసి పంపారు. విజయవాడ కార్యాలయానికి చేరిన కూపన్ల నుంచి బుధవారం డ్రా తీసి విజేతలను ఎంపిక చేయడం జరిగింది. మంగళవారం వచ్చిన ఫలితాలకు దగ్గరగా ఉన్నవారిని ఎంపిక చేసి.. జిల్లాలో ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి ముగ్గురికి రూ.5వేల చొప్పున నగదు అందజేయనున్నారు. ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ వేమూరి మురళీ, ఏజీఎం వాసు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్ రామకృష్ణలు డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు.

ప్రథమ విజేత : వారణాసి కామేశ్వరి, 20/342/32/1, వెంకమ్మతోట, చిలకలపూడి, బందరు, కృష్ణా జిల్లా

ద్వితీయ విజేతలు : నెక్కంటి ప్రభాకర్‌రావు, 9-81సీ లోయతోట, నున్న, ఎన్టీఆర్ జిల్లా, వింత కామేశ్వరి, యాదవుల బజారు, తేలప్రోలు, ఉంగుటూరు (మండలం), కృష్ణా జిల్లా, ఎస్.వి.ఎస్.ఎస్.రామ్‌కుమార్, 1-25 1వ రోడ్డు, గరికపర్రు, తోటవల్లూరు మండలం, కృష్ణా జిల్లా

ప్రజలు తిరగబడి తరిమి కొట్టారు

» మచిలీపట్నానికి పరిశ్రమలు తెస్తాం

» పోర్టును అభివృద్ధి చేస్తాం : రవీంద్ర


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 5 : ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనకు విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు ఈ ఎన్నికల్లో తిరుగుబాటు చేసి కూటమి అభ్యర్థులకు అత్యధిక మెజారిటీతో ఘనవిజయాన్ని ఇచ్చారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీలతో కలిసి కొల్లు రవీంద్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయనని, మచిలీపట్నం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. మచిలీపట్నంలో పోర్టు ఆధారిత పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. మంగినపూడి బీచ్‌ను గోవా టూరిజం స్పాట్ చేస్తామన్నారు. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్ యూనిట్‌ను మచిలీపట్నంలో నెలకొల్పుతామన్నారు. మచిలీపట్నం కార్పొరేషన్, తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేస్తామన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ, కొల్లు రవీంద్రకు చంద్రబాబు కేబినెట్‌లో స్థానం దక్కుతుందని, మచిలీపట్నంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవకాశాలు లభిస్తాయన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, అభ్యర్థుల విజయానికి చిత్తశుద్ధితో అందరూ సమన్వయంతో పనిచేశారన్నారు. జనసేన నాయకులు మాదివాడ రాము, గడ్డం రాజు, మోటమర్రి బాబా ప్రసాద్, మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దేరపల్లి అనిత, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, లంకే శేషగిరి, గోపు సత్యనారాయణ, గోకుల శివ, కరెడ్ల సుశీల, కుంచే నాని, వాలిశెట్టి తిరుమలరావు, లంకే హరికృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఓట్లు 'కూటమి'కే ఆధిక్యం

మచిలీపట్నం, జూన్ 5 : ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓట్లను కూటమి అభ్యర్థులకే వేశారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గంలోనూ కూటమి అభ్యర్థులకే ఓట్లు వేసి వైసీపీ ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను చాటారు. పోస్టల్‌బ్యాలెట్‌లకు సంబంధించి పామర్రులో టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజాకు 1336 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి కైలే అనిల్‌కుమార్‌కు 780 ఓట్లు వచ్చాయి. 15 ఓట్లు చెల్లుబాటుకానివిగా నిర్ధారించారు. అవనిగడ్డలో 3,824 పోస్టల్ బ్యాలెట్‌లు ఉండగా, జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌కు 2501 ఓట్లు, వైసీపీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబుకు 884 ఓట్లు వచ్చాయి. 20 తిరస్కరించారు. నోటాకు 19 ఓట్లు వచ్చాయి. పెనమలూరు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లు 3,258 ఉండగా, టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌కు 2155, వైసీపీ అభ్యర్థి జోగి రమేష్‌కు 1035 ఓట్లు వచ్చాయి. నోటాకు 24 ఓట్లు వచ్చాయి. గుడివాడలో పోస్టల్ బ్యాలెట్‌లు 3028 ఉండగా, టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాముకు 2005, వైసీపీ అభ్యర్థి కొడాలి నానికి 965 ఓట్లు వచ్చాయి. నోటాకు 18 ఓట్లు వచ్చాయి. మచిలీపట్నంలో పోస్టల్ బ్యాలెట్‌లు 3981ఉండగా, టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్రకు 2584 ఓట్లు, వైసీపీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తికి 1042ఓట్లు వచ్చాయి. 249ఓట్లను తిరస్కరించారు. 31ఓట్లు నోటాకు పడ్డాయి. పెడన నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లు 1673 ఉండగా, టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌కు 1010ఓట్లు, వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాముకు 507ఓట్లు వచ్చాయి. 121 ఓట్లను తిరస్కరించగా, 8 ఓట్లు నోటాకు పడ్డాయి. గన్నవరంలో నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లు 2463 ఉండగా, టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు 1459 ఓట్లు, వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీకి 862 ఓట్లు వచ్చాయి. 246 తిరస్కరించారు. 18 నోటాకు పడ్డాయి. మచిలీపట్నం పార్లమెంటులో పోస్టల్ బ్యాలెట్‌లు19,829ఓట్లు ఉండగా జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరికి 12,290, వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావుకు 6,049ఓట్లు వచ్చాయి.

వరప్రసాద్‌కు డాక్టరేట్



» మూడేళ్లపాటు జగన్ ప్రభుత్వం వేధింపులు

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జగన్ ప్రభుత్వం మూడేళ్లపాటు వేధించి పలు ఇబ్బందులకు గురిచేసిన ఆర్థిక శాఖ ఉద్యోగి వరప్రసాద్ డాక్టరేట్ సాధించారు. సచివాలయంలోని ఆర్థిక శాఖలో ఎస్‌వోగా పనిచేస్తున్నారు. 2014-19లో చంద్రబాబు హయాంలో సీఎంవోలో ఈయన కీలకంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆర్థిక శాఖకు తిరిగి వచ్చారు. అయితే, జగన్ సర్కారు అక్రమంగా, పరిమితికి మించి చేస్తున్న అలవికాని అప్పులపై మీడియాలో ప్రతిరోజు కథనాలు వచ్చాయి. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలన్నీ బయటపడుతున్నాయన్న ఆక్రోశంతో ఆ రహస్య సమాచారమంతా గతంలో టీడీపీ ప్రభుత్వానికి దగ్గరగా పనిచేసిన వరప్రసాద్, మరో ఇద్దరు ఉద్యోగుల పనేనంటూ తీర్మానించి ఆ ముగ్గురిని సస్పెండ్ చేస్తున్నట్లు 2021 ఆగస్టు 4వ తేదీన జీవోలిచ్చారు. దాదాపు మూడేళ్ల తరువాత 2024 మార్చి 16వ తేదీన ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజున సస్పెన్షన్ ఎత్తేశారు. ఈ మూడేళ్ల కాలంలో కనీసం వారిమీద మోపిన సమాచార లీకేజీ ఆరోపణలపై స్పందించేందుకు వారికి నోటీసులు కూడా ఇవ్వలేదు. ఈ మూడేళ్ల సమయాన్ని వృథా చేయకుండా వరప్రసాద్ ఎస్వీయూ నుంచి ఆర్థిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ సాధించారు. ఆయన రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.దేవరాజులు పర్యవేక్షణలో ఫైనాన్సింగ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాక్టీస్ ప్రాబ్లమ్స్ అండ్ ఇన్నోవేటివ్ స్ట్రాటజీస్ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

పోలీసుల అత్యుత్సాహం..

» రామానాయుడు పేటలో రోడ్డుపై ఇనుపకంచెలు.. » పేర్ని నాని ఇంటి వద్ద ఆంక్షలు

మచిలీపట్నం టౌన్, జూన్ 5 : రామానాయుడుపేటలో పోలీసులు ఇనుప కంచెలు వేసి ఎవరినీ నడవకుండా ఆంక్షలు విధించారు. రామానాయుడుపేట సెంటర్ నుంచి బచ్చుపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు ప్రజలు ఎవరూ తిరగకుండా పోలీసులు బ్యారికేడ్లు, ఇనుప కంచెలు వేశారు. పేర్ని నాని ఇల్లు ఈ రోడ్డులో ఉన్నందున పోలీసులు ఈ విధమైన చర్యలు చేపట్టారు. దీనిపై డీఎస్పీ, సీఐల వద్దకు రామానాయుడుపేట ప్రజలు వెళ్లి బ్యారికేడ్లు తొలగించాలని కోరారు. రామానాయుడుపేటలో అప్రకటిత కర్ఫ్యూపై ప్రజలు అభ్యంతరం తెలిపారు.


రామానాయుడుపేటలో ఇనుప కంచెలు వేసిన పోలీసులు

గుడివాడ ప్రజలకు రుణపడి ఉంటా

» టీడీపీ కూటమి విజేత వెనిగండ్ల రాము



గుడివాడ, జూన్ 5 : గుడివాడ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం కల్పించి, అభిమానంతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే విజేత వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో వెనిగండ్లకు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజలు, కూటమి నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. అధికారులు, పట్టణ ప్రముఖులు వెనిగండ్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాము మాట్లాడుతూ, గుడివాడ ప్రజలు అభిమానంతో అత్యధిక మెజార్టీనిచ్చి తనను గెలిపించారని, అభిమానిస్తే నెత్తిన పెట్టుకుంటారని, అసహ్యించుకుంటే ఎలా తొక్కేస్తారో ఈ ఫలితాలతో రుజువు చేశారన్నారు. జవాబుదారీ పాలనను ప్రజలకు అందిస్తానన్నారు. ఆరు నెలల పర్యటనలో ప్రతి ఇంటి కష్టాన్ని తెలుసుకున్నానని, ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లలో 25ఏళ్ల అభివృద్ధిని చేసి చూపిస్తానన్నారు. ఫలితాలు చూసి అమెరికా వెళ్లిపోతానని పిచ్చి కూతలు కూసిన కొడాలి నాని కౌంటింగ్ రోజున 10.30కే వెళ్లిపోయాడని ఎద్దేవా చేశారు. గుడివాడ ప్రజలు రికార్డు మెజార్టీతో గెలిపించి భువనేశ్వరమ్మకు బహుమతిగా ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాని ఓటమితో గుడివాడకు పట్టిన శని వదిలింది : రావి

రెండు దశాబ్దాలుగా గుడివాడను పట్టి పీడిస్తున్న కొడాలి నాని శని వదిలిపోయిందని, వెనిగండ్ల విజయంతో గుడివాడ అభివృద్ధి పథాన దూసుకుపోతుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం భారీ మెజార్టీతో గెలిచిన వెనిగండ్ల రామును అభినందించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి ఓటరుకు పేరు పేరున ధన్యావాదాలు తెలిపారు.

నాలుగుసార్లు ఎమ్మెల్యేగా.. కీర్తి శిఖరాన మండలి

» బుద్ధప్రసాద్‌కు విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం అభినందన



అవనిగడ్డ, జూన్ 5 : అవనిగడ్డ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎన్నికైన తొలి వ్యక్తిగా కూటమి జనసేన అభ్యర్థి బుద్ధప్రసాద్ రికార్డు సృష్టించారు. అంతకుముందు దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు 1972, 1978, 1983 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించగా, ఆ తర్వాత దివంగత మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు 1985, 1989, 1994 సంవత్సరాల్లో వరుసగా హ్యాట్రిక్ సాధించారు. 1994 ఎన్నికల్లో బుద్ధప్రసాద్ తొలి ప్రయత్నంలో ఓటమి చెందగా, 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 ఎన్నికల్లో ఓటమి చెంది రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. తిరిగి 2014 ఎన్నికల్లో విజయం సాధించి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో ఓటమి చెంది.. 2024లో జనసేన కూటమి అభ్యర్థిగా రికార్డు స్థాయిలో 46,434 ఓట్ల ఆధిక్యతను సాధించటమే కాక, అవనిగడ్డ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలివ్యక్తిగా రికార్డు సాధించారు. దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా నాలుగుసార్లు నియోజకవర్గం నుంచి చట్టసభలకు ఎన్నికయ్యారు.

బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు

అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌కు విశ్రాంత కలెక్టర్ బి.లక్ష్మీకాంతం శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం బుద్ధప్రసాద్ నివాసానికి కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన లక్ష్మీకాంతం బుద్ధప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తాను కృష్ణాజిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో నియోజకవర్గంలో బుద్ధప్రసాద్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. బుద్ధప్రసాద్ గెలుపు నియోజకవర్గానికి శుభపరిణామమని లక్ష్మీకాంతం అన్నారు.

ఆరు మండలాల్లోనూ మెజార్టీ

కూటమి జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌కు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో స్పష్టమైన మెజార్టీ లభించింది. ఘంటసాలలో 4941ఓట్లు, చల్లపల్లిలో 7117 ఓట్లు, మోపిదేవిలో 7920 ఓట్లు, అవనిగడ్డలో అత్యధికంగా 11,315 ఓట్లు, కోడూరులో 7652 ఓట్లు, నాగాయలంకలో 7852.. పోస్టల్ బ్యాలెట్ కలిపి 46434 ఓట్ల మెజార్టీ సాధించారు.


రైల్వే అధికారులు, విద్యార్థుల అవగాహన ర్యాలీ

రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఘనంగా పర్యావరణ దినోత్సవం



రైల్వేస్టేషన్, జూన్ 5 : విజయవాడ రైల్వే డివిజన్‌లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు జరిగాయి. రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ సబీకులు, విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్ఎం, ఏడీఆర్ఎంలు పి.ఏ డ్విన్, కొండా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, స్కౌట్స్ గైడ్స్ పాఠశాల విద్యార్థులతో క్లాక్ టవర్ నుంచి స్టేషన్ పరిసర ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఇంధన సంరక్షణలో డివిజన్ సాధించిన విజయాలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వల్ల కలిగే కాలుష్యం, ప్రమాదాల గురించి ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు డీఆర్ఎం బహుమతులు అందజేశారు. డివిజన్‌లోని అన్ని ప్రధాన స్టేషన్లలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ పోస్టులో అభినందనలు

» తపాలా శాఖ వినూత్న కార్యక్రమం

లబ్బీపేట, జూన్ 5 : 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన నాయకులకు ఈ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలా శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్, అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామకృష్ణలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విజయం సాధించిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు హృదయపూర్వక అభినందనలు అదేవిధంగా వారి పదవీకాలానికి శుభాకాంక్షలు తెలియవరచవచ్చని, ఇందుకు కేవలం 10రూపాయలు రుసుము మాత్రమే చెల్లించి తమ దగ్గరలో ఉన్న ఏదైనా పోస్టాఫీసులో ఈ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలపవచ్చని పేర్కొన్నారు. ఈ విధంగా పంపిన సందేశాలు నేరుగా మీ అభిమాన నాయకుని చేతికే చేరుతాయని తెలిపారు. ఈ-పోస్ట్ ద్వారా ప్రజలు 1,55,00 కంటే ఎక్కువ పోస్ట్ ఆఫీసుల నెట్‌వర్క్ ద్వారా ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్, ఫిజికల్ డెలివరీ కలయికతో భారతదేశంలోని ఏదిరునామాకైనా తమ సందేశాలను పంపవచ్చని తెలిపారు. ఈ-పోస్ట్ ఇంటర్నెట్ ద్వారా సందేశాలను సాఫ్ట్ కాపీగా పంపుతుందని, గమ్యస్థానంలో అది హార్డ్ కాపీ రూపంలో చిరునామాదారునికి డెలివరీ చేయబడుతుందని, కేవలం రూ.10లకు ఏ4 పరిమాణంగల పేజీని ఈ-పోస్ట్ ద్వారా పంపవచ్చని తెలిపారు. ఈ సేవ గురించి మరింత సమాచారం కోసం దగ్గరలోని పోస్ట్ ఆఫీసుని సంప్రదించాలని తెలిపారు.



నీట్‌లో శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం, జూన్ 5 : నీట్-2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన సీనియర్ బైపీసీ విద్యార్థులను బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మొగల్రాజపురం శారద విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, యు.నాగపవన్ (656), వి.శౌరజ్ కార్తీక్ (632), పి.ఇందురెడ్డి (621), పి.రమ్యానాగసాయి(606), ఆర్.సింధుసిరి (602) తదితరులు మంచి ర్యాంకులు సాధించారని చెప్పారు. 150 మంది పరీక్ష రాయగా 75 మంది సీటు సాధించే మార్కులు సాధించారని చెప్పారు. తల్లిదండ్రుల కోరిక మేరకు అనుకున్న కళాశాలలో సీటు వచ్చే విధంగా విద్యార్థులు మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కళాశాల అడ్వైజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జీవీ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేశినేని నానీ.. ఇకనైనా మారు!

» బుద్దా వెంకన్న ట్వీట్

వన్‌టౌన్, జూన్ 5 : కేశినేని శ్రీనివాస్ (నాని) ఇకనైనా మారు.. అంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న బుధవారం ట్వీట్ చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు నాని తన స్వార్థం చూసుకున్నాడని, అదే సమయంలో పార్టీకి అండగా శివనాథ్(చిన్ని) నిలిచాడని పేర్కొన్నారు. స్వార్థం ఓడిందని, సాయం గెలిచిందని, ఇకనైనా మారు అంటూ నానికి సూచించారు.

గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి : కృష్ణా జిల్లా మోపిదేవి, మచిలీపట్నంలో బీసీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల కన్వీనర్ కె.వీర రవి తెలిపారు. బుధవారం ఆయన మోపిదేవి గురుకుల పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ, బీసీ గురుకుల పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం 6, 7, 8 తరగతుల్లో వివిధ కేటగిరిల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 20న నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు ఉంటాయని తెలిపారు.

ఢిల్లీకి అధినేత చంద్రబాబు..

గన్నవరం : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు గన్నవరం విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. బుధవారం ఢిల్లీ వెళ్లేందుకు ఉండవల్లి నుంచి రోడ్డు మార్గాన విమానాశ్రయానికి చేరుకోగా.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, కాగిత కృష్ణ ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు వర్లాణం హరిబాబు నాయుడు, జాస్తి వెంకటేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది కేపీ రమణ, జువ్వల్లి సురేష్ తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. ప్రత్యేక విమానంలో చంద్రబాబు ఢిల్లీ వెళ్లారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ

మచిలీపట్నం టౌన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్లాస్టిక్ నిర్మూలన చేస్తామని పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డీఈవో తాహెరా సుల్తానా ఆధ్వర్యంలో డీవైఈవోలు బి.సి.ఎస్. సింగ్, పద్మారాణి, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ జాకీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

ధర్మపథం వేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన

వన్‌టౌన్, జూన్ 5: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలోని ధర్మపథం వేదికపై బుధవారం గుంటూరుకు చెందిన మహదేవ్ కూచిపూడి నాట్యక్షేత్రం వారిచే నృత్యగురువు మామిడాల పావని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు గురువు మామిడాల పావనికి, కళాకారులు సోనిక, తన్వీ, జ్యోత్స్నిక, హారిణి, హేమ, విచిత్ర, లాస్య, దుర్గా, జయలక్ష్మీలకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా

ఎంపీ కేశినేని శివనాథ్



కేక్ కట్ చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, పట్టాభి తదితరులు

భారతీనగర్, జూన్ 5: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తూర్పు నియోజకవర్గం నాల్గవ డివిజన్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ కేక్ కట్ చేసి అందరికీ అందజేశారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు, నేతలకు, తెలుగు మహిళా సంఘం సభ్యులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున యాదవ్, తూర్పు ఎస్సీసెల్ అధ్యక్షుడు దేవరపల్లి ఆంజనేయులు, తూర్పు తెలుగు మహిళా నేతలు చలసాని రోజా, నాగమణి, రాజమణి, దాసరి నాగశ్రీ, చిత్రా నిర్మల, మాధవి, అట్లూరి ధనలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గగుడిలో అన్నవితరణకు రూ.1,01,116 విరాళం



వన్‌టౌన్, జూన్ 5: దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న అన్నవితరణకు కృష్ణా జిల్లా కానుమోలుకు చెందిన పొట్లూరి పవన్ కుమార్, లతలు బుధవారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,116లు డిప్యూటీ ఈవోకు చెక్కు ద్వారా విరాళం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, జూన్ 5: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణం గా రింగ్‌రోడ్డు సెక్షన్‌లో పరిధిలోగురువారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఅండ్‌టీ కాలనీ 1,2,3 రోడ్లు, చందమామ హాస్పిటల్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ సర్వీస్ రోడ్డు, కె.పినగర్, స్టెల్లా కాలేజీ ఏరియా, నిర్మలా కాన్వెంట్ ఏరియా, ఓల్డ్ పీఅండ్‌టీ కాలనీ, భద్రయ్యనగర్, బెంజ్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ బందరు రోడ్ ఏరియా పరిసర ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబుకు గద్దె రామ్మోహన్ అభినందనలు



చంద్రబాబుకు, లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న గద్దె

పటమట, జూన్ 5 : ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, మిత్రపక్షాలు ఫలితాల్లో సునామీ సృష్టించడాన్ని పురస్కరించుకుని ఏపీకి కాబోయే నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఉండవల్లిలో చంద్రబాబు నాయుడు నివాసంలో కలిసి బుధవారం అభినందనలు తెలిపారు. మీ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని, ఆ క్రమంలో ఆ భగవంతుడు మీకు మంచి ఆరోగ్యాన్ని, శక్తిని ఇవ్వాలని కోరుకున్నట్లు గద్దె తెలిపారు. విజయవాడ తూర్పులో ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన గద్దె రామ్మోహన్‌ను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో తూర్పును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు ఆకాంక్షించారని గద్దె తెలిపారు.

లోకేశ్‌కు గద్దె అభినందనలు

రాష్ట్రంలో కూటమి తిరుగులేని విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను బుధవారం ఉండవల్లిలో పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. మంగళగిరిలో భారీ మెజార్టీతో లోకేశ్ గెలవడంపై గద్దె అభినందిస్తూ రాష్ట్రంలో భారీ విజయంతో టీడీపీ చరిత్ర సృష్టించిందని కొనియాడారు.

గద్దెకు ఐలా ప్రతినిధుల అభినందనలు

పెనమలూరు: తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆటోనగర్ అభివృద్ధిలో గద్దె పాత్ర కీలకమని, భవిష్యత్తులో మరింత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గద్దెను కలిసిన వారిలో డాక్టర్ అబ్దుల్ కలాం, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, డైకిన్ శ్రీకాంత్, బిల్లుపాటి జితేంద్రప్రసాద్, నార్ల వణికుమార్ ఉన్నారు.

17వ డివిజన్ టీడీపీ నాయకులు

రాణిగారితోట: తూర్పు నియోజకవర్గం నుంచి మూడో సారి ఎమ్మెల్యేగా గెలుపొందిన గద్దె రామ్మోహన్‌ను 17వ డివిజన్ టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పుట్ల రమణ, 17వ డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, షేక్ బాజీ, సర్వేపల్లి డేవిడ్ రాజ్, పుట్ల ప్రదీప్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల హర్షం

పటమట: గద్దె రామ్మోహన్ పటమట సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావు అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ గద్దె సారథ్యంలో తూర్పు అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమాకు సత్కారం



బొండా ఉమాను సన్మానించిన లింగాల నరసింహులు

పాయకాపురం: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావును పలువురు నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలియ జేస్తున్నారు. ఈ మేరకు బుధవారం బొండా ఉమాను ఆయన నివాసం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి లింగాల నరసింహులు మాదిగ బొండా ఉమాను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ పక్షాన బొండా ఉమాను మర్యాదపూర్వకంగా కలిశారని నరసింహులు మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నూకపోగు యేసు మాదిగ, కాంపాటి వెంకటేశ్వరరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పరుచూరి ప్రసాద్, దాసరి కనకరావులు సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

బొండా ఉమాకు బొందిలి నేతల అభినందనలు

ధర్నాచౌక్: విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైన బొండా ఉమామహేశ్వరరావును టీడీపీ బొందిలి సాధికారక కమిటీ కన్వీనర్ నందేటి చంద్రభానుసింగ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మణ్‌సింగ్, రాష్ట్ర తెలుగు విద్యార్థి నాయకుడు ఎస్.యోగేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ క్రికెట్ చాంప్‌గా గుంటూరు

● కృష్ణాపై ఐదు వికెట్లతో ఘన విజయం

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 5 : మూలపాడు వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ పురుషుల వన్డే క్రికెట్ టోర్నీ చాంపియన్‌గా గుంటూరు టీమ్ నిలిచింది. బుధవారం ఆఖరి లీగ్ మ్యాచ్‌లో కృష్ణాపై గుంటూరు విజయం సాధించి వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విజయంతో ఆరు పాయింట్లతో చాంప్‌గా నిలిచింది. తొలుత బ్యాట్‌పట్టిన కృష్ణా టీమ్ 50 ఓవర్లలో 256/9 పరుగులు చేసింది. అనంతరం 257 పరుగుల లక్ష్యాన్ని గుంటూరు 46.5 ఓవర్లలోనే అధిగమించింది.

కూటమి గెలుపుపై మాదిగ సంఘాల జేఏసీ హర్షం

ధర్నాచౌక్, జూన్ 5: కూటమి విజయం సాధించడంపై మాదిగ కుల సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ చంద్రబాబు గెలుపే మాదిగల గెలుపని కూటమి గెలుపునకు రాష్ట్రంలోని మాదిగలు కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు 35 మాదిగ సంఘాల పక్షాన అభినందనలు తెలిపారు. దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టిరాజు, ఆదివాసి మేధావుల ఫోరం అధ్యక్షుడు వెజెండ్ల సుబ్బారావు, బేడ, బుడగ, జంగం సంఘం అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు, ప్రసాద్, మల్లాది, కేశవరపు ఆశీర్వాదం, పూనూరు బుజ్జి పాల్గొన్నారు.



ఇండియన్ ఆయిల్ పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో, డీఈవో సుబ్బారావు, ఉపాధ్యాయుల ప్రదర్శన , కృష్ణా తీరంలో ఎన్‌సీసీ కేడెట్లు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

మొగల్రాజపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం వీపీ సిద్ధార్థ కళాశాలలో ఫోర్ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ బలీందర్ సింగ్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి రూపొందించిన బ్రిడ్ టర్నర్ ప్లాస్టిక్ చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన క్యాడెట్‌లను ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ అభినందించారు. బెటాలియన్ లెఫ్టినెంట్ రోహిణి కుసుమ, ఎన్‌సీసీ కేడెట్‌లు పాల్గొన్నారు. ● ఫిజిక్స్ విభాగం, ఎనర్జీ కన్జర్వేషన్ , ఎకో, గ్రీన్, సైకిల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శంకర్ నాయక్ , సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు మొక్కలు నాటారు. విజేతలకు ఎస్ఏసీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు పంపిణీ చేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఫిజిక్స్ హెడ్ శ్రీనివాస్ కృష్ణ, ఎకో క్లబ్ కన్వీనర్ పాండురంగారావు, గ్రీన్ క్లబ్ కన్వీనర్ శ్రావణి, సైకిల్ క్లబ్ కన్వీనర్ శివనాగరాజు, మ్యాథ్స్ హెచ్‌వోడీ వి.వి. వెంకటేశ్వరరావు, జువాలజీ హెడ్‌వోడీ పి.శ్రీనివాసరావు, హిందీ హెచ్‌వోడీ జయలక్ష్మి పాల్గొన్నారు. ● జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో మొగల్రాజపురం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎండీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పద్మజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జన శిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఎ. పూర్ణిమ, సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.

లబ్బీపేట: బందర్ రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో వినియోగదారులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్వీస్ స్టేషన్ సిబ్బంది పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. జిల్లా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్, సర్వీస్ స్టేషన్ అధినేత ఎం.వి.వి.సత్యనారాయణ మాట్లాడారు. కె.వెంకటప్పయ్య, నందకిషోర్, ఇండియన్ ఆయిల్ డివిజనల్ మేనేజర్ అనీల్ పాల్గొన్నారు.

పటమట: స్థానిక పటమట కేబీసీ బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి యూవీ.సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు ప్రేమసాగర్, ఉపాధ్యాయిని శారదశ్రీ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటి, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, తొలి రోజు ప్లాస్టిక్ వ్యతిరేక దినంగా జరిపామన్నారు. స్కౌట్స్, ఎన్‌సీసీ అధికారులు దారం ప్రసాద్, స్కౌట్స్‌గైడ్స్, ఎన్‌సీసీ కేడేట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీనగర్: ఆంధ్రా లయోల ఇంజనీరింగ్ కళాశాల, ప్రేరణాలయం మునునూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం నూజివీడులోని మౌంట్‌ఫోర్ట్ ఎన్విరాన్ మెంటల్ హబ్‌లో మొక్కలు నాటారు. కళాశాల అధ్యాపకులు సిస్టర్ డాక్టర్ క్యాండీ, ఎం.విజయ కుమార్, వి.నాగలక్ష్మి, నూజివీడు, లయోలా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఆర్వీ స్వామి అభినందనలు



విజయవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత చంద్రబాబును విజయవాడ హయత్ ప్లేస్ హోటల్ చైర్మన్ ఆర్వీ స్వామి కలిశారు. కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో ఆయనకు శాలువా కప్పి అభినందించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

ఖతార్‌లో టీడీపీ విజయోత్సవాలు

వన్‌టౌన్, జూన్ 5: ఏపీ అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించడం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టనుండడంతో ఖతార్‌లో టీడీపీ శ్రేణులు బుధవారం విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏపీలో టీడీపీకి పట్టం కట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియచేశారు. కేక్ కట్ చేసి పరస్పర శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. చంద్రబాబునాయుడు పాలనకు ప్రజలు సహకరించాలని కోరారు.

తొలిసారి ఇటువంటి పాత్ర చేశా



టాలీవుడ్ చందమామగా పేరు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్ 'సత్యభామ'. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించగా, సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. రేపు ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా కాజల్, చిత్ర నిర్మాతలు బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి మీడియాతో ముచ్చటించారు "దర్శకుడు సుమన్ చిక్కాల ఈ సినిమా కథ చెప్పిన వెంటనే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఓకే చేశా. ఒక పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. నేను ఇప్పటివరకూ ఎన్నో పాత్రలు చేశాను.. కానీ ఇటువంటి ఎమోషనల్ యాక్షన్ రోల్‌లో నటించడం ఫస్ట్ టైమ్. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్ అన్నీ సహజంగా ఉంటాయి. సస్పెన్స్ థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే ప్రేక్షకులకు ఈ చిత్రం చాలా బాగా నచ్చుతుంది. మీరు ట్రైలర్‌లో చూసిన దాని కంటే ఎన్నో ట్విస్ట్‌లు సినిమాలో ఉంటాయి. శ్రీచరణ్ పాకాల ఈ సినిమాకు అద్భుతమైన సంగీతంతో పాటూ అదిరిపోయే నేపథ్య సంగీతం ఇచ్చారు" అని చెప్పారు. చిత్ర నిర్మాతలు బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి మాట్లాడుతూ "ఇండస్ట్రీలో మా తొలి ప్రయత్నంలోని ఇటువంటి పవర్‌ఫుల్ సినిమాను నిర్మిస్తున్నందుకు ఆనందంగా ఉంది. మంచి కంటెంట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనేది మా ఉద్దేశం. సుమన్ చిక్కాలకు ఇది తొలి సినిమా అయినా ఎక్కడా తడబడలేదు. ఒక ఆరేడు ఏళ్ల క్రితం ఇంగ్లాండ్‌లో జరిగిన సంఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. ఇందులో కాజల్ పెర్ఫార్మెన్స్ అందరినీ ఆకట్టుకుంటుంది. ఆమె నటన సినిమాకే హైలెట్ అవుతుంది" అని చెప్పారు.

ప్రియమైన మామయ్యకు...

చంద్రబాబు, బాలకృష్ణకు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలుగు దేశం పార్టీలోని పలువురు నేతలకు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు. బుధవారం ఉదయం ఆయన సోషల్ మీడియా వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని మామయ్య, బాలకృష్ణను బాబాయ్, పురందేశ్వరిని అత్త అని సంబోధిస్తూ ఈ ట్వీట్ చేయడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. "ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం సాధించిన ప్రియమైన మామయ్య నారా చంద్రబాబు నాయుడుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ ఈ విజయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపున నడిపిస్తుందని ఆశిస్తున్నాను. మంగళగిరిలో అద్భుతమైన మెజారిటీతో గెలిచిన నారా లోకేశ్‌కి, మూడోసారి హిందూపూర్‌లో జయభేరి మోగించిన బాలకృష్ణ బాబాయికి, ఎంపీలుగా గెలిచిన భరత్, పురందేశ్వరి అత్తకి నా శుభాకాంక్షలు. అలాగే ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన పవన్‌కల్యాణ్‌కు కూడా నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

హేమను సస్పెండ్ చేస్తున్న 'మా'?



రేవ్ పార్టీ కేసులో అరెస్టైన నటి హేమపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ('మా') కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఆమె దోషిగా తేలితే చర్యలు తప్పవని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఇటీవల పేర్కొన్నారు. అందులో భాగంగా ఆయన కమిటీ సభ్యుల అభిప్రాయాలను కోరినట్లు తెలిసింది. మెజారిటీ సభ్యులు హేమను సస్పెండ్ చేయాల్సిందేనని వెల్లడించినట్లు సమాచారం. రేవ్ పార్టీ కేసు నుంచి హేమకు క్లీన్ చిట్ వచ్చేంత వరకూ 'మా' నుంచి సస్పెండ్ చేసేందుకు 'మా' కార్యవర్గం సిద్ధమైనట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన గురువారం వెల్లడయ్యే అవకాశం ఉంది.

24 గంటల కస్టడీ

ఇదిలా ఉంటే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న హేమను సీసీబీ పోలీసులు బుధవారం కస్టడీకి తీసుకున్నారు. ఆనేకల్ జేఎంఎఫ్‌సీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి, 24 గంటలపాటు విచారణ కోసం అనుమతి తీసుకున్నారు. సీసీబీ పోలీసులు హేమను అరెస్టు చేసిన రోజే ప్రాథమికంగా విచారించారు. మరింత సమాచారం కోసం ఆమెను కస్టడీకి తీసుకున్నారు.

సెకండ్ ఇన్నింగ్స్ సూపర్

రాహుల్



కార్తికేయ గుమ్మకొండ, రాహుల్ టైసన్ హీరోలుగా నటించిన 'భజే వాయువేగం' చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన 'హ్యాపీ డేస్' చిత్రంలో నలుగురు హీరోల్లో ఒకరిగా నటించి, 'టైసన్' పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాహుల్ 'భజే వాయువేగం' సినిమాతో సెకండ్స్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. అన్ని వర్గాల ప్రేక్షకులూ చిత్రాన్ని బాగా ఆదరిస్తున్నారనీ, తన పాత్రకు కూడా మంచి స్పందన వస్తోందని రాహుల్ 'చిత్రజ్యోతి'కి తెలిపారు. 'ఈ సినిమా విడుదలకు ముందు ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్, యూనిట్ సభ్యులందరం కలసి చూశాం. సినిమా బాగా వచ్చిందనీ, తప్పకుండా హిట్ అవుతుందని మా అందరికీ నమ్మకం కలిగింది. అదే అభిప్రాయాన్ని ప్రేక్షకులు కూడా వ్యక్తం చేస్తున్నారు. నా సెకండ్ ఇన్నింగ్స్ మరో మంచి సినిమాతో ప్రారంభించినందుకు ఆనందంగా ఉంది' అన్నారు రాహుల్.

ఈ సినిమాలో అవకాశం ఎలా వచ్చిందని అడిగితే 'యూవీ క్రియేషన్స్ ఓ చిన్న సినిమా ప్లాన్ చేస్తూ నాకు హీరోగా అవకాశం ఇచ్చింది. ఆ సినిమా పేరు 'గేడ' అది నిర్మాణంలో ఉండగానే యూవీ క్రియేషన్స్ నిర్మాతలే 'భజే వాయువేగం' సినిమా ప్రారంభించారు. కార్తికేయ హీరోగా నటించే ఆ సినిమాలో సెకండ్ హీరో కోసం వెదుకుతుంటే ఆ చిత్ర దర్శకుడు ప్రశాంత్‌రెడ్డికి నా పేరు సూచించారు యూవీ క్రియేషన్స్ అధినేతలు. 'గేడ' సినిమాలో నేను చేసిన వర్క్ చూసి సంతృప్తి చెంది ప్రశాంత్‌రెడ్డి ఇందులో అవకాశం ఇచ్చారు. ఒకే సంస్థలో రెండు మంచి చిత్రాలు రావడం.. రియల్లీ ఐయామ్ లక్కీ' అని చెప్పారు రాహుల్. ఈ సినిమాతో కార్తికేయ రూపంలో మంచి స్నేహితుడు లభించాడనీ, సినిమాలో తామిద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరిందని ఆయన తెలిపారు. కార్తికేయ, తను, తనికెళ్ల భరణి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయని చెప్పారు.

తన కొత్త సినిమాల గురించి వివరిస్తూ 'గేడ' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో నాకు అది సెకండ్ ఫిల్మ్ అవుతుంది. మూడో సినిమా ఇప్పుడు నిర్మాణంలో ఉంది. వార్ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఆ చిత్రాన్ని నా స్నేహితుడే నిర్మిస్తున్నారు. అది నా డ్రీమ్ ప్రాజెక్ట్. చాలా కాలం నుంచి దాని మీద వర్క్ చేసి ఇప్పుడు షూటింగ్ ప్రారంభించాం. శివ అని కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నాం. ఇందులో నేను సోలో హీరోగా నటిస్తున్నాను. ఆర్మీలో ఆయుధాలను ఎలా ఉపయోగిస్తారో, వాళ్ల ట్రైనింగ్ ఎలా ఉంటుందో నాలుగు నెలల పాటు ఓ ఆర్మీ పర్సన్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. దీని తర్వాత టైమ్ ట్రావెల్ ఫిల్మ్ చేస్తున్నాను. ఈ చిత్రాలన్నీ నాకు మంచి పేరు తెస్తాయనే నమ్మకంతో ఉన్నాను' అన్నారు రాహుల్.

ప్రతి ఒక్కరూ రిలేట్ అవుతారు



దర్శకధీరుడు రాజమౌళి శిష్యుడు అవనీంద్ర దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'లవ్ మౌళి'. నవదీప్ హీరోగా నటించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వాని, భావన సాగి హీరోయిన్లుగా నటించారు. సి స్పేస్, నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ నిర్మించారు. రేపు ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు అవనీంద్ర మీడియాతో ముచ్చటించారు.

"నా తొలి ప్రాజెక్టును ఏదైనా కొత్త కథతో విభిన్నంగా.. వైవిధ్యంగా తెరకెక్కించాలనిపించింది. దానిక్కారణం అప్పటికే నేను చాలా కమర్షియల్ సినిమాలకు వర్క్ చేశాను. కాబట్టి ఒక పొయెటిక్ లవ్ స్టోరీని ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేలా రాయాలనిపించింది. ఇందులో లీడ్ రోల్ కోసం చాలా మందిని అనుకునే సమయంలో నవదీప్ అయితే పర్ఫెక్ట్‌గా ఉంటారని భావించి ఆయన్ని అప్రోచ్ అయ్యా. ఆయన కథ విని.. ఇలాంటి సినిమాలో నటించేందుకే ఎదురుచూస్తున్నాను అని వెంటనే ఓకే చేశారు. మేఘాలయాలో మొదటి సారి షూటింగ్ జరుపుకొన్న చిత్రమిదే. కొన్ని వాస్తవ సంఘటనలకు ఫిక్షన్, ఫాంటసీ కలిపి తెరకెక్కించిన కథ ఇది. సినిమాలో నవదీప్ క్యారెక్టర్‌లో చాలా విభిన్నమైన షేడ్స్ ఉంటాయి. ఇది ఒక చిత్రకారుడి ఎమోషనల్ జర్నీ. నిజమైన ప్రేమకు సరికొత్త నిర్వచనం ఇస్తుందీ సినిమా. ఇందులోని బోల్డ్ డైలాగ్స్, లిప్‌లాక్స్ కథకు అవసరమై పెట్టినవే. ప్రశాంతంగా లవ్ మూడ్‌లో కూర్చున్న శివుడిని మౌళి అంటారు అందుకే ఈ టైటిల్ పెట్టాం. ఈ సినిమాతో ప్రతీ ఒక్కరు ఏదో ఒక విషయంలో రిలేట్ అవుతారు. ఈ సినిమాలో మ్యూజిక్ చాలా కీలకం. గోవింద్ వసంత అద్భుతమైన పాటలు ఇచ్చారు" అని చెప్పారు.

ఒక్క క్షణం కూడా బోర్ ఫీలవ్వరు



మలయాళ బ్లాక్‌బస్టర్ 'హృదయమ్' సినిమాతో మ్యూజిక్ ప్రియులకు చేరువయ్యారు మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్. ఆయన తెలుగులో సంగీతం అందించిన 'ఖుషి', 'హాయ్ నాన్న' చిత్రాల్లోని పాటలు అందరినీ ఆకట్టుకుని చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి.ఆయన మ్యూజిక్ అందించిన లేటెస్ట్ చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయిన్లుగా నటించగా, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"నేను ఇప్పటివరకూ సంగీతం అందించిన చిత్రాల్లో ఇది చాలా ప్రత్యేకం. ఇందులో 16 పాటలను కంపోజ్ చేశాను. మొదట కేవలం 7 పాటలే అనుకున్నాం. కానీ తరువాత ఒక్కోటి పెరుగుతూ మొత్తం 16 పాటలయ్యాయి. అన్ని పాటలూ ఆకట్టుకుంటాయి. దర్శకుడు ఈ సినిమా కథను చాలా బాగా తెరకెక్కించారు. ఈ మధ్య కాలంలో వచ్చిన ఉత్తమ కుటుంబ కథా చిత్రాల్లో ఇది ఒకటిగా ప్రేక్షకుల మదిలో నిలిచిపోతుంది. భావోద్వేగాలు, వినోదం కలగలసిన సినిమా ఇది. శర్వానంద్‌ని మునుపటికన్నా ఎనర్జిటిక్‌గా ఇందులో చూస్తారు. కృతి శెట్టి తన పాత్రకు న్యాయం చేశారు. థియేటర్స్‌లో చూసే ప్రేక్షకులు ఒక్క క్షణం కూడా బోర్ ఫీలవ్వరు" అని చెప్పారు.









ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 6 జూన్ 2024

సమాజం పట్ల ప్రేమ... వారిద్దరి మనసులు కలిపింది.
కానీ ఆ సేవా మార్గమే... వారి పెళ్లి పాతికేళ్ల వాయిదాకు కారణమైంది.
భిన్న సంస్కృతులు... విభిన్న నేపథ్యాలు... అన్నీ దాటి రెండున్నర దశాబ్దాల తరువాత వారిద్దరూ కలిసి ఏడడుగులు వేశారు. తమ ప్రేమను గెలిపించుకొని... ఎదుటివారి ప్రేమకు పాత్రులైన జి.సుధ, జె.మోహన్‌కుమార్ జర్నీ ఇది...

'ప్రేమ'తో సేవ... పాతికేళ్ల తరువాత పెళ్లి

ఎన్నో ప్రజా ఉద్యమాలు. అలుపెరుగని పోరాటాలు. ఇరువురి బాట ఒక్కటయింది. బాషలు వేరైనా... ప్రాంతాలు... సంస్కృతులు భిన్నమైనా... సమాజం కోసం పాటుపడటంలో జి.సుధ, జె.మోహన్‌కుమార్ భావాలు ఒక్కటయ్యాయి. కొన్నేళ్లు కలిసి నడిచిన ప్రయాణంలో ప్రేమ చిగురించి... వారి మనసులూ కలిశాయి. ఇక కలిసి జీవిద్దామని నిర్ణయించుకున్న తరుణంలో... కథ మొదటికొచ్చింది.

నేపథ్యాలు వేరైనా...

కర్ణాటక రాష్ట్రం చిక్‌మగళూరుకు చెందిన ఈ ప్రేమికులు మొదట కలిసింది 1995లో. నాడు అజమ్‌పురాలో నిర్వహించిన 'సంపూర్ణ సాక్షరత ఆందోళన్' వాలంటీర్స్ వర్క్‌షాప్‌లో వీరిరువురూ పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో సుధ నాయకత్వ లక్షణాలు చూసి మోహన్ ముగ్ధుడయ్యారు. ఆమెతో పరిచయం పెంచుకున్నారు. సామాజిక కార్యక్రమాల నేపథ్యంలో ఇద్దరి మధ్య మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. మోహన్‌ది కర్ణాటక తుమకూరు జిల్లా లక్కినహళ్లి గ్రామంలో సనాతన ధర్మాన్ని పాటించే సంప్రదాయ కుటుంబం. సుధ పుట్టి పెరిగిందంతా మహారాష్ట్రలో. ఆమెది మరాఠీ క్షత్రియ కుటుంబం.



దారులు ఒక్కటయ్యాయి...

'పేద మహిళల సాధికారత కోసం సుధ అంకితభావం నన్ను ఎంతో ఆకట్టుకుంది' అంటారు మోహన్. 1990ల్లో మోహన్ 'హాల్'లో పని చేసేవారు. 'ఆ సమయంలోనే వాలంటీర్లుగా వెళ్లినప్పుడు మా ఇద్దరికీ పరిచయం అయింది. పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ మోహన్ నాకు ఉత్తరాలు రాసేవారు. వారి కోసం తనవంతు సాయం అందించడానికి ఎప్పుడూ ముందుంటానని చెప్పేవారు. అలా ఇరువురి భావాలే కాదు... దారులూ ఒక్కటయ్యాయి. తరువాత ఎన్నో ప్రజా ఉద్యమాల్లో కలిసి పాలు పంచుకున్నాం. మా ఇద్దరి బంధం బలపడడానికి అది దోహదపడింది' అంటారు సుధ.

జంటగా జీవిద్దామని...

అయిదేళ్ల తమ ప్రేమానుబంధాన్ని పెళ్లితో జీవిత కాల బంధంగా మార్చుకొందామని అనుకున్నారు సుధ, మోహన్. అయితే మనసులో మాట తొలుత బయట పెట్టింది మాత్రం మోహనే. ఒక శుభ ముహూర్తాన... సుధకు తన ప్రేమ గురించి చెప్పారు మోహన్. కానీ అయిదేళ్ల తరువాత, అంటే 2002లో మాత్రమే ఓకే చెప్పారు సుధ. 'ఆ క్షణం సుధ కళ్లల్లో మెరుపులు నాకు ఇప్పటికీ గుర్తే. ఆమె నా ప్రేమను అంగీకరించినప్పుడు నాకు నోట మాట రాలేదు. ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను' అంటారు మోహన్. ఆ తరువాత పెళ్లి చేసుకొందామని ఇరువురూ ఒక నిర్ణయానికి వచ్చారు. తేదీ కూడా అనుకున్నారు. కానీ అనేక కారణాలు అందుకు అవరోధమయ్యాయి. అప్పటికి ఇద్దరూ ప్రజా ఉద్యమాల్లో మునిగిపోయి ఉన్నారు. తమ గురించి తాము ఆలోచించుకొనే సమయమే దొరకలేదు. దానికితోడు మోహన్ కుటుంబ నుంచి వ్యతిరేకత ఎదురైంది. ప్రాంతం, నేపథ్యం, కులం తదితర సామాజిక అంశాలూ అవరోధంగా మారాయి. వీటన్నిటి కారణంగా ఎప్పటికప్పుడు పెళ్లిని వాయిదా వేసుకొంటూ వచ్చారు. పరిస్థితులు చక్కబడేవరకూ వేచివుందామని సుధ, మోహన్ అనుకున్నారు.

ముహూర్తం కుదిరింది...

నిజమైన ప్రేమ ఎప్పటికైనా జయిస్తుందనడానికి సుధ, మోహన్‌కుమార్‌ల కథే ఒక ఉదాహరణ. అంతేకాదు... ప్రేమకు వారు నిర్వచనంగా నిలిచారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, కాలం కఠిన పరీక్షలు పెట్టినా... అన్నిటినీ ప్రేమతో జయించారు. సహనం ప్రదర్శించి తమదైన రోజు కోసం ఎదురు చూశారు. చివరకు ఆ రోజు రానే వచ్చింది. ఇటీవలే వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు. చిక్‌మగళూరులో పాతికేళ్ల వారి ప్రణయాన్ని పరిణయంగా మార్చుకున్నారు. జీవిత భాగస్వాములు అయ్యారు. ఈ పెళ్లి జరగడంలో ప్రధాన పాత్ర పోషించింది మాత్రం మోహన్ మిత్రుడు హర్ష, సుధ స్నేహితురాలు సునీత. 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్'లో వీరు ఈ జంటకు పరిచయమయ్యారు.

మనిషిగా స్పందిస్తున్నాం...

సుధ, మోహన్... ఇరువురి వయసు ఒక్కటే... 54 సంవత్సరాలు. 'సేవా కార్యక్రమాల్లో ఎంతగా మునిగితే మాత్రం... ఇన్నేళ్లు పెళ్లిని వాయిదా వేయాలా' అని సన్నిహితులు ఎన్నోసార్లు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. 'మనిషిగా పుట్టి, తోటి మనిషి బాగు కోసం మనవంతు కృషి చేయపోతే ఇక జీవితానికి అర్థం ఏముంటుంది' అంటూ సున్నితంగా వారికి బదులిచ్చేవారు ఈ జంట. నిజమే... కొన్నిసార్లు సుధ ఒక కార్యక్రమంలో ఉంటే మోహన్ మరో ఉద్యమంలో నడిచేవారు. స్వప్రయోజనం కంటే సమాజ శ్రేయస్సు ముఖ్యమనుకున్నారు. 'ఒకసారి అటవీ శాఖ అధికారులు ఒక పత్తి రైతును, అతని భార్యను వారి భూమి నుంచి నిర్దాక్షిణ్యంగా గెంటేశారు. వారి తరుఫున మేం పోరాడాం. సదరు అధికారులతో క్షమాపణలు చెప్పించి, వారి భూమి వారికి తిరిగి వచ్చేలా చేశాం' అని సుధ తమ ఉద్యమంలో ఒక పేజీని గుర్తు చేసుకున్నారు. అంతేకాదు... గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది మహిళలకు స్వయంసహాయక సంఘాల ఏర్పాటులో తోడ్పాటు అందించారు సుధ. ఆమె తండ్రి గణేష్‌రావు స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయనే ఆమెకు స్ఫూర్తి. మోహన్ తండ్రి, బాబాయిలు పాఠశాల కోసం గ్రామంలోని తమ భూమిని విరాళంగా ఇచ్చారు. ఉన్నతాశయం గల వీరిద్దరూ ఒక అనాథ పిల్లవాడిని తెచ్చి పెంచుకోవాలని నిర్ణయించుకున్నారు. స్ఫూర్తిమంతమైన వీరి కథ కర్ణాటకలో ఎంతోమందిని కదిలించింది.

సరైన ప్రణాళిక అనుసరిస్తే వ్యవసాయాన్ని మించిన గొప్ప ఉపాధి మరొకటి ఉండదంటారు సీమా మిశ్రా. కుటుంబ బాధ్యతల కోసం ఆమె కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలేసి పల్లె బాట పట్టారు. ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానంతో తమ పొలంలో లాభాల పంట పండించడంతోపాటు... యువతకు, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి, వ్యవసాయంవైపు మళ్ళేలా ప్రోత్సహిస్తున్నారు.



సాగు బాట... స్ఫూర్తి ప్రదాత

"మాది ఒడిశా రాష్ట్రం పూరీ జిల్లాలోని రాండియా గ్రామం. తరతరాలుగా వ్యవసాయ కుటుంబం. పెద్దగా చదువుకున్నవారు లేరు. కానీ మా తాతయ్య నా ఆసక్తిని గమనించి... నన్ను బాగా చదివించారు. ఢిల్లీ యూనివర్సిటీలో ఎంబిఏ చేశాను. టిసిఎస్‌లో మంచి జీతంతో ఉద్యోగం దొరికింది. అన్నీ సజావుగా సాగిపోతున్నాయనుకున్న దశలో... 2015లో తాతయ్య మరణించారు. మా ఇంటి వ్యవహారాలన్నీ తాతయ్యే చూసేవారు. ఆయన లేకపోవడంతో ఆ బాధ్యతలన్నీ నేను తీసుకోవాల్సి వచ్చింది. ఉద్యోగానికి రాజీనామా చేసి మా ఊరు వచ్చేశాను. అయితే ఇంట్లోనే కూర్చోవడం, అప్పటివరకూ సంపాదిస్తున్న నేను కుటుంబం మీద ఆధారపడడం ఇబ్బందిగా అనిపించింది. మా ఊళ్ళో వ్యవసాయం తప్ప మరే ఉపాధి మార్గం లేదు. అందుకే మాకున్న పొలంలో సొంతంగా వ్యవసాయం చెయ్యాలని నిర్ణయించుకున్నాను. ఇంట్లో ఈ సంగతి చెబితే... "మా ఇబ్బందులేవో మేం పడతాం. నువ్వు ఉద్యోగం చేసుకో" అన్నారు. అది నాకు ఇష్టం లేదని మా వాళ్ళకు నచ్చజెప్పాను. ఆ తరువాత... మా ప్రాంతంలో సాగు పద్ధతులను నిశితంగా పరిశీలించడం ప్రారంభించాను.

పూర్తి సేంద్రియంగా...

ఎన్నో ఏళ్ళుగా ఒకే పంటను వేయడం, వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త పద్ధతులను అనుసరించకపోవడం లాంటివి దీనికి కారణాలని నాకు అర్థమయింది. పూరీ, భువనేశ్వర్ నగరాల్లో వ్యవసాయ నిపుణులతో మాట్లాడిన తరువాత... 'ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్'ను ప్రయోగాత్మకంగా చేపడితే మంచి ఫలితాలు ఉంటాయనిపించింది. కోళ్ళ పెంపకంలో శిక్షణ తీసుకొని... రెండువందల కోడి పిల్లలతో పౌల్ట్రీ ఏర్పాటు చేశాను. ఆ తరువాత పండ్లు, పూలు, కూరగాయల తోటలు వేశాను. అనంతరం కోళ్ళు, మేకలు, గొర్రెల పెంపకం చేపట్టాను. ఒక చోట నష్టం వచ్చినా... దాన్ని మరో చోట భర్తీ చేసుకోవచ్చనేది నా ఆలోచన. ఏడాది తరువాత... మంచి లాభాలు వచ్చాయి. దాంతో చేపలు, పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం మొదలుపెట్టాను. అలాగే ఆవులు, గేదెలతో డెయిరీ కూడా ఏర్పాటు చేశాను. వాటి నిర్వహణలో అధునాతనమైన పద్ధతులు అనుసరించాను. డెయిరీలో వ్యర్థాలను పంట పొలాలకు ఎరువుగా వాడుకోవడం లాంటి చర్యలతో ఖర్చు తగ్గింది. 'నూరు శాతం సేంద్రియం, సున్నా శాతం వ్యర్థాలు' అనేది లక్ష్యంగా పెట్టుకున్నాను. వీటన్నిటికోసం... కూరగాయల సాగు, హార్టికల్చర్, చేపలు, పశువుల పెంపకం, వ్యవసాయ వ్యర్థాలను దాణాగా, సేంద్రియ ఎరువుగా మార్చడం... ఇలా ప్రతిదీ నేర్చుకున్నాను. నన్ను చూసి తోటి రైతులు కూడా ఈ తరహా సాగు చేయడానికి ముందుకు వచ్చారు. అయితే పొలాల్లో పని చేసేవారు దొరక్క సమస్య ఎదురయింది.

శిక్షణ, సహాయం, మార్కెటింగ్...

వ్యవసాయం లాభదాయకం కాదనే ఆలోచనతో... యువత పట్టణాల బాట పడుతున్నారు. అక్కడ కూడా వాళ్ళు అరకొర ఆదాయాలతోనే బతకాల్సి వస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో వ్యవసాయ కార్మికులకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. పల్లెల్లో పొలాలు బీడువారి... క్రమంగా నివాస ప్రాంతాలుగా మారిపోతాయి. ఆహార సంక్షోభానికి దారితీస్తున్న కారణాల్లో ఇదొకటని ఇప్పటికే నిపుణులు హెచ్చరిస్తున్నారు కూడా. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో పెట్టుకొని... చుట్టుపక్కల గ్రామాల్లోని యువతకు, ఆసక్తి ఉన్న రైతులకు ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌లో శిక్షణనివ్వడం ప్రారంభించాను. దీనికోసం ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలతో ఒక నెట్ వర్క్ ఏర్పాటు చేశాను. అర్హులకు సబ్సిడీపై తేనెటీగల పెట్టెలు, ఆవులు, గేదెలు, కోళ్ళు, మేకలు మంజూరు కావడానికి, వారి ఉత్పత్తుల మార్కెటింగ్‌కూ దోహదం చేస్తున్నాను.

'బాంబూ బ్రిడ్జ్ హెరిటేజ్ పార్క్' పేరిట వ్యవసాయ అభ్యాసన కేంద్రాన్ని స్థాపించి... ఇప్పటివరకూ ఎన్నో శిక్షణ తరగతులు నిర్వహించాను. వీటిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆదర్శ రైతులు పాల్గొని... అధునాతన సాగు పద్ధతులను బోధిస్తారు. వ్యవసాయాన్ని లాభసాటి కెరీర్‌గా మార్చుకోవడంపై సలహాలు ఇస్తారు. ప్రధానంగా మహిళలు, యువత వీటి ద్వారా ప్రయోజనం పొందుతున్నారు.



"'బాంబూ బ్రిడ్జ్ హెరిటేజ్ పార్క్' పేరిట వ్యవసాయ అభ్యాసన కేంద్రాన్ని స్థాపించి... ఇప్పటివరకూ ఎన్నో శిక్షణ తరగతులు నిర్వహించాను. వీటిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆదర్శ రైతులు పాల్గొని... అధునాతన సాగు పద్ధతులను బోధిస్తారు. వ్యవసాయాన్ని లాభసాటి కెరీర్‌గా మార్చుకోవడంపై సలహాలు ఇస్తారు."

వినూత్న కార్యక్రమాలు...

ఈ ఏడాది 'ఎకో-అగ్రి టూరిజం', 'పొలం నుంచి పళ్ళెంలోకి' అనే వినూత్నమైన కార్యక్రమాలను ప్రారంభించాను. ఎవరైనా మా పొలాల్లోకి వచ్చి... వ్యవసాయం గురించి తెలుసుకోవచ్చు. తాజా సేంద్రియ ఉత్పత్తులను కొనుక్కోవచ్చు. దీనికి మంచి స్పందన లభిస్తోంది. వ్యవసాయ శిక్షకురాలుగా, వక్తగా, మహిళా పారిశ్రామిక వేత్తగా... పలు సంస్థలు నన్ను సత్కరించాయి. కార్పొరేట్ ఉద్యోగం కన్నా ఆదాయం కూడా ఎక్కువగానే ఉంది. అయితే... మా ప్రాంతంలోని రైతులు... ప్రధానంగా మహిళలు అధిక ఆదాయం పొందడానికి నా ప్రయత్నాలు తోడ్పడడం, నేనే యాభై మందికి పైగా మహిళలకు ఉపాధి కల్పించడం, యువతను వ్యవసాయం వైపు ఆకర్షించేలా చేయడం... వీటివల్ల కలిగే సంతృప్తికి మరేదీ సాటిరాదు."

హోమియోతో మూత్రపిండాల మరమ్మతు

డాక్టర్! మూత్రపిండాల సమస్యలకు హోమియోపతిలో పరిష్కార మార్గాలున్నాయా? అల్లోపతి మందులు వాడుకుంటూ, హోమియో మందులు కూడా వాడుకోవచ్చా?

- ఓ సోదరి, హైదరాబాద్



కిడ్నీలు దెబ్బతిన్నాయని తెలియగానే, ఇక జీవితమంతా డయాలసిస్‌తోనే గడపాలనేది చాలా మంది భావన. క్రియాటిన్ నిల్వలు మరీ ఎక్కువగా పెరిగినప్పుడు తాత్కాలికంగా డయాలిసిస్ అవసరమే కావచ్చు. కానీ, హోమియోపతిని ఆశ్రయిస్తే, ఎప్పటికీ డయాలసిస్ మీదే ఆధారపడవలసిన అవసరం ఉండదు. దెబ్బతిన్న కిడ్నీలను మళ్లీ నార్మల్ స్థితికి తీసుకు వచ్చే వైద్య చికిత్సలు హోమియోపతిలో ఉన్నాయి. ముఖ్యంగా, క్రియాటిన్ నిల్వలు పెరిగిన విషయాన్ని ముందే గమనించి వెంటనే వైద్య చికిత్సలు తీసుకుంటే, ఆ నిల్వలు, ఇంకా పెరగకుండా ఆగడంతో పాటు మూత్రపిండాల పనితీరు తిరిగి మామూలు స్థితికి వచ్చే అవకాశాలుంటాయి.

విషమించినప్పుడు?

పరిస్థితి డయాలసిస్‌కు దారి తీయడానికి నెఫ్రాన్లు దెబ్బతినడమే కారణం కాబట్టి, హోమియో చికిత్సతో నెఫ్రాన్లను రిపేర్ చేయడం ద్వారా, కిడ్నీలను పూర్వస్థితికి తీసుకురావచ్చు. అయితే కిడ్నీలు అప్పటికే 70 లేదా 80 శాతానికి మించి పాడైపోయి ఉంటే, డయాలసిస్ తప్పనిసరి అవుతుంది. అలాంటప్పుడు డయాలసిస్ చేయించుకుంటూనే హోమియో మందులు తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల డయాలసిస్‌తో ఎదురయ్యే దుష్ప్రభావాలు బాగా తగ్గుతాయి. దీనికి తోడు డయాలసిస్‌కూ డయాలసిస్‌కూ మధ్య ఉండే కాలవ్యవధి కూడా పెరుగుతుంది.

తగు జాగ్రత్తలతో...

క్రియాటిన్ నిల్వలు 7, 8కి చేరుకున్నప్పటికీ, హోమియో చికిత్సతో నార్మల్ స్థితికి వచ్చిన వాళ్లున్నారు. అయితే ఆ ఫలితం వైద్యులతో పాటు రోగి మీద కూడా ఆధారపడి ఉంటుంది. మధుమేహం, అధిక రక్తపోటు కారణంగా కిడ్నీలు దెబ్బ తిన్న వాళ్లు నిరంతరం వాటిని అదుపులో ఉంచుకోవాలి. ఆహారశైలి, జీవన శైలి నియమాలను కచ్చితంగా పాటించాలి. ఏ ఆహార పదార్థాలతో కిడ్నీలు దెబ్బతినే అవకాశాలుంటాయో తెలుసుకోవడానికి డైటీషియన్ సలహాలూ, సూచనలూ తీసుకోవడం కూడా అవసరమే!

- డాక్టర్ ఎస్. రామ్మోహన్ రెడ్డి
హోమియో ఫిజీషియన్, హైదరాబాద్.

డ్రై ఫ్రూట్స్ తినటం ఇలా...



మన శరీరానికి మేలు చేసే పోషకాహారాలలో డ్రై ఫ్రూట్స్ ఎంతో ముఖ్యమైనవి. వీటిని ఎలా తింటే పోషకాలు సమృద్ధిగా అందుతాయో... ఎక్కువ ప్రయోజనం పొందవచ్చో తెలుసుకుందాం.

వేడి శరీర తత్వం ఉన్నవారు...

కిస్మిస్, అంజీర్ వంటివి చలవ చేస్తాయి. అందువల్ల వేడి శరీరతత్వం ఉన్నవారు వీటిని తినటం మంచిది.

చల్లటి శరీర తత్వం ఉన్నవారు...

పిస్తా, బాదం వంటివి శరీరంలో వేడిని పెంచుతాయి. ఒళ్లు నొప్పులు, నడుము, మెడ నొప్పులు ఉన్నవారు... ఆస్తమా వంటి సమస్యలు ఉన్నవారు వీటిని తింటే మంచిది.

డ్రై ఫ్రూట్స్‌ని బాగా నమిలి తినడంవల్ల వాటిలో ఉండే పోషక పదార్థాలు, పీచు పదార్థాలు శరీరానికి పూర్తిగా అందుతాయి. అందువల్ల వీలైనంతవరకు వాటిని పొడర్ లేదా పేస్ట్ రూపంలో తీసుకోకపోవటం మంచిది.

ప్రాచీన భారతీయ జానపద చిత్రలేఖనం, కళాత్మక శైలులు నేటికీ భారతదేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రశంసలందుకుంటూ ఉండడానికి కారణం ఆ చిత్రకళలు, మహిళల మనసులను ఆకట్టుకునే చీరలను అలంకరించడమే! జానపద చిత్ర శైలులతో మగువల మనసులను గెలుచుకుంటున్న ఆ చీరలు ఇవే!

ఫ్యాషన్

చీరల్లో చిత్రాలు



మధుబని

ఈ చిత్రకళకు మిథిల కళ అనే మరో పేరు కూడా ఉంది. ఒకప్పుడు నేపాల్‌లో ఉన్న జనక సామ్రాజ్యం (రామాయణంలో పేర్కొన్న సీతమ్మ వారి తండ్రి) నేటి బీహార్ పరిధిలోకి చేరుకుంది. మధుబని కళకు పుట్టినిల్లైన ఈ ప్రాంతానికి చెందిన మధుబని కళ... పువ్వులు, లతలు, దేవతామూర్తుల చిత్రాలతో కూడిన వాల్ మ్యూరల్స్‌తో ప్రసిద్ధి పొందింది. ఇప్పుడీ చిత్రకళలే చీరలకెక్కి, మధుబని చీరలుగా పేరు పొందుతున్నాయి.



తంజావూరు

తంజావూరు పెయింటింగ్స్ గురించి తెలియని వారుండరు. క్రీ.శ 1600 సంవత్సరంలో ఉద్భవించిన తంజోర్ లేదా తంజావూరు చిత్రకళను తంజావూరు నాయకులు ప్రోత్సహించారు. బంగారు రేకులు ఉపయోగించడం మూలంగా తంజావూరు చిత్రలేఖనాలు రెట్టింపు ఆకర్షణీయంగా కనిపిస్తూ ఉంటాయి. ఇదే రకమైన చిత్రశైలిలో తంజావూరు చీరలు కూడా రూపొందుతున్నాయి. నెమలి పింఛం డిజైన్లను కలిగి ఉండే తంజావూరు చీరలు, ప్రపంచవ్యాప్త మహిళలను కూడా ఆకట్టుకుంటున్నాయి



గోండు

మధ్యప్రదేశ్‌లోని గోండి తెగ చిత్రకళకు ప్రకృతే ప్రేరణ. ఆకర్షణీయమైన రంగులతో కూడిన లతలు, పువ్వులు గోండు చిత్రాల్లో కనిపిస్తాయి. ఇదే చిత్రశైలితో రూపొందిన కాటన్ చీరలు ప్రత్యేకతను చాటుకుంటూ సర్వత్రా ప్రశంసలు అందుకుంటూ ఉండడం విశేషం.



చేర్యాల

తెలంగాణాలోని చేర్యాలలో పుట్టిన ఈ కళ నక్షి కుటుంబాలకే సొంతం. తంజావూరు, మైసూరు పెయింటింగ్‌లకు సమీపంగా ఉండే ఈ చిత్రకళ గ్రామీణ నేపథ్యాలను ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఇదే శైలిని అనుసరిస్తూ రూపొందుతున్న చేర్యాల చీరలు కూడా అంతే మనోహరంగా మహిళల మనసులను దోచుకుంటున్నాయి.



కలంకారి

కలంకారి అంటే కలంతో బొమ్మలు గీయడమని అర్థం. ఈ కళ ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రాంతాల్లో ప్రసిద్ధి పొందింది. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, శ్రీకాళహస్తి కలంకారి కళకు పేరు పొందాయి. ఈ చిత్ర శైలిలో రూపొందుతున్న కాటన్, పట్టు చీరలు సర్వత్రా మహిళల ఆదరణ పొందుతూనే ఉన్నాయి. పువ్వులు, లతలు, జీవనవిధానాలను ప్రతిబింబించే కలంకారి చిత్రకళ కంటికింపైన రంగులతో అలరిస్తూ ఉండడం విశేషం!



సింధు ఇంటి దారి

జకార్తా: ఇండోనేసియా ఓపెన్‌లో ఏస్ షట్లర్ పీవీ సింధుకు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో సింధు 15-21, 21-16, 14-21తో వెన్ చి (చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరో మ్యాచ్‌లో రచనోక్ ఇంటనాన్ 18-21, 6-21 స్కోరుతో ఆకర్షి కశ్యప్‌ను ఓడించింది. మహిళల డబుల్స్ మొదటి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో 21-15, 21-15తో కెనడాకు చెందిన జేకీ డెంట్-క్రిస్టల్ లాపై గెలిచి ముందంజ వేసింది. కాగా, రితుపర్ణ పాండా-శ్వేతపర్ణ పాండా జోడీ 12-21, 9-21తో కొరియాకు చెందిన కిమ్ సో యియాంగ్-కాంగ్ హి చేతిలో పరాజయం పాలైంది.

నా చివరి మ్యాచ్‌గా కాదు..

వరల్డ్ కప్ క్వాలిఫయర్‌గా ప్రాధాన్యమివ్వాలి

కువైట్‌తో పోరుపై సునీల్ ఛెత్రి



కోల్‌కతా : కెరీర్‌లో తనకు చివరి మ్యాచ్ కావడం వల్ల.కువైట్‌తో భారత్ గురువారం ఆడే మ్యాచ్‌కు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని భారత జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి అన్నాడు. ఇది కీలకమైన.వరల్డ్ కప్ క్వాలిఫికేషన్ పోరని, ఆ కోణంలోనే ఆ మ్యాచ్‌కు ప్రాధాన్యమని స్పష్టంజేశాడు. ఈ మ్యాచ్‌లో కనుక విజయం సాధిస్తే క్వాలిఫికేషన్ పోరులో మూడో రౌండ్‌కు భారత జట్టు అర్హత సాధిస్తుంది. ఇక కువైట్‌తో ఈ మ్యాచ్ తన ఫుట్‌బాల్ కెరీర్‌లో ఆఖరిదని గత నెలలో ఛెత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో 19 ఏళ్ల అతడి సుదీర్ఘ కెరీర్‌కు గురువారంతో తెరపడనుంది.

వరల్డ్ కప్ మ్యాచ్ సమయాలు

భారత ఫ్యాన్స్‌కు అనుకూలంగా..

బార్బడోస్ : భారత్‌లో క్రికెట్ అభిమానులను దృష్టిలో పెట్టుకొని ఈసారి టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌ల సమయాలను నిర్ణయించినట్టు వెస్టిండీస్ క్రికెట్ బోర్డు (డబ్ల్యూఐసీబీ) సీఈవో జానీ గ్రేవ్ వెల్లడించాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి సింహభాగం ఆదాయం భారత మార్కెట్‌నుంచే సమకూరుతుందని గుర్తు చేశాడు. అందువల్ల భారత అభిమానుల వీక్షణకు అనుగుణంగా మ్యాచ్ సమయాలను నిర్ణయించడంలో తప్పులేదన్నాడు.

పారాలింపిక్స్‌కు
మన షట్లర్లు 13 మంది క్వాలిఫై

న్యూఢిల్లీ : డిఫెండింగ్ చాంపియన్ కృష్ణ నాగర్ సహా మొత్తం 13 మంది భారత షట్లర్లు పారిస్ పారాలింపిక్స్‌కు అర్హత సాధించారు. తొమ్మిది విభాగాల్లో వీరు తలపడతారని ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య బుధవారం తెలిపింది. వచ్చే ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు ఎనిమిది వరకూ జరిగే పారాలింపిక్స్‌లో 16 విభాగాల్లో (12 సింగిల్స్, నాలుగు డబుల్స్) పోటీలు నిర్వహిస్తారు. ఈసారి పారాలింపిక్స్‌లో కొత్త మూడు విభాగాలను ప్రవేశపెట్టారు. 2020 టోక్యో పారాలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో భారత్ రెండు స్వర్ణాలు, ఒక్కో రజత, కాంస్య పతకం సాధించింది.

బోణీ అదిరింది..!

● రోహిత్ అర్ధ శతకం ● చెలరేగిన పేసర్లు
● 8 వికెట్లతో టీమిండియా ఘన విజయం
● ఐర్లాండ్ చిత్తు



న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్‌ను భారత జట్టు భారీ విజయంతో ఆరంభించింది. రోహిత్ శర్మ (37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52 రిటైర్డ్ హర్ట్) అర్ధ శతకంతోపాటు పేసర్లు అదరగొట్టడంతో.. గ్రూప్-ఎలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. తొలుత ఐర్లాండ్ 16 ఓవర్లలో 96 పరుగులకు కుప్పకూలింది. గారెత్ డిలానె (26) టాప్ స్కోరర్. హార్దిక్ పాండ్యా 3 వికెట్లు పడగొట్టగా.. బుమ్రా, అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. అనంతరం ఛేదనలో భారత్ 12.2 ఓవర్లలో 97/2 స్కోరు చేసి గెలిచింది. రిషభ్ పంత్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36 నాటౌట్) రాణించాడు. అడైర్, వైట్ చెరో వికెట్ పడగొట్టారు. పొదుపుగా బౌలింగ్ చేసిన బుమ్రా (2/6)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సునాయాసంగా కొట్టేశారు..: స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్ కోహ్లీ (1) విఫలమైనా.. రోహిత్ శర్మ హాఫ్ సెంచరీతో ముందుండి నడిపించాడు. పంత్‌తో కలిసి రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించడంతో టీమిండియా అలవోకగా నెగ్గింది. రెండో ఓవర్‌లో లిటిల్ బౌలింగ్‌లో 4,6 బాదిన రోహిత్ మొత్తం 15 రన్స్ రాబట్టాడు. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో అడైర్ బౌలింగ్‌లో కోహ్లీ భారీ షాట్ ఆడే క్రమంలో క్యాచవుటయ్యాడు. దీంతో తొలి వికెట్‌కు 22 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పంత్.. వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. దీంతో పవర్‌ప్లేలో భారత్ 39/1తో నిలిచింది. పదో ఓవర్‌లో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రోహిత్ 76/1 స్కోరు వద్ద రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. విజయానికి 6 పరుగులు కావాల్సి ఉండగా సూర్యకుమార్ (2)ను వైట్ అవుట్ చేశాడు. అయితే, సిక్స్ బాదిన పంత్.. మరో 46 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు.


రోహిత్
(52 రిటైర్డ్ హర్ట్)

పెవిలియన్‌కు క్యూ..: బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై టీమిండియా పేసర్లు చెలరేగడంతో.. ఐర్లాండ్ బ్యాటింగ్ పేకమేడను తలపించింది. 50/8తో ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగదనుకొన్న సమయంలో.. డిలానె ఆదుకోవడంతో కనీసం వంద పరుగుల మార్క్‌కైనా చేరువైంది. జోష్ లిటిల్ (14)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 27 పరుగులు జోడించిన డిలానె.. బెన్ వైట్ (2 నాటౌట్)తో కలిసి పదో వికెట్‌కు 19 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన లిటిల్‌ను బుమ్రా బౌల్డ్ చేశాడు. అయితే, అర్ష్‌దీప్ వేసిన 16వ ఓవర్‌లో 4,6,4తో గేర్ మార్చిన డిలానె.. ఫ్రీహిట్ బాల్‌కు రనౌట్ కావడంతో ఐర్లాండ్ ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్‌ను అర్ష్‌దీప్ ఆరంభంలోనే దెబ్బకొట్టాడు. మూడో ఓవర్‌లోనే ఓపెనర్లు పాల్ స్టిర్లింగ్ (2), ఆండ్రూ బాల్‌బిర్నీ (5)లను అవుట్ చేశాడు. మధ్య ఓవర్లలో హార్దిక్ పాండ్యా కూడా విజృంభించడంతో ఐరిష్ టీమ్ కోలుకోలేకపోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన టకర్ (10)ను పాండ్యా పెవిలియన్ చేర్చగా.. టెక్టర్ (4)ను బుమ్రా క్యాచవుట్ చేశాడు. తర్వాత హార్దిక్ బౌలింగ్‌లో క్యాంఫర్ (12) అవుటయ్యాడు. ఆ వెంటనే జార్జ్ డాక్రెల్ (3)ను సిరాజ్ పెవిలియన్ చేర్చడంతో 10 ఓవర్లు ముగిసే సరికి ఐర్లాండ్ 49/6తో నిలిచింది. అడైర్ (3)ను పాండ్యా అవుట్ చేయగా.. మెకార్తీ (0)ని అక్షర్ అద్భుతమైన రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు.

రోహిత్‌కు గాయం?

మ్యాచ్ మధ్యలో రోహిత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. లిటిల్ వేసిన 9వ ఓవర్ రెండో బంతి శర్మ కుడి చేతిని తాకింది. కానీ, ఆ తర్వాతి ఓవర్ ముగిశాక ఫిజియోతో కలసి మైదానం వీడాడు. దీంతో ఆదివారం పాకిస్థాన్‌తో మ్యాచ్ ఉండడంతో.. రోహిత్‌కు ఏదైనా గాయమైందనే ఆందోళన ఫ్యాన్స్‌లో వ్యక్తమవుతోంది. పంత్ మోచేతికి కూడా బంతి బలంగా తగిలింది.

1 అత్యధిక విజయాలు సాధించిన టీ20 కెప్టెన్‌గా ధోనీ (43 మ్యాచ్‌లు)తో సమంగా రోహిత్.

4 మిగిలి ఉన్న బంతుల పరంగా (46) టీమిండియాకు ఇది నాలుగో అతిపెద్ద విజయం. స్కాట్లాండ్ (81 బంతులు), బంగ్లా (64), యూఏఈ (59)పై భారత్ భారీ గెలుపులను నమోదు చేసింది.

8 టీ20ల్లో ఐర్లాండ్‌పై టీమిండియాకు ఇది వరుసగా 8వ విజయం

నేటి మ్యాచ్‌లు

పపువా న్యూగినీ × ఉగాండా (ఉ.5 గం.)
ఆస్ట్రేలియా × ఒమన్ (ఉ.6 గం.)
పాకిస్థాన్ × అమెరికా (రాత్రి 9 గం.)

స్కోరుబోర్డు

ఐర్లాండ్: బాల్‌బిర్నీ (బి) అర్ష్‌దీప్ 5, స్టిర్లింగ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 2, టకర్ (బి) హార్దిక్ 10, టెక్టర్ (సి) విరాట్ (బి) బుమ్రా 4, క్యాంఫర్ (సి) పంత్ (బి) హార్దిక్ 12, డాక్రెల్ (సి) బుమ్రా (బి) సిరాజ్ 3, డిలానె (రనౌట్-సిరాజ్/పంత్) 26, అడైర్ (సి) దూబే (బి) హార్దిక్ 3, మెకార్తి (సి అండ్ బి) అక్షర్ 0, లిటిల్ (బి) బుమ్రా 14, బెన్ వైట్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 15, **మొత్తం: 16 ఓవర్లలో 96 ఆలౌట్;** **వికెట్ల పతనం:** 1-7, 2-9, 3-28, 4-36, 5-44, 6-46, 7-49, 8-50, 9-77, 10-96; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-2, సిరాజ్ 3-0-13-1, బుమ్రా 3-1-6-2, హార్దిక్ 4-1-27-3, అక్షర్ 1-0-3-1, జడేజా 1-0-7-0.

భారత్: రోహిత్ (రిటైర్డ్ హర్ట్) 52, విరాట్ (సి) వైట్ (బి) అడైర్ 1, పంత్ (నాటౌట్) 36, సూర్యకుమార్ (సి) డాక్రెల్ (బి) వైట్ 2, శివమ్ దూబే (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు: 6, **మొత్తం: 12.2 ఓవర్లలో 97/2;** **వికెట్ల పతనం:** 1-22, 1-76, 2-91; **బౌలింగ్:** అడైర్ 4-0-27-1, లిటిల్ 4-0-42-0, మెకార్తి 2.2-0-18-0, క్యాంఫర్ 1-0-4-0, వైట్ 1-0-6-1.


మిరా ఆంద్రీవా
ఫ్రెంచ్ ఓపెన్

సబలెంకా, రిబకినాకు షాక్

పారిస్ : ఫ్రెంచ్ ఓపెన్‌లో మహిళల రెండో సీడ్ అర్యానా సబలెంకా, నాలుగో సీడ్ ఎలెనా రిబకినాలకు క్వార్టర్‌ఫైనల్లో షాక్ తగిలింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ మిరా ఆంద్రీవా (రష్యా) 6-7 (5), 6-4 6-4తో సబలెంకా (బెలారస్)ని చిత్తు చేసింది. మరో క్వార్టర్‌ఫైనల్లో 12వ సీడ్ జాస్మిన్ పొలిని (ఇటలీ) 6-2, 4-6, 6-4తో రిబకినా (కజకిస్థాన్)ను ఓడించింది. గురువారం జరిగే సెమీస్‌లో పొలిని-ఆంద్రీవా అమీతుమీ తేల్చుకుంటారు. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ అల్కారజ్ 6-3, 7-6 (3), 6-3తో తొమ్మిదో సీడ్ సిట్సిపా‌స్‌ను చిత్తు చేశాడు. సెమీస్‌లో రెండో సీడ్ జానిక్ సిన్నర్‌తో అల్కారజ్ తలపడనున్నాడు.

సెమీస్‌లో బోపన్న: భారత ఆటగాడు రోహన్ బోపన్న సెమీస్ చేరాడు. క్వార్టర్‌ఫైనల్లో రెండో సీడ్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ ద్వయం 7-6 (3), 5-7, 6-1తో బెల్జియం జంట శాండెర్/జొరాన్‌పై విజయం సాధించింది.

కార్ల్‌సన్ చేతిలో ప్రజ్ఞానంద ఓటమి

స్టావాంజర్: నార్వే చెస్ టోర్నమెంట్‌లో మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో ప్రజ్ఞానంద ఓటమి పాలయ్యాడు. ఎనిమిదో రౌండ్ ప్రారంభంలో ప్రజ్ఞానంద దూకుడుగా ఆడుతూ కార్ల్‌సన్‌కు గట్టి పోటీ ఇచ్చినా ఆ తర్వాత అతడే ఉచ్చులో పడి 67వ ఎత్తులో ఓడాడు. ఈ రౌండ్ అనంతరం కార్ల్‌సన్ 14.5 పాయింట్లతో టాప్‌లో ఉండగా, అమెరికా జీఎం హికారు నకమురా 13.5 పాయింట్లతో ద్వితీయ స్థానం, ప్రజ్ఞానంద 12 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. ఇక, మహిళల విభాగంలో తమిళ జీఎం ఆర్.వైశాలి మరోసారి ఉక్రెయిన్ జీఎం అన్నా ముజిచుక్‌కు షాకిచ్చింది. హంపి చైనా జీఎం టింగ్జి లీ చేతిలో ఓడి, నిరాశపర్చింది. వెన్‌జున్ జు (చైనా) 14.5 పాయింట్లతో టాప్‌లో ఉండగా ముజిచుక్ 13 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

రెండు నెలల్లో రూ. 2150 కోట్ల సమీకరణ

» స్పైస్‌జెట్ చీఫ్ అజయ్ సింగ్



న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ రాబోయే రెండు నెలల కాలంలో 25 కోట్ల డాలర్ల మేరకు (రూ.2150 కోట్లు) నిధులు సమీకరించనున్నట్లు కంపెనీ చీఫ్ అజయ్ సింగ్ తెలిపారు. ఇటీవల కాలంలో తాము అనేక ప్రతికూలతలు ఎదుర్కొంటున్నామంటూ దాని ప్రభావంతో సంస్థను మూసివేసే కన్నా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పౌర విమానయాన కన్సల్టెన్సీ సంస్థ కాపా సదస్సులో ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు త్రైమాసికాల్లో కంపెనీ పద్దులను ప్రక్షాళన చేయనున్నట్లు తెలిపారు. ఇటీవలే స్పైస్‌జెట్ 15 కోట్ల డాలర్లు సమీకరించింది.

నిధుల సమీకరణ అవకాశాలు పరిశీలిస్తున్న ఇండిగో

వైడ్‌బాడీ విమానాల కొనుగోలుకు అయ్యే వ్యయం కోసం వివిధ మార్గాల్లో నిధుల సమీకరణ అవకాశాలను పరిశీలిస్తున్నామని ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ తెలిపారు. తమ వద్ద పుష్కలంగా నిధులుండడం ఒక సానుకూలత అని ఆయన అన్నారు. మొత్తం 30 ఎ 350-900 విమానాలకు ఆర్డర్ ఇస్తున్నామని, మరో 70 విమానాల కొనుగోలు విషయం కూడా పరిశీలిస్తున్నామని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఇండిగో వద్ద 360 విమానాలున్నాయి.

విమానయానంలో 8 శాతం వృద్ధి అంచనా

వర్తమాన ఆర్థిక సంవత్సరంలో దేశీయ విమానయానం 6 నుంచి 8 శాతం వృద్ధిని సాధిస్తుందని పౌర విమానయాన సలహా సంస్థ కాపా అంచనా వేస్తోంది. ప్రయాణికులపరంగా చూస్తే 16.1 కోట్ల నుంచి 16.4 కోట్ల మంది ప్రయాణించే ఆస్కారం ఉంది. అలాగే అంతర్జాతీయ విమానయానం కూడా 9-11 శాతం వృద్ధితో 7.5 కోట్ల నుంచి 7.8 కోట్ల ప్రయాణికులకు పెరగవచ్చునని పేర్కొంది. అలాగే లాభాల్లో ఉన్న ఇండిగో వినహా ఇతర విమానయాన సంస్థల కన్సాలిడేటెడ్ నష్టాలు 40 నుంచి 60 కోట్ల డాలర్ల మధ్య ఉండవచ్చునని పేర్కొంది.

రేపే ఆర్‌బీఐ ద్వైమాసిక సమీక్ష

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశాల్లో ప్రస్తుత ఆర్థిక స్థితిని, ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను చర్చిస్తారు. శక్తికాంత దాస్ శుక్రవారం ఎంపీసీ నిర్ణయాలను వెల్లడిస్తారు. ఈ సమావేశాల్లో కూడా ఆర్‌బీఐ కీలక రెపోరేటు తగ్గింపు జోలికి పోకపోవచ్చని ఆర్థిక నిపుణుల అంచనా. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగిస్తోంది. రిటైల్ ద్రవ్యోల్బణం ఇంకా ఐదు శాతానికి చేరువలో ఉంది. వడ్డీరేట్లు అధికంగా ఉన్నా జీడీపీ వృద్ధి జోరు మీద ఉంది. దీంతో ఆర్‌బీఐ ఈ సారి కూడా రెపోరేటు తగ్గింపు జోలికి పోకపోవచ్చని భావిస్తున్నారు.

సంస్కరణలు ఇక కత్తి మీద సామే

» పరపతి రేటింగ్ సంస్థల అంచనా

న్యూఢిల్లీ: లోక్‌సభలో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో ఇక ఆర్థిక, ద్రవ్య సంస్కరణలు ప్రభుత్వానికి కత్తి మీద సాములా మారనున్నాయి. కీలకమైన భూ సంస్కరణలు, కార్మిక చట్టాల సంస్కరణలకూ సవాళ్లు తప్పక పోవచ్చని అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థలు ఫిచ్, మూడీస్ అంచనా. దీంతో ద్రవ్యలోటు కట్టడి లక్ష్యం కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఈ సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 240 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ప్రభుత్వ మనుగడ కోసం ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ.. టీడీపీ, జేడీయూ వంటి మిత్ర పక్షాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది బీజేపీ సంస్కరణల ఏజెండాకు దెబ్బని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది.

మార్కెట్‌కు 'చంద్ర' కళ

ఎన్‌డీఏకు బాబు భరోసాతో పోటెత్తిన కొనుగోళ్లు.. సెన్సెక్స్ 2,303 పాయింట్లు అప్

» 736 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
» హెరిటేజ్ ఫుడ్స్ 20 శాతం వృద్ధి
» రూ.13.22 లక్షల కోట్ల సంపద వృద్ధి



ముంబై: ఎన్‌డీఏలోనే కొనసాగడంతోపాటు కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించడం స్టాక్ మార్కెట్ వర్గాల్లో మళ్లీ ఉత్సాహాన్ని నింపింది. దాంతో ఇన్వెస్టర్లు ఆందోళన వీడి హుషారుగా కొనుగోళ్లు జరపడంతో సూచీలు ఉవ్వెత్తున ఎగిశాయి. మూడు శాతానికి పైగా లాభపడి మంగళవారం నాటి నష్టాలను సగానికి పైగా పూడ్చుకోగలిగాయి. బుధవారం ట్రేడింగ్ ముగిసే సరికి సెన్సెక్స్ 2,303.19 పాయింట్ల లాభంతో 74,382.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 735.85 పాయింట్ల లాభంతో 22,620.35 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ సహా పలు రంగాల షేర్లలో వేల్యూ బైయింగ్ జరగడం ఇందుకు దోహదపడింది. కొనుగోళ్ల జోరుతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.13.22 లక్షల కోట్లు పెరిగి రూ.408.06 లక్షల కోట్లకు (4.89 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

• సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీలూ లాభపడ్డాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 4.41 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.93 శాతం వృద్ధి చెందాయి. అన్ని రంగాల సూచీలూ పాజిటివ్‌గా ముగిశాయి.

• స్టాక్ మార్కెట్లో ఒడుదుడులకు సంకేతమైన ఇండియా వీఐఎక్స్ సూచీ 29.39 శాతం తగ్గి 18.89 పాయింట్లకు జారుకుంది. మంగళవారం ఈ సూచీ 50 శాతం మేర పెరిగింది.

• అదానీ గ్రూప్ కంపెనీలు పదింటిలో 9 కంపెనీల షేర్లు భారీగా పుంజుకుని మంగళవారం నాటి భారీ నష్టాలను పూడ్చుకున్నాయి. అదానీ గ్రూప్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15.57 లక్షల కోట్లుగా నమోదైంది.

హెరిటేజ్, అమరరాజా, కేసీపీ షేర్లు జూమ్

ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారీ విజయంతో చంద్రబాబునాయుడు స్థాపించిన హెరిటేజ్ ఫుడ్స్ షేరు ఏకంగా 20 శాతం ఎగబాకి సరికొత్త ఏడాది గరిష్ఠ స్థాయి రూ.546.95 వద్దకు చేరుకుంది. వరుసగా గత మూడు సెషన్లలో ఈ షేరు దాదాపు 38 శాతం పెరిగింది. అలాగే, టీడీపీ మాజీ పార్లమెంట్ సభ్యుడు గల్లా జయదేవ్‌కు చెందిన అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ షేరు 12.27 శాతం వృద్ధితో రూ.1,216కు చేరుకుంది. ఏపీ రాజధానిగా అమరావతిని పునరుద్ధరిస్తామన్న చంద్రబాబు ప్రకటనతో ఈ ప్రాంతానికి దగ్గర్లో సిమెంట్ యూనిట్ కలిగిన కేసీపీ లిమిటెడ్ షేరు 19.55 శాతం ఎగబాకి రూ.201.80 వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఈ ప్రపంచ రికార్డు

దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ (నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్) బుధవారం 1,971 కోట్ల ఆర్డర్లు, 28.55 కోట్ల ట్రేడ్స్ ప్రాసెసింగ్ ద్వారా సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించింది. ఎన్ఎస్ఈ సీఈఓ ఆశిష్ చౌహాన్ ఈ విషయాన్ని ఎక్స్‌లో (గతంలో ట్విటర్) పోస్ట్ చేశారు.

కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో వాటా విక్రయానికి అనుమతి

తన పూర్తి అనుబంధ విభాగమైన కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్‌లో 70 శాతం వాటాను జ్యూరిచ్ ఇన్సూరెన్స్ కంపెనీకి విక్రయించేందుకు ఆర్‌బీఐ ఆమోదం తెలిపిందని కోటక్ బ్యాంక్ బుధవారం వెల్లడించింది. ఈ డీల్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గతనెలలోనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్‌లో వాటా కొనుగోలు చేయబోతున్నట్లు గత నవంబరులో జ్యూరిచ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. మూలధనం సమకూర్చడంతోపాటు షేర్ల కొనుగోలు ద్వారా తొలుత 51 శాతం వాటా దక్కించుకోనున్నట్లు.. ఆ తర్వాత మూడేళ్లలో మరో 19 శాతం వాటాను రూ.5,560 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపింది. ప్రస్తుత నియంత్రణ నియమావళి ప్రకారం.. విదేశీ సంస్థలు దేశీయ బీమా సంస్థల్లో 74 శాతం వరకు వాటా కొనుగోలు చేసేందుకు అనుమతి ఉంది.

ఇక్సిగో ఇష్యూ ధరల శ్రేణి రూ.88-93

ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ఇక్సిగో మాతృసంస్థ లే ట్రావెన్యూస్ టెక్నాలజీ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈనెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. ఈ ఇష్యూ ద్వారా విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.88-93గా నిర్ణయించింది. గురుగ్రామ్‌కు చెందిన ఈ కంపెనీ ఐపీఓలో భాగంగా రూ.120 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత షేర్‌హోల్డర్లకు చెందిన రూ.620 కోట్ల విలువైన 6.66 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా ఈ కంపెనీ మొత్తం రూ.740 కోట్లు సమీకరించనుంది.

క్రోనాక్స్ ల్యాబ్ ఇష్యూకు 117 రెట్ల బిడ్లు

ప్రత్యేక రసాయనాల తయారీ సంస్థ క్రోనాక్స్ ల్యాబ్ సైన్సెస్ ఐపీఓ చివరి రోజు ముగిసేసరికి, ఇష్యూ సైజుకు 117.25 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. కంపెనీ ఆఫర్ చేసిన 66,99,000 షేర్లకు గాను 78,54,49,390 షేర్ల కొనుగోలుకు బిడ్లు దాఖలయ్యాయి.

1ప్రతికూల మార్కెట్ పరిస్థితుల కారణంగా తన అమెరికా అనుబంధ విభాగమైన నోవెలిస్ ఇంక్ ఐపీఓను వాయిదా వేసుకుందని ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ హిండాల్కో బుధవారం ప్రకటించింది. సానుకూల సమయం కోసం వేచిచూడనున్నట్లు స్పష్టం చేసింది.

పెరగనున్న బేసిక్ సర్వీస్ డీమ్యాట్ ఖాతా పరిమితి

న్యూఢిల్లీ: బేసిక్ సర్వీస్ డీమ్యాట్ ఖాతా (బీఎస్‌డీఏ) పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని సెబీ భావిస్తోంది. ప్రస్తుతం ఈ పరిమితి రూ.2 లక్షలు మాత్రమే. దీనికి సంబంధించి ఒక చర్చా పత్రం విడుదల చేసింది. సంబంధిత వర్గాలు దీనిపై తమ అభిప్రాయాలు, సూచనలు ఈ నెల 26లోపు అందజేయాలని కోరింది. ఈ పరిమితి పెంపు ద్వారా సెక్యూరిటీల మార్కెట్‌లో రిటైల్ మదుపరులు మరింత చురుగ్గా పాల్గొనేందుకు వీలవుతుందని సెబీ భావిస్తోంది. కొద్ది మొత్తాల్లో పెట్టుబడులుండే చిన్న మదుపరులపై డీమ్యాట్ చార్జీలు తగ్గించేందుకు సెబీ 2012లో బీఎస్‌డీఏను ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం బీఎస్‌డీఏ ఖాతాల్లో రూ.2 లక్షల వరకు రుణ పత్రాలు, రూ.2 లక్షల వరకు ఇతర సెక్యూరిటీలు ఉంచుకోవచ్చు. ఈ రెండింటి పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని సెబీ భావిస్తోంది.

బిజినెస్

భెల్‌కు అదానీ భారీ ఆర్డర్

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో నిర్మిస్తున్న థర్మల్ పవర్ ప్రాజెక్టుకు అవసరమైన పరికరాల కోసం అదానీ పవర్ లిమిటెడ్ నుంచి ప్రభుత్వ రంగంలోని భెల్‌కు భారీ ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ విలువ రూ.3500 కోట్లు. ఈ మేరకు ఉభయ సంస్థల మధ్య కాంట్రాక్టుపై బుధవారం సంతకాలు జరిగాయని భెల్ ఎక్స్ఛేంజిలకు పంపిన ప్రకటనలో తెలిపింది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఆ 2 x 800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు కోసం బాయిలర్, టర్బైన్, జనరేటర్లు తాము అందించాల్సి ఉంటుందని తెలియచేసింది.

ద్వితీయ శ్రేణి నగరాల్లో పెరిగిన కొలువులు

న్యూఢిల్లీ: మెట్రోపాలిటన్ నగరాలతో పోల్చితే మే నెలలో ద్వితీయ శ్రేణి నగరాల్లో నియామకాల వృద్ధి అధికంగా ఉంది. ప్రధానంగా కోచి, కోయంబత్తూర్, జైపూర్ నియామకాల కేంద్రాలుగా మారాయి. మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వాల ఉద్యోగ అనుకూల విధానాలు, విద్యావంతుల పెరుగుదల ఇందుకు కారణాలని క్వెస్ కంపెనీ ఫౌండిట్ (గతంలో మాన్‌స్టర్ ఏపీఏసీ అండ్ ఎంఈ) సీఈఓ శేఖర్ గరిశ తెలిపారు. ప్రధానంగా తయారీ (29 శాతం), ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసులు (17 శాతం), రియల్ ఎస్టేట్ 98 శాతం), విద్య (8 శాతం) రంగాలు నియామకాలకు ఊతంగా నిలిచాయని ఫౌండిట్ ఆ నివేదికలో తెలిపింది. ఇక మెట్రో నగరాల్లో కోల్కతా, ఢిల్లీ ఎన్‌సీఆర్ నియామకాల్లో అగ్రగామిగా ఉన్నాయి.

మందగించిన సేవల రంగం వృద్ధి


న్యూఢిల్లీ: దేశంలో సేవల రంగం వృద్ధి మే నెలలో ఐదు నెలల కనిష్ఠ స్థాయికి దిగజారింది. ఏప్రిల్ నెలతో పోల్చితే హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 60.8 పాయింట్ల నుంచి 60.2 పాయింట్లకు దిగజారింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72.650 ▼	66.600 ▼	96.200 ▼
ముంబై	71.990 ▲	65.940 ▲	88.530 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	450
వరంగల్	432	గోదావరి	445
చిత్తూరు	533	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147	గోదావరి	149
వరంగల్	147	విజయవాడ	149
కరీంనగర్	147	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	144
విశాఖపట్నం	135		

90 వేలకు పైగా ముగ్గురికి

పల్లా, గంటా, లోకేశ్‌కు భారీ మెజార్టీలు

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఈసారి ఎన్నికల్లో రికార్డుల మీద రికార్డులు నమోదయ్యాయి. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనంతగా పదుల సంఖ్యలో అభ్యర్థులు భారీ మెజార్టీలు సాధించారు. గాజువాక నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాస్ 95,235 ఓట్ల మెజార్టీతో వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్‌పై గెలుపొందారు. ఇక భీమిలిలో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు 92,401 ఓట్ల మెజార్టీతో వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావుపై గెలుపొందారు. మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ 91,413 ఓట్ల మెజార్టీతో వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యపై విజయం సాధించారు. పెందుర్తిలో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ 81,870 ఓట్ల మెజార్టీతో అన్నంరెడ్డి అదీప్ రాజ్‌పై గెలుపొందారు. నెల్లూరు సిటీలో నారాయణ 72,489 ఓట్ల మెజార్టీతో ఎండీ ఖలీల్ అహ్మద్‌పై గెలిచారు. కొన్ని నియోజకవర్గాలలో అభ్యర్థులు 10 వేల లోపు మెజార్టీతో బయటపడ్డారు. మడకశిరలో టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు అత్యల్పంగా 351 ఓట్ల మెజార్టీతో గెలిచారు. గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి బి.అశోక్ రెడ్డి 973 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దర్శిలో వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి 2,456 ఓట్ల ఆధిక్యంతో టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిపై గెలిచారు. రాయచోటిలో టీడీపీ అభ్యర్థి ఎం.రామ్‌ప్రసాద్ రెడ్డి 2,495, ఆలూరులో వైసీపీ అభ్యర్థి విరూపాక్షి 2,831, ధర్మవరంలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ 3,734 మెజార్టీతో బయటపడ్డారు.


లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గాజువాక అభ్యర్థి పల్లా

దెబ్బతిన్న చోటే బెబ్బులిలా..!

మంగళగిరిలో భారీ మెజారిటీతో లోకేశ్ విజయ ఢంకా.. 91వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపు

4 దశాబ్దాల తర్వాత మంగళగిరిలో పచ్చజెండా రెపరెపలు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి గెలుపొందిన వైసీపీ అభ్యర్థి విడదల రజని తిరిగి అక్కడ గెలవలేననే భయంతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి వలస వచ్చారు. ఇంతకుముందు వేమూరు నుంచి గెలిచిన వైసీపీ నాయకుడు మేరుగ నాగార్జున ఓటమిని తప్పించుకోవడానికి ఈసారి ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం వరకూ వెళ్లారు. అయితే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ విషయంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపించింది. గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసిన లోకేశ్ అప్పట్లో వైసీపీ హవా కొనసాగడంతో పరాజయాన్ని చవి చూసినప్పటికీ మరో నియోజకవర్గానికి వలస వెళ్లాలనే ఆలోచన చేయలేదు. అయితే, ఈసారి కూడా మంగళగిరిలో ఆయన్ను ఎలాగైనా ఓడించాలని తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు కుయుక్తులు పన్నారు. బీసీ కార్డును తెరపైకి తీసుకొచ్చారు. సిటింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని తప్పించి పద్మశాలి సామాజికవర్గానికి చెందిన మహిళను బరిలోకి దించినా ఓటర్లు లోకేశ్‌కే కొండంత అండగా నిలిచారు. లోకేశ్‌కు మొత్తం 1,67,710 ఓట్లు పోలవ్వగా, వైసీపీ అభ్యర్థి లావణ్యకు 76,297 ఓట్లు మాత్రమే లభించాయి. అంటే 91,413 ఓట్ల భారీ మెజార్టీతో లోకేశ్ గెలిచారు. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తరువాత తిరిగి అక్కడ టీడీపీకి విజయం దక్కింది. దీంతో అక్కడపార్టీ శ్రేణులు దీపావళిని తలపించేలా సంబరాలు చేసుకుంటున్నారు.

ఏపీలోనూ ఫోన్లు విన్నారు

» సజ్జల నేతృత్వంలో నా ఫోన్‌నూ ట్యాపింగ్ చేశారు: డొక్కా

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 5: రాష్ట్రంలోనూ ఫోన్ సంభాషణలను అక్రమంగా విన్నారని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆరోపించారు. సజ్జల నేతృత్వంలో తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని దీనిపై విచారణ జరిపించాలని డొక్కా డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాల విశ్లేషణపై బుధవారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో జన చైతన్య వేదిక నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'వైసీపీ ప్రభుత్వం కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని ఓటర్లు తిరస్కరించారు. ఘర్షణలను ప్రేరేపించడం, ప్రత్యర్థులను వెంటాడి, వేటాడటాన్ని ప్రజలు గమనించి సరైన సమయంలో సరైన తీర్పు ఇచ్చారు' అని అన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రంగయ్య, ప్రముఖ న్యాయవాది నర్రా శ్రీనివాసులు, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, దీక్షిత ఫౌండేషన్ కన్వీనర్ కృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు.

ప్రవాసాంధ్రులు పోరాట యోధులు: జయరాం

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'సొంతగడ్డపై మమకారంతో దేశ, విదేశాల నుంచి వచ్చి కూటమికి ఓటేశారు. ప్రవాసాంధ్రులు గొప్ప పోరాట యోధులు' అని టీడీపీ ఎన్ఆర్ఐ కో ఆర్డినేటర్ కోమటి జయరాం కొనియాడారు. 'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి కూటమిని గెలిపించారు. వారి త్యాగనిరతి వెలకట్టలేనిది. కూటమి విజయంలో ప్రవాసాంధ్రులు అందించిన సహకారం మరువలేనిది. రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రులు కూడా భాగస్వాములు కావాలి' అని జయరాం కోరారు.

'క్రాస్'.. తిరకాస్!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయి. ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్ల కంటే ఎంపీ అభ్యర్థికి 17,117 ఓట్లు తక్కువ వచ్చాయి.

రాజంపేట: ఈ నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ జరిగింది. రాయచోటిలో ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డికి పడిన ఓట్ల కంటే.. 6,770 ఓట్లు మిథున్‌రెడ్డికి ఎక్కువగా పోలయ్యాయి. రైల్వేకోడూరులో 2017 ఓట్లు క్రాస్ అయ్యాయి. తంబళ్లపల్లెలో 1,546, పీలేరులో 3,113, పుంగనూరులో 4,040 ఓట్లు క్రాస్ అయ్యాయి. ఎంపీ అభ్యర్థికి 97,043 క్రాస్ ఓటింగ్ జరిగింది.

బాపట్ల: చీరాల నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యకి 71,360 ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌కు 92,781 వచ్చాయి. ఎమ్మెల్యే కంటే ఎంపీ అభ్యర్థికి 21,421 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. త్రిముఖ పోరే దీనికి కారణంగా కనిపించింది. వైసీపీకి 50,802, కాంగ్రెస్‌కు 41,295 ఓట్లు పోలయ్యాయి.

కర్నూలు: కర్నూలు పార్లమెంట్ స్థానంలో ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన మెజార్టీ ఓట్లతో పోలిస్తే.. టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు 23,145 అధికంగా వచ్చాయి. ఈయనకు 6,58,914 ఓట్లు పోలయ్యాయి. వైసీపీ అభ్యర్థి బీవీ రామయ్యకు 5,47,616 వచ్చాయి. అసెంబ్లీ పరిధిలోని కర్నూలు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులకు 6,53,399 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థులకు 5,82,712 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థులకు 88,153 ఓట్ల ఆధిక్యత లభించింది. ఎంపీ, ఎమ్మెల్యేలకు వచ్చిన మెజార్టీ ఓట్లను పరిశీలిస్తే.. 23,145 ఓట్లు ఎంపీ నాగరాజుకు అధికంగా వచ్చాయి.

తిరుపతి: ఇక్కడి అన్ని అసెంబ్లీ స్థానాలూ కూటమికే దక్కినా పార్లమెంటు స్థానం మాత్రం వైసీపీ దక్కించుకుంది. అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు 1.90 లక్షల ఆధిక్యత సాధించారు. అయితే, కూటమి(బీజేపీ) ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు 14 వేలకు పైగా తేడాతో ఓటమిపాలయ్యారు. ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థుల కంటే ఎంపీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వచ్చాయి.

కడప: ఈ పార్లమెంటు స్థానానికి 13,21,975 ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో వైఎస్ అవినాశ్‌కు 6,05,143 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డికి 5,42,448 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలకు 1,41,039 ఓట్లు వచ్చాయి. 62,695 ఓట్ల మెజారిటీతో అవినాశ్‌రెడ్డి ఎంపీగా గెలిచారు. అయితే, బద్వేలు, పులివెందులలో జరిగిన క్రాస్ ఓటింగ్‌తో ఆయన గెలిచినట్లు తెలుస్తోంది.

గుంటూరు: అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ జరిగింది. తాడికొండ, తెనాలి, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ, పొన్నూరు, ప్రత్తిపాడు, మంగళగిరిలో కూటమి అభ్యర్థుల మెజారిటీ 3,37,183 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే, కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కి 3,44,695 ఓట్ల మెజార్టీ లభించింది. దీంతో 7,512 ఓట్లు అధికంగా లభించాయి.

ఒంగోలు: కూటమి టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి 48,911 ఓట్ల మెజార్టీతో గెలిచారు. అయితే, ఈ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల కన్నా 34,424 ఓట్లు తగ్గాయి. పార్లమెంట్ పరిధిలోని ఐదు సెగ్మెంట్ల పరిధిలో టీడీపీ గెలుపొందినా రెండుచోట్ల ఓడింది. గెలుపొందిన ఐదు స్థానాల్లో టీడీపీకి 91,263 ఓట్లు మెజార్టీ రాగా మిగతా రెండు స్థానాలలో వైసీపీకి 7,933 మెజార్టీ వచ్చింది. దీని ప్రకారం మాగుంటకు 83,355 ఓట్లు ఆధిక్యత రావాలి. కానీ, 48,911 మాత్రమే వచ్చింది.

అరకు: అరకు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థి తనూజారాణి, బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీతపై 50,580 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తనూజకు 4,77,005 ఓట్లు రాగా, కొత్తపల్లి గీతకు 4,26,425 వచ్చాయి. ఇక్కడ కూడా ఎంపీ స్థానానికి క్రాస్ ఓటింగ్ జరిగింది.

విజయవాడ: ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన కూటమి అభ్యర్థులకు 7,93,281 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థులకు 5,19,648 ఓట్లు వచ్చాయి. వీరి మధ్య వ్యత్యాసం 2,73633 ఓట్లు. కూటమి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన కేశినేని చిన్నికి 2,82,085 మెజారిటీ వచ్చింది. కేవలం 8 వేల మంది ఓటర్లు మాత్రమే అసెంబ్లీకి వైసీపీకి వేసి పార్లమెంటుకు టీడీపీకి వేశారు.

కాకినాడ: జనసేన ఎంపీ అభ్యర్థికి అసెంబ్లీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తో ఓట్లు తగ్గాయి. కాకినాడ ఎంపీ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు మొత్తం 7,89,685 ఓట్లు వచ్చాయి. ఇంతే మొత్తంలో జనసేన ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌కు రావాల్సి ఉంది. కానీ, 7,18,971 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో 70,714 ఓట్లు తక్కువగా వచ్చాయి.

నెల్లూరు: రెండు అసెంబ్లీ సెగ్మెంట్లలో క్రాస్ ఓటింగ్ జరిగింది. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో పార్లమెంటు, అసెంబ్లీ ఓట్ల మధ్య తేడా కనిపించింది. నెల్లూరు సిటీలో 8,375 ఓట్లు క్రాస్ అయ్యాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనూ ఎంపీ అభ్యర్థికి 10,612 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. మొత్తంగా ఎంపీ అభ్యర్థికి 2,45,902 ఓట్లు మెజారిటీ రాగా ఎమ్మెల్యేలందరి మెజారిటీ 2,28,255గా ఉంది.

మచిలీపట్నం: ఏడు అసెంబ్లీ స్థానాల్లో గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులకు 7,84,115 వచ్చాయి. ఇవే స్థానాల్లో ఎంపీ అభ్యర్థికి 7,24,439 ఓట్లు వచ్చాయి. అంటే.. 59,676 ఓట్లు క్రాస్ అయ్యాయి.

అమలాపురం: కూటమి ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌కు 23,571 ఓట్లు అసెంబ్లీ అభ్యర్థుల కంటే అదనంగా వచ్చాయి. మొత్తం 7,96,981 ఓట్లు ఎంపీ అభ్యర్థికి రాగా, దీని పరిధిలోని ఎమ్మెల్యేలకు 7,73,410 ఓట్లు వచ్చాయి. దీంతో ఎంపీకి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరిగింది.

రాజమండ్రి: కూటమి ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి.. ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన మొత్తం ఓట్ల కంటే 57,007 ఓట్లు క్రాస్ ఓటింగ్‌తో తగ్గిపోయాయి. ఎంపీ దగ్గుబాటికి మొత్తం 7,26,515 ఓట్లు రాగా ఎమ్మెల్యే అభ్యర్థులకు మొత్తం 7,83,522 ఓట్లు వచ్చాయి.

పిన్నెల్లి పరిస్థితి ఏంటో?

» నేటితో మధ్యంతర బెయిల్ గడువు పూర్తి

» హైకోర్టుకు హాజరు కావాల్సిందే

» ఈవీఎం ధ్వంసం కేసులో 'బెయిల్'పై ఇటీవల సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు



నరసరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అధికారం అండ, పోలీసుల సహకారంతో ఎన్నికల ముందు చెలరేగిపోయిన పల్నాడు జిల్లా మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. హత్యాయత్నం, పాల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం తదితర కేసుల్లో హైకోర్టు ఆయనకు ఇచ్చిన ముందస్తు బెయిల్ గడువు గురువారంతో ముగియనున్నది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం నరసరావుపేటలో ఉన్న ఆయన ఎస్పీ కార్యాలయంలో రోజూ సంతకం చేస్తున్నారు. గురువారం కోర్టుకు హాజరు కావాల్సి ఉంది. పాల్వాయిగేట్ టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు పిటిషన్ నేపథ్యంలో పిన్నెల్లి ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తిరిగి ఆయనకు కోర్టులో ఊరట లభించకపోవచ్చని న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు. ఈవీఎంను పగులగొట్టిన కేసులో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఇలాంటి కేసులో పిన్నెల్లికి హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడమంటే వ్యవస్థను పూర్తిగా అవహేళన చేయడమేనని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో పిన్నెల్లి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు.

వెంకట్రామిరెడ్డి ఎక్కడో..?

ఎన్నికల హింస కేసుల్లో ప్రధాన నిందితుడు, షాడో ఎమ్మెల్యేగా అరాచకాలు జరిపించిన పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డి కూడా తప్పించుకు తిరుగుతున్నారు. హత్యాయత్నం కేసులో ఆయన అరెస్టుకు పోలీసులు కనీస ప్రయత్నాలు కూడా చేయడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

వైసీపీని నమ్మి.. నట్టేట మునిగి!

(మొదటి పేజీ తరువాయి)

మాటలు నమ్మి పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టభయంతో కొన్నిచోట్ల కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. ఈసారి ఏపీ ఎన్నికల సమరం హోరాహోరీగా సాగడంతో బెట్టింగులు కూడా విపరీతంగా జరిగాయి. ఈ ఎన్నికలపై కాసిన పందాలు రూ.8 వేల కోట్ల వరకూ ఉన్నాయని ఆ రంగంలో నిపుణులు లెక్కగట్టారు. ఎన్నికలకు మూడు, నాలుగు నెలల ముందు నుంచే ఈ పందేల జోరు మొదలైంది. విదేశాల్లో ఉద్యోగాలు చేసుకొంటున్నవారితోపాటు రోజువారీ కూలీలు కూడా ఈ విష వలయంలోకి అడుగు పెట్టారు. తమ గెలుపుపై వైసీపీ నాయకులు తమ క్యాడర్, సానుభూతిపరుల వద్ద చివరి వరకూ విపరీతమైన నమ్మకం వ్యక్తం చేయడం, ఆ పార్టీకి అనుకూలంగా కొందరు జ్యోతిష్యులు, సోషల్ మీడియా ప్రచారకర్తలు రంగంలోకి దిగడంతో పందేల జోరు పెరిగింది. అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ డబ్బులు తెచ్చి బెట్టింగ్‌ల్లో పెట్టారు. కానీ, ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడంతో ఆ పార్టీ తరఫున పందేలు కాసిన వారు షాక్‌కు గురయ్యారు. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం ప్రకాశ్‌నగర్‌కు చెందిన బిక్కిన సురేశ్ (30) అనే వ్యక్తి వైసీపీ గెలుస్తుందని రూ.30 లక్షల వరకూ పందెం కాశాడు. ఈ మొత్తం పోవడంతో బుధవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే కాకినాడ జిల్లా యు.కొత్తపల్లికి చెందిన కొందరు చేనేత కార్మికులు కలిసి వైసీపీ గెలుస్తుందని రూ.5 లక్షలు పందెం కాశారు. చివరకు ఆ సొమ్మంతా నష్టపోయారు. జిల్లాలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బెట్టింగ్‌ల్లో డబ్బు పోగొట్టుకున్నారు.

పందెం సొమ్ముతో పరార్..

పల్నాడు జిల్లా రొంపిచర్లలో వైసీపీ, టీడీపీ పార్టీల తరఫున భారీ సంఖ్యలో పందేలు సాగాయి. ఈ నేపథ్యంలో స్థానిక చెరువు కట్ట సెంటర్‌లో ఓ వ్యక్తిని మధ్యవర్తిగా ఎంపిక చేసుకుని అతని వద్ద సుమారు రూ.150 కోట్ల మేర నగదును ఉంచారు. మంగళవారం ఫలితాలు వెలువడిన అనంతరం ఇరు పార్టీల తరఫున పందేలు కాసిన వ్యక్తులు సదరు వ్యక్తి వద్దకు వెళ్లగా.. అప్పటికే ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నగదుతో ఉడాయించినట్లు తెలిసి అవాక్కయ్యారు. అలాగే గుంటూరు నగరంలో ఇలాగే రూ.50 లక్షలు పందెం కాసిన వ్యక్తి ఫలితాల తర్వాత అదృశ్యమయ్యాడు. ఆయన రోజువారీ వడ్డీకి డబ్బులు తెచ్చిమరీ పందెం కాసినట్టు తెలిసింది. అయితే ఆయన ఆత్మహత్య చేసుకొన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పు ఇచ్చిన వాళ్లు ఇది నిజమా.. కాదా అని ఆరా తీస్తున్నారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేగడికొత్తూరుకు చెందిన వైసీపీ నాయకుడు పందెం డబ్బులతో పారిపోయినట్లు సమాచారం. టీడీపీ సానుభూతిపరులు చంద్రబాబు ఈసారి సీఎం అవుతారని అనంతపురం నగరానికి చెందిన వైసీపీ నేతలతో రూ.50 లక్షలు పందెం కాశారు. మధ్యవర్తిగా శింగనమల నియోజకవర్గంలోని రేగడికొత్తూరుకు చెందిన వైసీపీ నేతను ఎంచుకున్నారు. టీడీపీ వర్గీయులు రూ.50 లక్షలు అతని చేతిలో పెట్టారు. గెలిచిన వారికి ఈ నెల 5న డబ్బులు ఇచ్చేలా అంగీకార ప్రతం రాసుకున్నారు. ఈనెల 4న ఫలితాలు విడుదలై చంద్రబాబు బంపర్ మెజార్టీ సాధించడంతో టీడీపీ వర్గీయులు పందెం డబ్బులు తీసుకుందామని వెళ్తే ఆయన ఊరు విడిచి పారిపోయాడని తెలిసింది.

ఎగ్జిట్ పోల్స్ తర్వాత జోరందుకున్న పందేలు

ఎగ్జిట్ పోల్స్ తర్వాత పందేలు భారీగా కాశారు. ఆరా సంస్థకు చెందిన మస్తాన్‌రావు అనే విశ్లేషకుడు ఈ ఎన్నికల్లో వైసీపీ ఖాయంగా గెలుస్తుందని నియోజకవర్గాల వారీగా లెక్కలు చెప్పడంతో నమ్మి అనేక మంది కొత్తగా పందేలు కాశారు. గుంటూరు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్సీ ఈ సర్వేను నమ్మి రూ.26 లక్షలు పోగొట్టుకున్నారు. గోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల వైసీపీ అభ్యర్థులు పట్టుబట్టి మరీ తమ క్యాడర్‌తో పందేలు కాయించారని కొందరు చెబుతున్నారు. వైసీపీ తరఫున ఎవరూ పందేలు కాయడం లేదని, తమను బలవంతంగా ఈ రొచ్చులోకి దింపారని కొందరు బాధితులు మీడియా ప్రతినిధుల వద్ద వాపోయారు.



సమర్థంగా ప్రజాస్వామ్య పండగ

» ఎన్నికల యంత్రాంగానికి అభినందనలు

» రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనా

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ప్రజాస్వామ్య పండుగను రాష్ట్రంలో ఎంతో విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని శాంతియుతంగా పూర్తి చేసినందుకు మొత్తం ప్రక్రియను అత్యంత సమర్థంగా, ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించినందుకు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు, ఆర్వోలకు, ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇటువంటి ప్రతిభావంతులైన అధికారుల బృందానికి నాయకత్వం వహిస్తున్నందుకు తాను ఎంతో గర్వపడుతున్నానన్నారు. ప్రజాస్వామ్య పండుగను విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అనుసరించిన మంచి పద్ధతులను భవిష్యత్తు తరాల వారికి ఎంతో ఆదర్శంగా మార్గదర్శకంగా ఉండే విధంగా ఒక కరదీపికను రూపొందించాల్సిన అవసరం ఉందని ఈ సదర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా అనుసరించిన వినూతన్న పద్ధతులను భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లేందుకు నివేదికలను తమ కార్యాలయానికి మూడు రోజుల్లో పంపాలని ఆయన కోరారు. అన్ని జిల్లాల నుంచి వచ్చే నివేదికల ఆధారంగా ఒక సమగ్రమైన నివేదికను రూపొందించి భారత ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ఈ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విమర్శలకు ఆస్కారం లేకుండా రూపొందించిన శుద్ధమైన ఓట్ల జాబితాలు ఎన్నికల ప్రక్రియ విజయవంతానికి నాంది పలికిందన్నారు. శుద్ధమైన ఓట్ల జాబితా రూపొందించేందుకు కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకూ ప్రజలకూ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ఎన్నికల సంఘం 2024 మార్చి 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసేంత వరకూ రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల స్థాయి వరకూ ఉన్న ఎన్నికల యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం, ఎంతో నిబద్ధతతో వ్యవహరిస్తూ వారి వారి విధులను సక్రమంగా నిర్వహించారన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం అవిరళ కృషి చేసిందని అభినందించారు.


అసెంబ్లీ రద్దు... గవర్నర్ ఉత్తర్వులు

రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అసెంబ్లీని రద్దు చేశారు. కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం రోజున మళ్లీ అసెంబ్లీ ఏర్పాటవుతుంది. ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం తర్వాత కొత్త ప్రభుత్వం ఎమ్మెల్యే ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉంది.

పట్టాభి గాంధీగిరి!

అరెస్టు చేసిన ఐపీఎస్ ఇంటికి వెళ్లిన టీడీపీ నేత

అప్పటికే బయటకు వెళ్లిపోయిన ఎస్పీ జాషువా



విజయవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తనను అన్యాయంగా అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టిన ఐపీఎస్ అధికారి ఇంటికి వెళ్లి టీడీపీ నేత పట్టాభి గాంధీగిరి ప్రదర్శించారు. ఆయన ఇంటిలో లేకపోవడంతో ఇంటి ఆవరణలో ఉన్న కుర్చీలో పుష్పగుచ్ఛం, శాలువా పెట్టి వచ్చారు. వివరాలివీ.. జగన్ ప్రభుత్వంలో పి.జాషువా కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేసిన సమయంలో టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిని అరెస్టు చేసి, అర్ధరాత్రి వేళ తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఈ ఘటనను పట్టాభి గుర్తుకు తెచ్చుకున్నారు. తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ రోడ్డులో ఉన్న ఆయన ఇంటికి పట్టాభి విజయవాడ నుంచి బుధవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. అప్పటికే జాషువా బయటకు వెళ్లిపోయారు. ఇంటి ఆవరణలో పట్టాభి మాట్లాడుతుండగా చిత్రీకరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. 2023 ఫిబ్రవరి 20వ తేదీన తనను అక్రమంగా అరెస్టు చేసి తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని పట్టాభి ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్ధరాత్రి విద్యుత్ తీసేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించి రాచమర్యాదలు చేశారని తెలిపారు. తనకు చేసిన రాచమర్యాదలకు మెచ్చుకుని పుంగనూరు పుడింగి చిత్తూరు జిల్లాలో పోస్టింగ్ వేయించారని పేర్కొన్నారు. ఈ కుట్రలు తెలిసి ఎన్నికల సంఘం ఆయనను విధుల నుంచి తప్పించిందన్నారు. ఆయన విజయవాడ సమీపంలో ఏడున్నర ఎకరాల విలాసవంతమైన అతిథిగృహంలో ఉన్నారని తెలుసుకుని ఇక్కడికి వచ్చానని పట్టాభి తెలిపారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్చాఫ్ వచ్చిందని, తనకు చేసిన మర్యాదలకు సత్కరించడానికి ఇక్కడికి వచ్చానని చెప్పారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో కుర్చీలో పుష్పగుచ్ఛం, శాలువాను పెట్టినట్టు చెప్పారు. తమ ప్రభుత్వంలో ఇలాంటి అధికారులను ఎలా సత్కరించాలో తెలుసునని చెప్పారు.

'విద్యాకానుక' వాయిదా

12నే పంపిణీ అని గతంలో ప్రకటన.. ప్రభుత్వ మార్పుతో తాజా నిర్ణయం

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బడులు తెరిచే రోజునే విద్యాకానుక పంపిణీ చేయాలనే నిర్ణయాన్ని పాఠశాల విద్యాశాఖ తాత్కాలికంగా వాయిదా వేసింది. ప్రభుత్వం మారినందున కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కిట్లు పంపిణీ చేసే అవకాశం కనిపిస్తోంది. నూతన ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ ప్రక్రియను చేపడతారు. ఈ నెల 12న బడులు పునఃప్రారంభం అవుతాయి. అదే రోజున విద్యార్థులు కానుక పంపిణీ చేస్తామని ఫలితాలకు ముందు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ప్రకటించారు. ఈ మేరకు మండల స్టాక్ పాయింట్లకు విద్యాకానుక కిట్లు సరఫరా చేసేందుకు ఆదేశాలిచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం మారుతున్నందున కొన్నిరోజుల తర్వాత పంపిణీ చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ప్రతిఏటా బడులు తెరిచిన రోజునే విద్యా కానుక విద్యార్థులకు అందడం లేదు. దాదాపు 2నెలల పాటు ఈ కిట్ల పంపిణీ ప్రక్రియ సాగుతోంది. మొదటిరోజే ఇవ్వడం అసాధ్యమని తెలిసినా ప్రవీణ్ ప్రకాశ్ ఆ రోజే అందరికీ ఇచ్చేస్తామంటూ హడావిడి చేశారు. అయితే ఇప్పటికీ సగం కిట్లు కూడా స్టాక్ పాయింట్లకు చేరలేదు.

జగన్ ప్రభుత్వ అవినీతిపై విచారణ జరగాలి: పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 5: 'జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా వెళ్లినందున మనం కూడా విద్వేషపూరితంగా, కక్షపూరితంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం లేదు. కానీ రాష్ట్రంలో జరిగిన అవినీతిపై కచ్చితంగా లీగల్‌గా విచారణ జరగాల్సిన అవసరం ఉంది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వంలో మన నాయకులను ఏ విధంగా వేధించి వెంటాడి ఇబ్బందిపెట్టారో, కారణం కూడా లేకుండా ఏవిధంగా చంద్రబాబును అరెస్టు చేశారో.. ఆ రకంగా, ఆ విధంగా వెళ్లాలని మనవాళ్లు అనుకుంటారు. కక్షపూరితంగా మనం వెళ్లనవసరం లేదు. అయితే ప్రకృతి సంపద, ప్రజా సంపదలను వారంతా దోచుకున్నారు. వీటన్నింటిపై సమగ్రమైన విచారణ జరగాల్సి ఉంది. ఇది వ్యక్తిగతంగా కాదు.. లీగల్‌గా ఏ రకంగా ముందుకు వెళ్లాలి అనేది కచ్చితంగా కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం దృష్టి పెట్టాల్సి ఉంది.' అని పురందేశ్వరి పేర్కొన్నారు.

ఎంపీలుగా ఉగ్రవాద కేసుల నిందితులు

- ఖదూర్ సాహిబ్ నుంచి అమృతపాల్, బారాముల్లా నుంచి అబ్దుల్ రషీద్ ఎన్నిక
- ఇద్దరూ జైలు నుంచే స్వతంత్రులుగా పోటీ
- ప్రమాణస్వీకారానికి రాజ్యాంగం అవకాశం కల్పిస్తోందన్న రాజ్యాంగ నిపుణుడు ఆచారి


అమృత్ పాల్


అబ్దుల్ రషీద్

న్యూఢిల్లీ, జూన్ 5: కరడుగట్టిన ఖలిస్థానీ వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్, ఉగ్రవాదులకు నిధులను చేరవేశాడన్న ఆరోపణలతో జైలు శిక్ష అనుభవిస్తున్న షేక్ అబ్దుల్ రషీద్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. ఇద్దరిపై ఉగ్రవాద ఆరోపణలున్నాయి. ఇద్దరూ జైలు నుంచే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. అమృత్‌పాల్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ నుంచి నామినేషన్ వేయగా, రషీద్ బారాముల్లా నుంచి బరిలో నిలిచారు. బారాముల్లాలో రషీద్ ఏకంగా జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లానే మట్టి కరిపించారు. 2 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీ సాధించారు. ఖదూర్ సాహిబ్‌లో అమృత్‌పాల్ కూడా 2లక్షల ఓట్ల మెజారిటీ సాధించారు. అయితే, జైలు నుంచే లోక్‌సభకు ఎన్నికైన వీరు ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేయవచ్చా.. అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. దీనిపై ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి స్పష్టతనిచ్చారు. జైలు నుంచి ఎన్నికైనప్పటికీ ప్రమాణ స్వీకారం చేయడానికి రాజ్యాంగం అవకాశం కల్పిస్తోందని ఆయన తెలిపారు. అమృత్‌పాల్, రషీద్ ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేయాలంటే ముందుగా వారు జైలు అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఆ తర్వాత వారిని భద్రతాధికారులే పార్లమెంటుకు తీసుకువస్తారని, ప్రమాణ స్వీకారం అనంతరం ఇద్దరూ తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. మరోవైపు, వారు లోక్‌సభ కార్యకలాపాలకు హాజరు కాలేని పరిస్థితుల నేపథ్యంలో అందుకు గల కారణాలను వివరిస్తూ స్పీకర్‌కు లేఖ రాయాల్సి ఉంటుందని చెప్పారు. పార్లమెంటు ఉభయసభల కార్యకలాపాల్లో పాల్గొనే వెసులుబాటు వారికి ఉండదన్నారు. రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కును గౌరవించాలని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం జైల్లో ఉన్న వీరిద్దరిపై ఉగ్రవాద ఆరోపణలు నిజమని తేలి, దోషులుగా రుజువై రెండేళ్ల కంటే ఎక్కువ జైలు శిక్ష పడితే వారి లోక్‌సభ సభ్యత్వం దానంతట అదే రద్దవుతుంది.

తిహాడ్ జైల్లో రషీద్.. దిబ్రూగఢ్‌లో అమృత్ పాల్

గతేడాది పంజాబ్‌లోని అజ్నాలా పోలీస్ స్టేషన్‌పై వందలాది మంది కత్తులతో దాడి చేసిన కేసులో అమృత్‌పాల్ సింగ్ ప్రధాన నిందితుడు. ఆయన్ను గతేడాది ఏప్రిల్‌లోనే జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేసి అసోంలోని దిబ్రూగఢ్ జైలుకు తరలించారు. మరోవైపు, రషీద్ 2019 ఆగస్టు 9 నుంచి తిహాడ్ జైల్లో ఉన్నారు.

సహస్త్రతాళ్ ట్రెక్కింగ్‌లో తొమ్మిది మంది మృతి

ఉత్తరకాశీ/బెంగళూరు, జూన్ 5: ఉత్తరాఖండ్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లిన తొమ్మిది మంది కర్ణాటకవాసులు ప్రతికూల వాతావరణంలో చిక్కుకొని మరణించారు. కర్ణాటకకు చెందిన 18 మంది, మహారాష్ట్రకు చెందిన ఒకరు, స్థానిక గైడ్‌లు ముగ్గురుతో కూడిన మొత్తం 22 మంది బృందం మే 29న ఎగువ హిమాలయ ప్రాంతంలోని 4,100 నుంచి 4,400 మీటర్ల ఎత్తులో ఉన్న సహస్త్రతాళ్ అల్పైన్ సరస్సు వరకు ట్రెక్కింగ్‌కు బయలుదేరింది. ప్రతికూల వాతావరణం వల్ల బృందం దారి తప్పింది. వారిలో కర్ణాటకకు చెందిన తొమ్మిది మంది మరణించినట్లు సమాచారం అందిందని కర్ణాటక అధికారులు తెలిపారు. మిగిలినవారిలో కొందరిని కాపాడామని, ఇంకొందరి జాడ కోసం వెతుకుతున్నామని కర్ణాటక సీఎం సిద్దరామయ్య తెలిపారు.

తప్పులు తేల్చే టైమ్!

(మొదటి పేజీ తరువాయి)

నిరాకరించారు. అక్నాలెడ్జ్‌మెంట్ కావాలని, ఆదేశాలు కావాలని సహాయ నిరాకరణ చేశారు. దీంతో... నేరుగా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా జోక్యం చేసుకున్నారు. దీంతో... సిట్ ఆఫీసు ప్రధాన ద్వారానికి సీల్ పడింది. అక్కడ ఏపీఎస్పీ పోలీసులను కాపలా పెట్టారు. ఇక స్కిల్ డెవల్‌ప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసిన 'సిట్' అధిపతి కొల్లి రఘురామి రెడ్డికి షాక్ ఇచ్చారు. ఆయన తక్షణమే పోస్టులన్నీ వదిలేసి హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ గుప్తా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన ఆయన మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేశారు. జగన్ హయాంలో ఏకకాలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, సిట్ అధిపతిగా ఉన్న కొల్లి రఘురామి రెడ్డి పనిచేశారు. అలాంటి అధికారి డీజీపీ కార్యాలయంలో ఒక మూల కూర్చున్నారు.

విఘా వలయంలోకి ఐదు బ్లాక్‌లు

ముఖ్యమంత్రిగా జగన్మోహనరెడ్డి రాజీనామా చేశారు. త్వరలోనే కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. ఈ సంధికాలంలో కీలకమైన ఫైళ్లు మాయమయ్యే ప్రమాదం ఉంది. గత ప్రభుత్వంలో వివాదాస్పద భూ కేటాయింపులు, అక్రమ బదిలీలు, పదోన్నతులు, టెండర్ ప్రక్రియల్లో అవినీతి జరిగాయన్న ఆరోపణలున్నాయి. దానికి సంబంధించిన ఫైళ్లను కొత్త సర్కారు కొలువుతీరేలోపే మొత్తంగా ధ్వంసం చేసే అవకాశముండటంతో గవర్నర్ రంగంలోకి దిగారు. ఫైళ్లు మొత్తం భద్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సచివాలయం ఐదు బ్లాకుల్లోని వివిధ కార్యాలయాలు, అందులోని సామగ్రి వివరాలను పరిశీలించి నమోదు చేసుకున్నారు. మంత్రులు, సలహాదారుల పేషీల నుంచి నేమ్ ప్లేట్లు ఉన్న బోర్డులను సాధారణ పరిపాలనశాఖ సిబ్బంది తొలగించారు. మంత్రుల పేషీల్లోని ఫర్నీచర్, కంప్యూటర్ల వివరాలు నమోదు చేసుకుని తమ దగ్గర ఉన్న వివరాలతో జీఏడీ అధికారులు సరిపోల్చుకున్నారు. మంత్రుల పేషీల్లోని వ్యక్తిగత సామగ్రిని సచివాలయం నుంచి బయటకు తీసుకు వెళ్లాలంటే ముందుగా బిల్లులు చూపించాలని జీఏడీ స్పష్టం చేసింది. కార్యాలయాల నుంచి బయటకి వెళ్లే వాహనాలను ఎస్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు చేయడం కనిపించింది.

రంగంలోకి పోలీస్ ఐటీ టీమ్

పోలీసు శాఖలోని ఐటీ టీమ్ రంగంలోకి దిగింది. సచివాలయంలో మూడో బ్లాక్‌లోని ఈ - ఆఫీస్ విభాగంలో తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఐటీ వింగ్ ఎస్పీ ప్రకాశ్ పాల్గొన్నారు. ఐటీ విభాగంలోని కంప్యూటర్ల నుంచి డేటా చోర్యం జరిగిందని, పలు ఫైళ్లకు సంబంధించిన డేటాను డిలీట్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే పోలీస్ అధికారులు అక్కడ తనిఖీలు నిర్వహించారు. ఈ-ఆఫీస్‌ను స్వాధీనం చేసుకున్నారు. లాగిన్ ఐడీలను బ్లాక్ చేశారు. సీఎం ఆఫీస్‌కు చెందిన ఫైళ్లు ఈ ఆఫీస్ నుంచి మాయం చేస్తున్నారని డీజీపీకి ఫిర్యాదులు వెళ్లాయని తెలిసింది. దీనిపై సైబర్ క్రైమ్, ఇతర పోలీస్ టీంలు రంగంలోకి దిగాయి. ఐటీ కమ్యూనికేషన్ విభాగంలో వారంరోజులుగా ఫైళ్ల కదలికల తీరును పరిశీలించినట్లు తెలిసింది. ఉద్యోగుల సొంత ల్యాప్‌టాప్‌లను సైతం లోపలే పెట్టి వెళ్లిపోవాలని, చెక్ చేసిన తర్వాత ఇస్తామని ఆదేశించారు. సర్వర్లలో డేటా డిలీట్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని వచ్చిన ఆరోపణలతోనే ఈ తనిఖీలు జరిగాయే చర్చ జరుగుతోంది. తనిఖీల అనతరం ఈ-ఆఫీస్ గది వద్ద పోలీసులను కాపలా ఉంచారు.

ఫలితాల రోజా ఫైళ్లు బయటకు..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం, పేషీపై జీఏడీ ఫోకస్ పెంచింది. మంగళవారం ఫలితాలు ఒకవైపు వెలువడుతుండగానే, సీఎస్ పేషీలో కొన్ని ఫైళ్లకు ఆమోదం తెలిపారు. కొంత మంది కీలక అధికారులు సెలవులపై వెళ్లడానికి అనుమతించారు కూడా. దీనిపై గవర్నర్ కొంత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

కక్ష సాధించేందుకే 'సిట్'

జగన్ అధికారంలోకి రాగానే చంద్రబాబును టార్గెట్ చేశారు. రాజధాని భూముల్లో ఇన్‌సైడ్ ట్రేడింగ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్, స్కిల్ డెవల్‌ప్‌మెంట్ కార్పొరేషన్‌లలో అక్రమాలు జరిగాయంటూ ఆయనపై పెట్టారు. వైసీపీ ఖాకీగా పేరు ఉన్న కొల్లి రఘురామిరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేశారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా స్కిల్ డెవల్‌ప్‌మెంట్ కేసులో చంద్రబాబును అర్ధరాత్రి నంద్యాలలో అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలులో 52రోజుల పాటు బంధించింది. మిగతా కేసుల్లో చంద్రబాబు ముందస్తు బెయిల్ తెచ్చుకోవడంతో 'సిట్' పని ఆగిపోయింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత బాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను 'సిట్' కార్యాలయంలో తగలబెట్టడం అప్పట్లో కలకలం రేపింది. ఈ ఎన్నికల్లో జగన్ పార్టీ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో మిగతా డాక్యుమెంట్లు ఏవైనా సిట్ అధికారులు, సిబ్బంది ధ్వంసం, మాయం చేసే అవకాశం ఉందని పోలీసు శాఖ అనుమానించింది. ఈ నేపథ్యంలోనే సిట్ కార్యాలయానికి తాళం వేసింది.

జగన్ కేసుల్లో విచారణ వేగవంతం!

- దాదాపు 130 డిశ్చార్జి పిటిషన్లు పరిష్కారం కాలేదు
- ఈ కేసుల్లో 2023 నవంబరు 24 తర్వాత తీర్పుల్లేవు
- సుప్రీం మార్గదర్శకాలను ఆయా కోర్టులకు పంపాలి
- రిజిస్ట్రీని ఆదేశించిన తెలంగాణ హైకోర్టు ధర్మాసనం



హైదరాబాద్/అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతంగా పూర్తిచేయడానికి తెలంగాణ హైకోర్టు తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన కేసుల విచారణను హైకోర్టులు పర్యవేక్షించాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి. వినోద్‌కుమార్ ధర్మాసనం ప్రత్యేకంగా పిటిషన్‌ను రిజిస్టర్ చేసి విచారణ చేపడుతోంది. మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి దాదాపు 130 డిశ్చార్జి పిటిషన్లు పరిష్కారం కాలేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసుల్లో 2023 నవంబరు 24 తర్వాత ఎలాంటి తీర్పులు వెలువడలేదని పేర్కొంది. ప్రజాప్రతినిధుల కేసులను వేగవంతంగా విచారించడానికి సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను ఆయా ప్రత్యేక కోర్టులకు (సీబీఐ కోర్టు సహా) పంపాలని రిజిస్ట్రీకి స్పష్టంచేసింది. ఇవి తమ ఆదేశాలు కాదని.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలుగా గుర్తుంచుకోవాలని హెచ్చరిక స్వరంతో పేర్కొంది. హైకోర్టు తాజా ఆదేశాల నేపథ్యంలో నాంపల్లి సీబీఐ కోర్టులో ఉన్న జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ వేగవంతమయ్యే అవకాశం ఏర్పడిందని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జగన్ ముఖ్యమంత్రిగా లేరు కాబట్టి విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావాల్సిన అవసరం ఉంటుందా అనే అంశంపైనా చర్చ మొదలైంది. కాగా, వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి నిందితుడిగా ఉన్న నేపథ్యంలో దీనిని సైతం ప్రజాప్రతినిధుల కేసుగానే పరిగణించి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

జగన్ కేసుల విచారణ 19కి వాయిదా

జగన్ అక్రమాస్తులకు సంబంధించిన కేసులు బుధవారం సీబీఐ కోర్టు ఎదుట మరోసారి విచారణకు వచ్చాయి. నిందితుల తరఫు న్యాయవాదులు సమయం కోరడంతో న్యాయమూర్తి టీ రఘురాం విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేశారు.


ఢిల్లీలో బుధవారం బీజేపీ అధ్యక్షుడు నడ్డా, అమిత్ షాలతో చంద్రబాబు

శిరసా నమామి!

(మొదటి పేజీ తరువాయి)

మించిన తీర్పు ఈసారి వచ్చిందని అన్నారు. 'ఇందుకు కారణాలేమిటో నేను చెప్పనక్కర్లేదు. ప్రజలకు తెలుసు. రాష్ట్రంలో మాట్లాడే స్వేచ్ఛ లేదు. బతికే స్వేచ్ఛ లేదు. తమ ఆస్తులు తమకు దక్కుతాయో లేదో తెలియదు. నేను ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో ముఖ్యమంత్రులను చూశాను. కానీ ఈ ఐదేళ్లలో చూసింది వేరు. ప్రతి రంగం, ప్రతి వ్యవస్థ నాశనమయ్యాయి. దీనిపై ప్రజలు తిరగబడ్డారు. ఎక్కడో అమెరికా నుంచి రూ.లక్షలు ఖర్చు పెట్టుకుని వచ్చిమరీ ఓట్లు వేశారు. హైదరాబాద్‌లో కూలి పనులు, పాచి పనులు చేసుకొనే పేదలు రైళ్లు, బస్సుల్లో తరలివచ్చారు. ఇంటి నుంచి భోజనాలు కట్టుకు వచ్చి బస్టాండ్లలో కూర్చుని తిని ఎవరి ఊరికి వారు వెళ్లి ఓట్లు వేశారు. రాష్ట్రం నిలవాలి.. ప్రజలు గెలవాలని మేం ఇచ్చిన పిలుపునకు స్పందించారు. నాకిది పదో ఎన్నిక. నేను ఎన్నో ఎన్నికలు నిర్వహించాను. పార్టీలు, వ్యక్తులు అశాశ్వతం. ప్రజాస్వామ్యం శాశ్వతం. అదే నిరూపితమైంది. ఇప్పటి వరకూ వచ్చిన వివరాల ప్రకారం మా కూటమికి 55 శాతానికి పైగా ఓట్లు వచ్చాయి. వైసీపీకి 39శాతం మాత్రమే దక్కాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఒకప్పుడు భారీ మెజారిటీ అంటే చార్మినార్ కనిపించేది. 80-90 వేలు అక్కడ వచ్చేది. తర్వాత స్థానం కోసం కుప్పం, సిద్దిపేట పోటీపడేవి. ఈసారి అనేక నియోజకవర్గాల్లో మెజారిటీలు వేలకు వేలు దాటిపోయాయి. గాజువాక, భీమిలి, మంగళగిరిలో టీడీపీ అభ్యర్థులకు 90 వేలకు పైగా ఆధిక్యాలు వచ్చాయి' అని ఆయన పేర్కొన్నారు. పాలకుడు ఎలా ఉండకూడదో జగన్ చూపించారని, ఇక నువ్వే వద్దని ప్రజలు జగన్‌కు చెప్పారని వ్యాఖ్యానించారు. ఓటు వేసిన వారి అంచనాలకు తగినట్లుగా పనిచేస్తామన్నారు. 'ప్రజలు ఓటు వేసి ఊరుకోవడం కాదు. మేమెలా పనిచేస్తున్నామో.. తప్పొప్పులు ఏమిటో మాకు చెప్పి నడిపించాలి' అని విజ్ఞప్తి చేశారు.

కేడర్ త్యాగాల ఫలితం..

టీడీపీ కేడర్ ఈ ఐదేళ్లలో నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపారని చంద్రబాబు అన్నారు. 'మెడ మీద కత్తిపెట్టి జై జగన్ అనమంటే నిరాకరించి జై టీడీపీ అన్న తోట చంద్రయ్యను పల్నాడులో గొంతు కోసి కిరాతకంగా చంపారు. అటువంటి ఎందరో కార్యకర్తల త్యాగాల ఫలితమే ఈ తీర్పు' అని వ్యాఖ్యానించారు. మీడియా కూడా ఎన్నో వేధింపులకు గురైందని, కోర్టుల చుట్టూ తిరగడంతోపాటు సీఐడీ కార్యాలయాలకు హాజరు కావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌కు కూడా వేధింపులు తప్పలేదని, విశాఖ వెళ్తే అక్కడ ఉండడానికి వీల్లేదంటూ నగర బహిష్కరణ చేశారని ధ్వజమెత్తారు. 'పేర్ల దిగజారుడు అంతా ఇంతా కాదు. నిండు శాసనసభలో నా భార్యను అనరాని మాటలు అన్నారు. నా మీద క్లైమోర్ మైన్స్‌తో దాడి జరిగినప్పుడు కూడా అంత బాధపడలేదు. కౌరవ సభను గౌరవ సభగా చేసే తిరిగి వస్తానని ప్రతిజ్ఞ చేసి వెళ్లాను. దానిని ప్రజలు తీర్చారు. నా గౌరవాన్ని నిలబెట్టిన ప్రజలకు నా ధన్యవాదాలు. ఎంతో కష్టపడి నిలబెట్టిన రాష్ట్రాన్ని పతనం చేశారు. తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచారు. డబ్బులేం చేశారో తెలియదు. ఇసుక, మట్టి వంటి సహజ వనరులను ఇష్టానుసారం తవ్వేశారు. మీడియా రాసినవి.. మేం మాట్లాడినవి చాలా తక్కువ. లోతుగా తవ్వితే ఇంకా చాలా వస్తాయని అనిపిస్తోంది. ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారు. 30ఏళ్లకు సరిపోను నష్టం చేశారు' అని చెప్పారు. మోదీ, అమిత్ షా, పురందేశ్వరి, పవన్ సహా అందరం కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. తాము ఎన్డీయేతోనే ఉన్నామని, ఢిల్లీలో కూటమి సమావేశానికి హాజరవుతున్నానని ఆయన వివిధ ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు.

చంద్రబాబు ఛలోక్తులు

ఫలితాలు వెలువడ్డాక నిర్వహించిన మొదటి విలేకరుల సమావేశంలో చంద్రబాబు ఛలోక్తులు వేసి మీడియా ప్రతినిధులను నవ్వించారు. సమావేశంలోకి వస్తూనే.. 'ఇప్పుడుమీరంతా సంతోషంగా ఉన్నట్లేనా' అంటూ మొదలుపెట్టారు. 'స్వేచ్ఛ ముందు మీకు వచ్చింది. తర్వాత ప్రజలకు వచ్చింది. కాస్త నవ్వండి' అంటూ నవ్వించారు. కాగా, జాతీయ టీవీ చానళ్ల ప్రతినిధులు బుధవారం ఉదయం చంద్రబాబు నివాసం వద్ద కిటకిటలాడారు. విలేకరుల సమావేశంలో వారంతా ఇండియా కూటమి, ఎన్డీయేపై ప్రశ్నలు సంధించే ప్రయత్నం చేశారు. కానీ ఆయన సమాధానం ఇవ్వలేదు. తాను ఢిల్లీ వెళ్తున్నానని, వచ్చిన తర్వాత మాట్లాడతానంటూ దాటవేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన కొందరు మీడియా ప్రతినిధులు స్థానిక విలేకరులతో పిచ్చాపాటీగా మాట్లాడుతూ ఢిల్లీ రాజకీయాల్లో మళ్లీ చంద్రబాబు పాత్ర పెరిగిందన్నారు. 'ప్రధాని పదవి, హోం మంత్రి పదవి తప్ప మరేది అడిగినా టీడీపీకి ఇవ్వడానికి బీజేపీ నాయకత్వం సిద్ధంగా ఉంది' అని వారిలో ఒకరు వ్యాఖ్యానించారు.

వైసీపీలో కలకలం

(మొదటి పేజీ తరువాయి)

చూడడంలేదు. చివరికి... గెలుపొందిన పది మంది అభ్యర్థులు కూడా జగన్‌ను మర్యాదపూర్వకంగా కలవలేదు. తాడేపల్లి పేరు చెబితేనే ముఖం చిట్లిస్తున్నారు. 'వైనాట్ 175' అంటూ బీరాలు పలికిన జగన్ మాటలు నమ్మి ఘోరంగా మోసపోయామని... కోట్లు ఖర్చు చేసి కోలుకోలేనంతగా దెబ్బతిన్నామని వాపోతున్నారు. "డబ్బులిచ్చినా ఆప్యాయతలు ఏమయ్యాయో! అభిమానం ఏమైందో" అంటూ నాటకీయ స్వరంతో జనంపైనే జగన్ నిందలు వేయడాన్ని ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నాయకుడు, తాజా మాజీ మంత్రి తప్పుబట్టారు. ఈ పరిస్థితికి కారణం జగనే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే క్యాడర్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో మినహా.. పార్టీపరంగా ఎమ్మెల్యేలతో భేటీ కావడం, నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు నిర్వహించడంవంటివి లేనే లేదు. క్షేత్రస్థాయి పరిస్థితులు ఆయనకు చెప్పే అవకాశమే ఇవ్వలేదు" అని మండిపడ్డారు.

ఎమ్మెల్యేలకు విలువేదీ...

ప్రభుత్వానికీ, ప్రజలకూ మధ్య వారధిలా ఉండాల్సిన ఎమ్మెల్యేలకు జగన్ విలువే ఇవ్వలేదని కొందరు మాజీ వైసీపీ ఎమ్మెల్యేలు వాపోయారు. "ఎమ్మెల్యేలు, ఎంపీలను జగన్ ఏనాడూ పిలిచి మాట్లాడలేదు. ఐప్యాక్ బృందానికి ఇచ్చిన విలువ కూడా వారికివ్వలేదు" అని ఒక అభ్యర్థి పేర్కొన్నారు. 'పథకాలు అమలు చేస్తే వాటంతట అవే ఓట్లు పడతాయని జగన్ భావించారు. సంక్షేమ పథకాలు ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ జమానా నుంచే ప్రజలకు అందుతున్నాయి. అయినా.. ఇవన్నీ తానే కొత్తగా అమలు చేస్తున్నట్లుగా జగన్ చెప్పుకొన్నారు. ఈ మాటలను జనం పట్టించుకోలేదు" అని కోస్తాలో ఓటమి పాలైన వైసీపీ అభ్యర్థి ఒకరు అభిప్రాయపడ్డారు. జగన్ మాటలకు ప్రజలు స్పందించలేదంటే.. అసలు తమను పట్టించుకోలేదని అర్థమని వైసీపీ ముఖ్య నాయకుడొకరు వ్యాఖ్యానించారు. పోలింగ్ రోజు ఈవీఎం మీద బటన్ నొక్కాక సైలెంట్‌గా మహిళలు బయటకు వచ్చేశారని, అదంతా తమ ఓటే అనుకుని భ్రమల్లో ఉన్నామని వాపోయారు.

తాడేపల్లి వైపు చూడని నేతలు

వైసీపీ ఘోర పరాజయం నేపథ్యంలో పార్టీ నేతలెవరూ జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ఇష్టపడటంలేదు. సజ్జల రామకృష్ణా రెడ్డితో పాటు ఇద్దరు ముగ్గురు 'కోటరీ' నేతలు మాత్రమే ఉదయం పూట జగన్‌తో సమావేశమవుతున్నారు. విచిత్రమేమిటంటే.. జగన్‌ను మినహాయిస్తే వైసీపీ నుంచి మరో పది మంది అభ్యర్థులు మాత్రమే గెలిచారు. ఆ పది మంది కూడా తాడేపల్లి వైపు కన్నెత్తి చూడలేదు. గెలిచిన నలుగురు ఎంపీలు కూడా జగన్‌తో సమావేశం కాలేదు. ఓటమి పాలైన సీనియర్ మంత్రులు, ముఖ్య నేతలదీ అదే పరిస్థితి. ఎవరికి వారు ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటూ... తప్పంతా జగన్‌దే అనే నిర్ధారణకు వస్తున్నారు.

శాసనసభా పక్ష సమావేశం ఎప్పుడు?

సీఎం జగన్ కాస్తా ఎమ్మెల్యే జగన్‌గా మారాక.. శాసనసభాపక్ష సమావేశం నిర్వహించడంపై పార్టీలో పెద్దగా ఆసక్తి కనిపించడం లేదు. కార్యాలయంలో వ్యక్తిగత సలహాదారులు తప్ప నేతల సందడే లేదు. శాసనసభా పక్ష సమావేశంపై గురువారం నిర్ణయం తీసుకునే వీలుందని పార్టీ నేతలు చెబుతున్నారు.

సలహాదారు పదవికి సజ్జల రాజీనామా

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండో రోజు ప్రభుత్వ సలహాదారు పదవికి సజ్జల రామకృష్ణారెడ్డి రాజీనామా చేశారు. సహజంగా ఫలితాల సరళి తెలిసిన మరుక్షణమే నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయడం ఆనవాయితీ. కానీ సజ్జల మాత్రం తాపీగా బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని ఫలితాలు వచ్చిన తర్వాత కూడా సజ్జల రాజీనామా లేఖను ఒకరోజు తర్వాత పంపడంపై చర్చ సాగుతోంది. మిగిలిన సలహాదారులు ఎప్పటికి చేస్తారని రాజకీయవర్గాలు నిలదీస్తున్నాయి.

ఏఏజీ పొన్నవోలు, పీపీ, ఏపీపీ కూడా...

రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్(ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) వైనాగిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) దుష్యంత్‌రెడ్డి బుధవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఏఏజీ తన రాజీనామా లేఖను సీఎస్ జవహర్‌రెడ్డికి పంపించగా, పీపీ, ఏపీపీలు న్యాయశాఖ కార్యదర్శికి పంపారు.

రెండేళ్లు వద్దు.. రెండ్రోజుల్లో వెళ్లిపోతా!

- ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి యూటర్న్


అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రెండేళ్లు ఇక్కడే ఉంటానని కేంద్రాన్ని అనుమతి కోరిన అధికారి.. రెండు రోజుల్లో వెళ్లిపోతానని యూటర్న్ తీసుకోవడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి తీరు ఇదీ. జగన్ అధికారంలోకి రాగానే 2019 జూన్ 10న విజయ్‌కుమార్ రెడ్డి కేంద్ర సర్వీసుల నుంచి డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. ఈ నెల 9న ఆయన డిప్యుటేషన్ ముగుస్తోంది. అయితే, ఆయన డిప్యుటేషన్‌ను మరో రెండేళ్లు పొడిగించాలని కోరుతూ ఇటీవలే కేంద్రానికి సీఎస్ జవహర్ రెడ్డి వినతి పంపారు. కోడ్ ఉన్నందున ఇంకా సమాధానం రాలేదు. ఈలోపు రాష్ట్రంలోని ఓటర్లు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపారు. దీంతో ఉలిక్కిపడ్డ విజయ్ కుమార్ రెడ్డి బుధవారం సచివాలయానికి వెళ్లి అందరికీ బై బై చెప్పారు. అనంతరం సీఎస్‌ను కలిసి 'నాకు డిప్యుటేషన్ పొడిగింపు వద్దు.. రెండు రోజుల్లో వెళ్లిపోతా.. రిలీవ్ చేయండి' అని కోరారు.

'పద్మనాభ రెడ్డి'గా పేరు మార్చుకుంటున్నా: ముద్రగడ

కిర్లంపూడి, జూన్ 5: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో చేసిన సవాల్ మేరకు ఓటమిని అంగీకరిస్తూ తన పేరును 'ముద్రగడ పద్మనాభరెడ్డి'గా మార్చుకుంటున్నట్లు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ప్రకటించారు. 'ఎన్నికల్లో వైసీపీ అధినేతకు పరాజయం వచ్చింది. కూటమి నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతున్నా. గతంలో పిఠాపురంలో పవన్ను ఓడించకపోతే పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకుంటానని చెప్పాను. సవాలులో ఓడిపోయాను కాబట్టి పేరు మార్చుకోవడానికి సిద్ధమవుతున్నా. అన్నమాట ప్రకారం పద్మనాభరెడ్డిగా మార్చమని అప్లికేషన్ పెట్టుకుంటున్నా. గెజిట్ పబ్లికేషన్ కోసం పేపర్లు రెడీ చేసుకున్నా' అని తెలిపారు.

ధనుంజయ్ రెడ్డి పనికిమాలినోడు!

- అర్జీలతో వెళ్లిన ఎమ్మెల్యేలనూ నిలబెట్టేవాడు
- జగన్ ఇటువంటి వాళ్లనే గుడ్డిగా నమ్మారు
- అందుకే ఎక్కువ నష్టం: జక్కంపూడి రాజా



రాజమహేంద్రవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేషీలోని ధనుంజయ్ రెడ్డి పనికిమాలినోడని, ఆయనో చెత్త అధికారి అని వైసీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం తాజా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తీవ్రంగా విమర్శించారు. సీఎం జగన్‌కు అర్జీలివ్వడానికి వెళితే ఎమ్మెల్యేలను కూడా నుంచోపెట్టేవాడని, ఆయనే ముఖ్యమంత్రిలాగా తన గది ముందు గంటల తరబడి నుంచోపెట్టేవాడని ధ్వజమెత్తారు. ఇటువంటి అధికారుల వల్లే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఎమ్మెల్యేగా ఏదైనా సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లి చెబితే.. ఆయన ప్రగాఢ నమ్మకంతో, గుడ్డి విశ్వాసంతో ధనుంజయ్ రెడ్డిని పిలవడం, ఆయనకు చెప్పడం, ఏ కాగితం అయినా ఆయన చేతిలోకి వెళితే ఇక అంతే సంగతులు. ఒకటి కాదు.. వందల సమస్యలు చెప్పవచ్చు. అవన్నీ బుట్టదాఖలే. కోరుకొండ దేవాలయ భూముల రీరిజిస్ట్రేషన్ సమస్యల గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సదరు అధికారి పట్టించుకోలేదు. జగన్ ఇటువంటి వాళ్లను నమ్మడం వల్ల వాళ్లే భ్రమల్లో ముంచేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ఓటమిని తాము ఊహించలేదని, కారణాలు విశ్లేషించుకుంటామని చెప్పారు. కాపుల కష్టాలు ఏనాడూ పట్టించుకోని నాయకులు హీరోలైపోయారని, ముద్రగడ వంటి నేతలు మాటలు పడవలసి వచ్చిందని ఆక్షేపించారు. జక్కంపూడి వ్యాఖ్యలతో జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు విలువలేదనేది మరోసారి స్పష్టమైంది.


జనసేన కార్యాలయంలో ఆ పార్టీ అధినేత పవన్‌ను కలిసిన టీడీపీ నేత వర్మ

ప్రతి ఓటూ బాధ్యత గుర్తు చేసేదే!

(మొదటి పేజీ తరువాయి)

మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ తరఫున విజేతలుగా నిలిచిన అభ్యర్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. 'ప్రజల కష్టం నుంచి చెల్లించే పన్ను సొమ్మును ఓ ప్రజా ప్రతినిధిగా జీతం రూపంలో బాధ్యతగా తీసుకుంటాను. నేను రూపాయి జీతం తీసుకుంటాను లాంటి ఆర్భాటపు మాటలు మాట్లాడను. ప్రజా ఖజానా నుంచి సంపూర్ణ జీతం తీసుకుంటాను. ఎందుకంటే ప్రజలు.. 'మా పన్నుల ద్వారా వచ్చిన డబ్బును జీతంగా తీసుకుంటున్నావు. మాకు పనులు ఎందుకు చేసి పెట్టవు?' అని అడగడానికి వారికి అజమాయిషీ ఉంటుంది. నాకు కూడా ప్రజల డబ్బులు జీతంగా తీసుకుంటున్నాననే బాధ్యత నిరంతరం ఉంటుంది. ప్రజల నుంచి ఎంత జీతం తీసుకున్నా వెయ్యి రేట్లు దానికి మించి వారికి కష్టాల్లో ఇస్తాను. ప్రజలకు అన్ని కష్టాల్లో అండగా నిలుస్తాను. శాసనసభ సమావేశాలు, ప్రజాప్రతినిధుల మాటలు, టీవీల్లో చూస్తున్నప్పుడు భావితరాల వారు వాటిని స్ఫూర్తిగా తీసుకునేలా జనసేన నాయకులు మాట్లాడాలి. రాజకీయాలను కెరీర్ చేసుకోవాలనే స్ఫూర్తిని యువతలో నింపేలా జనసేన ముందుకు సాగుతుంది. ఇప్పటి వరకూ దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి ఇవ్వని గెలుపును రాష్ట్ర ప్రజలు జనసేనకు అందించారు. ఇదో పెద్ద బాధ్యత. దానిని అంతే సక్రమంగా నిర్వర్తించాలి. ప్రజాప్రతినిధులు అంటే ఇంత అద్భుతంగా ఉంటారా అని ప్రజలు మెచ్చుకునేలా పనిచేద్దాం. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా జనసేన కార్యాలయం తలుపులు తెరిచే ఉంటాయి' అని పవన్ చెప్పారు.

ఇది నిశ్శబ్ద సునామీ: మనోహర్

తెనాలి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డికి పరిపాలన చేతకాదనేది ప్రజలకు అర్థమైంది. ఎన్ని ఇబ్బందులు పెట్టినా భరించారు. చివరకు మార్పు కావాలని నిర్ణయించుకున్నారు. నిశ్శబ్ద సునామీని తీసుకొచ్చి రాజకీయంగా చరిత్ర సృష్టించారు. మేము కూడా ఒళ్లు దగ్గర పెట్టుకుంటాం. ప్రజల కోసం పనిచేస్తాం' అని జనసేన నేత నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జగన్ వల్ల రాష్ట్రానికి జరిగిన మేలుకంటే కీడే ఎక్కువ. రాష్ట్రాన్ని దారుణ పరిస్థితుల్లోకి తీసుకువెళ్లారు. విద్యా వ్యవస్థ సర్వనాశనం కావడమే కాకుండా, చిన్నారుల జీవితాలు నాశనమయ్యాయి. వీటన్నిటినీ దిద్దుబాటు చెయ్యాల్సిన అవసరం ఉంది. ప్రజల తీర్పు మాలో మరింత బాధ్యతను పెంచింది. రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తాం. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. మేము ఏదైనా తప్పు చేస్తే నిలదీసే స్వేచ్ఛ కూడా ప్రజలకు ఉంటుంది' అని మనోహర్ స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 6 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

సిడాక్‌లో పీజీ డిప్లొమాలు

పుణెలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సిడాక్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా(పీజీ డిప్లొమా) ఆగస్టు సెషన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి 24 వారాల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రాములు. సంస్థ నిర్దేశించిన మేరకు కోర్సులను ఆన్‌లైన్/ఫిజికల్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ సెషన్స్, ల్యాబ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటిని సి-డాక్, ఐసీటీ సంస్థలకు చెందిన నిపుణులు నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఉంటుంది. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది. హైదరాబాద్ సెంటర్లో మహిళలకు మాత్రమే హాస్టల్ అందుబాటులో ఉంది.

కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (పీజీ-డీఏసీ)
- పీజీ డిప్లొమా ఇన్ బిగ్ డేటా అనలిటిక్స్(పీజీ-డీబీడీఏ)
- పీజీ డిప్లొమా ఇన్ ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ (పీజీ-డీఈఎస్‌డీ)
- పీజీ డిప్లొమా ఇన్ ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ(పీజీ-డీఐటీఐఎస్ఎస్)
- పీజీ డిప్లొమా ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (పీజీ-డీఏఐ)
- పీజీ డిప్లొమా ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(పీజీ-డీఐఓటీ)
- పీజీ డిప్లొమా ఇన్ వీఎల్ఎస్ఐ డిజైన్(పీజీ-డీవీఎల్ఎస్ఐ)



- పీజీ డిప్లొమా ఇన్ మొబైల్ కంప్యూటింగ్(పీజీ-డీఎంసీ)
- పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్(పీజీ-డీఏఎస్ఎస్‌డీ)
- పీజీ డిప్లొమా ఇన్ రోబోటిక్స్ అండ్ అల్లైడ్ టెక్నాలజీస్(పీజీ-డీఆర్ఏటీ)
- పీజీ డిప్లొమా ఇన్ హెచ్‌పీసీ సిస్టం అడ్మినిస్ట్రేషన్(పీజీ-డీహెచ్‌పీసీఎస్ఏ)
- పీజీ డిప్లొమా ఇన్ ఫిన్‌టెక్ అండ్ బ్లాక్ చెయిన్ డెవలప్‌మెంట్(పీజీ-డీఎఫ్‌బీడీ)
- పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్స్(పీజీ-డీసీఎస్ఎఫ్)
- పీజీ డిప్లొమా ఇన్ అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్(పీజీ-డీయూఏఎస్‌పీ)

ట్రెయినింగ్ సెంటర్లు: హైదరాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, ఇండోర్, గువహటి, జైపూర్, కరాడ్, కొచ్చి, కోల్‌కతా, ముంబై, నవీ ముంబై, నాగ్‌పూర్, నాసిక్, న్యూఢిల్లీ, నోయిడా, పట్నా, పుణె, సిల్చార్, తిరువనంతపురం.

సీట్ల వివరాలు: హైదరాబాద్ సెంటర్లో మొత్తం 540 సీట్లు ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ 140, బిగ్ డేటా అనలిటిక్స్‌లో 60, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ 120, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ 40, వీఎల్ఎస్ఐ డిజైన్ 40, అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ 80 సీట్లు, అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్ 60 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులను ఫిజికల్ మోడ్‌లో నిర్వహిస్తారు.

- ఇతర సెంటర్లలోని కోర్సులు, సీట్ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

హైదరాబాద్ సెంటర్ కోర్సుల అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఐటీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/టెలి కమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఎమ్మెస్సీ/ఎంఎస్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సుకు ఎంసీఏ ఉత్తీర్ణులు; అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ కోర్సులకు ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంసీఏ/ఎంసీఎం/డిగ్రీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)/పీజీ (ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్) పూర్తిచేసినవారు; ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ కోర్సుకు పీజీ(మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులు; అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్‌కు ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంసీఏ/ఎంసీఎం/పీజీ డిగ్రీ(ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్) / డిగ్రీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)తో పాటు పీజీ(మేనేజ్‌మెంట్) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ కోర్సుకు మాత్రం 50 శాతం మార్కులు చాలు.

సిడాక్ కామన్ అడ్మిషన్ టెస్ట్ వివరాలు: ఇందులో ఎ, బి, సి అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌కు పరీక్ష సమయం గంట. ప్రతి సెక్షన్‌లో 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో ఉంటాయి. 'ఎ' సెక్షన్‌లో ఇంగ్లీష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, కంప్యూటర్ ఫండమెంటల్స్-ప్రోగ్రామింగ్ అంశాల నుంచి; 'బి' సెక్షన్‌లో సీ-ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, ఆబ్జెక్ట్ ఓరియంటెడ్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, నెట్‌వర్కింగ్, బిగ్ డేటా&ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాల నుంచి; 'సి' సెక్షన్‌లో కంప్యూటర్ ఆర్కిటెక్చర్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, మైక్రో ప్రాసెసర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సులకు అన్ని సెక్షన్‌ల పేపర్లు; మిగిలిన కోర్సులకు 'ఎ', 'బి' సెక్షన్‌ల పేపర్లు రాయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** 'ఎ' సెక్షన్ + 'బి' సెక్షన్ పేపర్లకు రూ.1550, 'ఎ' సెక్షన్ + 'బి' సెక్షన్ + 'సి' సెక్షన్ పేపర్లకు రూ.1750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూలై 2 నుంచి 6 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **సిడాక్ కామన్ అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** జూలై 6, 7
- **ఫలితాలు/ర్యాంక్‌లు విడుదల:** జూలై 19
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్:** జూలై 19 నుంచి 29 వరకు
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 16 నుంచి 22 వరకు
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 28
- **పీజీ డిప్లొమా కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.cdac.in

వేద విజ్ఞాన పీఠాల్లో అడ్మిషన్స్

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)- తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న వేద విజ్ఞాన పీఠాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. వైదిక సంప్రదాయం ప్రకారం ఉపనయనం పూర్తిచేసుకొన్న బాలురు దరఖాస్తు చేసుకోవచ్చు. వేద సంబంధిత కోర్సులకు నిర్దేశించిన ప్రకారం వయసు, విద్యార్హతలు ఉండాలి. అభ్యర్థులు టీటీడీ వెబ్‌సైట్‌లో ఇచ్చిన దరఖాస్తు ఫారాన్ని నింపి తాము చేర దలచుకొన్న వేద విజ్ఞాన పీఠానికి పంపుకోవాలి.

వేద విజ్ఞాన పీఠాలు

- ఎస్.వి.వేద విజ్ఞాన పీఠం, ధర్మగిరి, తిరుమల
- ఎస్.వి.వేద విజ్ఞాన పీఠం, కీసరగుట్ట, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
- ఎస్.వి.వేద విజ్ఞాన పీఠం, ఐ.భీమవరం, ఆకివీడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా
- ఎస్.వి.వేద విజ్ఞాన పీఠం, శ్రీమద్రామాయణ ప్రాంగణం, రామనారాయణ సారిక దగ్గర, విజయనగరం జిల్లా
- ఎస్.వి.వేద విజ్ఞాన పీఠం, ఎ.ఎం.ఆర్.ఎస్.ఎల్.బీ.సీ క్యాంపస్, పానగల్, రామగిరి, నల్లగొండ జిల్లా
- ఎస్.వి.వేద విజ్ఞాన పీఠం, శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం, కోటప్పకొండ, గురవాయపాలెం పోస్టు, వయా సాతులూరు, నర్సరావుపేట, గుంటూరు జిల్లా

కోర్సులు-అర్హతలు: రుగ్వేదం(శాకల శాఖ), శుక్ల యజుర్వేదం(కాణ్వశాఖ), కృష్ణ యజుర్వేదం(తైత్తిరీయ శాఖ), సామవేదం (కౌథుమ శాఖ), సామవేదం(జైమినీయ శాఖ), సామవేదం (రాణాయనీయ శాఖ) కోర్సుల వ్యవధి పన్నెండేళ్లు. కృష్ణ యజుర్వేదం(మైత్రాయణీయ శాఖ), అథర్వణ వేదం(శౌనక శాఖ) కోర్సుల వ్యవధి ఏడేళ్లు. వీటికి అయిదోతరగతి ఉత్తీర్ణులైన బాలురు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు పది నుంచి పన్నెండేళ్ల మధ్య ఉండాలి. దివ్య ప్రబంధం, వైఖానసాగమం, పాంచరాత్రాగమం, చాత్తాద శ్రీ వైష్ణవ ఆగమం, శైవాగమం, తంత్రసార ఆగమం, రుగ్వేద స్మార్తం(ఆశ్వలాయన), శుక్ల యజుర్వేద స్మార్తం(పారస్కర), కృష్ణయజుర్వేద స్మార్తం(ఆపస్తంబ), వైఖానస స్మార్తం, ఆపస్తంబ పౌరోహిత్యం(స్మార్తం), బోధాయనీయ పౌరోహిత్యం(స్మార్తం) కోర్సుల వ్యవధి ఎనిమిదేళ్లు. కనీసం ఏడోతరగతి ఉత్తీర్ణులు ఈ కోర్సులకు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు 12 నుంచి 14 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** www.tirumala.org

ఆంధ్ర యూనివర్సిటీలో బీఎస్సీ ఆనర్స్+ఎమ్మెస్సీ

ఆంధ్ర యూనివర్సిటీ(విశాఖపట్నం) ఆధ్వర్యంలోని కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ- 'నాలుగేళ్ల బీఎస్సీ ఆనర్స్+ఏడాది ఎమ్మెస్సీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'. ఏడాదికి రెండు చొప్పున మొత్తం పది సెమిస్టర్లు ఉంటాయి. ఇది సెల్ఫ్ సపోర్ట్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 44 సీట్లు ఉన్నాయి. వీటిలో నాలుగు సీట్లను ఈడబ్ల్యూఎస్ వర్గానికి కేటాయించారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఉండవు. ఎన్ఈపీ నిబంధనల ప్రకారం ఏటా నిర్దేశిత కోర్సులు పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగవచ్చు. మొదటి సంవత్సరం సర్టిఫికెట్, రెండో ఏడాది డిప్లొమా, మూడో ఏడాది డిగ్రీ, నాలుగో ఏడాది ఆనర్స్, అయిదో ఏడాది మాస్టర్స్ డిగ్రీ పొందవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం చాలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.800
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 12
- **కౌన్సెలింగ్:** జూన్ 14
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెద వాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో డిప్లొమాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ స్ట్రీమ్‌లో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి విభాగంలో 60 శాతం సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



డిప్లొమా ఇన్ అగ్రికల్చర్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి. జోగిపేటలో బాలికల పాలిటెక్నిక్; బసంత్‌పూర్, జమ్మికుంట, మల్‌తుమ్మెదలలో బాలుర పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్నాయి. వీటితోపాటు పాలెం, పొలాస, కంపసాగర్, మధిర, సిరిసిల్లా, రుద్రూర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 20 సీట్లు; నారాయణపేట పాలిటెక్నిక్ కళాశాలలో 40 సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో మొత్తం 390 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. సంగారెడ్డి-కందిలోని అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. మెదక్-తునికి, ఖమ్మం-సత్తుపల్లి, సంగారెడ్డి-తుర్కాల ఖానాపూర్‌లలో ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 30 చొప్పున మొత్తం 90 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వికారాబాద్-గింగుర్తిలోని ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డ్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఎన్ఐఓఎస్, తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 35 శాతం మార్కులు తప్పనిసరి. అగ్రికల్చరల్ విభాగంలో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి 22 ఏళ్లు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూన్ 25
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** జూన్ 27
- **వెబ్‌సైట్:** diploma.pjtsau.ac.in

SCHOLARSHIP ALERT

Kotak Junior Scholarship

Description: Under the CSR initiative on Education & Livelihood by the Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for Kotak Junior Scholarship 2024-25 from Class 10 passed students within the Mumbai Metropolitan Region.

Eligibility: Applicants must have obtained over 85% marks in their Class 10 board examination (SSC/CBSE/ICSE) in 2024.



- They must have secured admission in Class 11 at junior colleges/schools for Arts, Commerce or Science streams in the Mumbai Metropolitan Region (MMR) for the academic year 2024-25.
- The annual family income of applicants must be INR 3,20,000 or below.
- Students must reside within the Mumbai Metropolitan Region (MMR).

Prizes & Rewards: Scholarship of INR 3,500 per month along with mentorship support, academic assistance, career guidance, and exposure visits.

Last Date to Apply: 30-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KJSP2

Aspire Leaders Program

Description: The global Aspire Leaders Program is a fully funded 14-week online leadership program offered by the Aspire Institute. It has been designed to help students unlock their potential and become well-rounded professionals.

Eligibility: This program is open for students within the age group of 18-29 years. The annual household income of the applicants should be less than 8,00,000. Only first-generation learners are eligible to apply for the program. Participants who have enrolled in or completed an undergraduate program in the last three years can apply. Applicants must have an intermediate level of proficiency in English.

Prizes & Rewards: Free access to training modules, live sessions by Havard faculty, and much more

Last Date to Apply: 03-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ALPS1

Mirae Asset Foundation Scholarship Program

Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or postgraduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/MAFS1

buddy4study.com

లిటిల్స్



అత్యాశఫలం

చక్రపురం అనేఊరిలో గోవిందు అనే యువకుడు పశువులకాపరి ఉండేవాడు. రోజూ కొండ ప్రాంతానికి ఆవులను తోలుకుపోయి, వాటిని మేపి చీకటి పడే వేళకి తిరిగి తీసుకొచ్చేవాడు. వాటిలో తనకు బాగా ఇష్టమైన ఆవు మెడలో గోవిందు ఒక గంట కట్టాడు. ఆ గంట శబ్దం సహాయంతో ఆ ఆవు ఎక్కడున్నా ఎటూ తప్పిపోకుండా గోవిందు దగ్గరకు వచ్చేసేది. ఒక రోజు పక్క ఊరికి చెందిన రాజు అనే వ్యక్తి గోవిందు ఆవును ఎలాగైనా కొట్టేయాలి అనుకుని గోవిందు వద్దకు వచ్చి, నీ ఆవు మెడలో కట్టిన గంట చాలా బాగుంది. నువ్వు అడిగినంత సొమ్ము ఇస్తాను ఆ గంటను నాకు అమ్ముతావా అని అడిగాడు. గోవిందు అతని మాటలకు నవ్వుకుని, ఇతడెవరో ఉత్త వెర్రి బాగుల వాడిలాగా ఉన్నాడు,కేవలం గంట కొనేసి అడిగినంత సొమ్ము ఇస్తా అన్నాడు అనుకుంటూ గంట ఖరీదు కంటే ఎక్కువ సొమ్ము తీసుకుని గంటను అతనికి ఇచ్చివేశాడు. ఆ రోజు సాయంత్రం మిగతా ఆవులన్నీ ఇంటికి వచ్చాయి. కానీ మెడలో గంట లేనిఆవు మాత్రం. రాలేదు గంట కొన్న పక్క ఊరివ్యక్తే ఆవును తీసుకెళ్లి ఉంటాడని ఎంతో ఆలస్యంగా గోవిందుకు స్ఫురించింది. అత్యాశకు పోతే మన దగ్గర ఉన్నది కూడా పోతుంది అనుకుని అపుడు గోవిందు విచారించాడు కానీ ఫలితం లేక పోయింది.


సరైన నీడ ఏది?



7 తేడాలు గుర్తించండి







డైలీ సుడోకు - 325

8		1				5		2
				8		9		
2					1			4
			6				5	
5			8		2			3
	4				9			
6			3					9
		4		7				
1		3				8		6

సుడోకు - 324 సమాధానం

8	2	9	3	6	4	5	1	7
1	4	5	7	8	9	6	2	3
3	6	7	1	5	2	8	4	9
9	8	2	5	3	1	7	6	4
6	3	4	8	9	7	2	5	1
7	5	1	2	4	6	3	9	8
5	9	8	4	2	3	1	7	6
4	7	3	6	1	5	9	8	2
2	1	6	9	7	8	4	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుండి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.